మంగళవారం
8-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 196
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

గాజాపై వైమానిక దాడి... 32 మంది మృతి

టెల్అవీవ్: ఇజ్రాయిల్ మరోసారి గాజాపై వైమానిక దాడులతో విరుచుకుపడింది. తాజాగా ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 32 మంది పలస్తీనియన్లు మృతి చెందినట్లు పలస్తీనా వైద్యాధికారులు వెల్లడించారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 9 మందితోపాటు ఐదుగురు పసి పిల్లలు, నలుగురు మహిళలు కూడా ఉన్నారని తెలిపాయి. హమాస్‌తో 17 నెలలుగా కొనసాగుతున్న పోరులో ఈ ఏడాది జనవరి నుంచి కాల్పుల విరమణ అమల్లో ఉన్నా, ఇజ్రాయిల్ దాడులు కొనసాగిస్తోంది. ఒప్పందంలో మార్పులు చేయడానికి హమాస్ తిరస్కరించడంతో దాడులకు పాల్పడాలని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తమ సైన్యాన్ని ఆదేశించినట్లు సమాచారం.

మహా పతనం

- స్టాక్ మార్కెట్లకు ట్రంప్ దెబ్బ
- కుప్పకూలిన సెన్సెక్స్, నిఫ్టీ
- రూ.లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సుంకాలు... ప్రపంచ మార్కెట్లను అతలాకుతలం చేస్తున్నాయి. ట్రంప్ ప్రతీకార సుంకాలపై చైనా సైతం పన్నులు ప్రకటించింది. ప్రపంచ వాణిజ్య యుద్ధం తప్పదనే సంకేతాల మధ్య భయాందోళనలు పెరిగాయి. దానికి తోడు అమెరికాలో మాంద్యం భయాలు ఎక్కువయ్యాయి. పెట్టుబడిదారుల్లో అభద్రతా భావం చోటుచేసుకున్న ఫలితంగా మార్కెట్లలో భారీగా అమ్మకాలు జరిగాయి. కనివినీ ఎరుగని రీతిలో దేశీయ సూచీలు కుప్పకూలాయి. కేవలం 10 సెకన్ల వ్యవధిలోనే మదుపర్ల సంపద ఏకంగా రూ.20 లక్షల కోట్ల మేర ఆవిరైందంటే... మార్కెట్ల పతనం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. సోమవారం తొలుత ఆసియా మార్కెట్లు భారీగా నష్టాలు నమోదు చేయగా... తర్వాత ఐరోపా మార్కెట్లు కూడా అదే బాటలో పయనించాయి. ఇదే కోవలో భారత స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. సెన్సెక్స్ మూడుశాతానికిపైగా నష్టపోయింది. సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు పదినెలల కనిష్ఠానికి చేరాయి. నిఫ్టీలో లిస్టయిన కంపెనీల విలువ రూ.20 లక్షల కోట్ల వరకు పతనమైంది. క్రితం సెషన్ (శుక్రవారం ముగింపు 75,364.69)తో పోలిస్తే సెన్సెక్స్ 71,449.94 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ దాదాపు 4 వేల పాయింట్ల దాకా పతనమైంది. కేవలం పది సెకన్లలోనే మార్కెట్‌లో రూ.18 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైంది. ఇంట్రాడేలో 73,403.99 పాయింట్ల గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్...

- మిగతా 2 లో

వక్ఫ్‌పై అత్యవసర విచారణకు సుప్రీం ఓకే

న్యూఢిల్లీ: ఇటీవల పార్లమెంటు ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టం-2025 రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై అత్యవసర విచారణకు సుప్రీం కోర్టు అంగీకారం తెలిపింది. ఇందుకుగాను ఆయా పిటిషన్ల లిస్టింగ్‌కు అనుమతి ఇచ్చింది. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఎదుట సోమవారం ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ మెన్షనింగ్ చేస్తూ... త్వరితగతిన విచారణ చేపట్టాలని కోరారు. దీంతో సదరు పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

- మిగతా 2 లో

ఆ పోలీసులపై ఎఫ్ఐఆర్

బద్లాపూర్ ఎన్‌కౌంటర్‌పై ముంబై హైకోర్టు

ముంబై: మహారాష్ట్రలోని థానె జిల్లా బద్లాపూర్‌లోని ఓ పాఠశాలలో ఇద్దరు చిన్నారులపై గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన లైంగిక దాడి కేసు సంచలనమైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు అక్షయ్ షిండే ఆ తర్వాత పోలీసు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. దీనిపై ముంబై హైకోర్టు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. కాల్పుల్లో పాల్గొన్న ఐదుగురు పోలీసులపై రెండ్రోజుల్లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేయాలని క్రైం బ్రాంచ్ జాయింట్ పోలీస్ కమిషనర్‌కు సూచించింది. జస్టిస్ రేవతి మోహిత్ దేరే, డాక్టర్

- మిగతా 2 లో

వంట గ్యాస్ మంట

సిలిండర్ ధర రూ.50 పెంపు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వంట గ్యాస్ సిలిండర్ ధరలను కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచింది. గృహావసరాలకు వినియోగించే 14.2 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌పై రూ.50 చొప్పున పెంచుతున్నట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురీ సోమవారం వెల్లడించారు. ఈ ధరల పెంపు ఉజ్వల పథకం లబ్ధిదారులకు సైతం వర్తింప జేస్తున్నట్లు తెలిపారు. తాజా పెంపుతో సాధారణ వినియోగదారులు, ఉజ్వల పథకం లబ్ధిదారులు ఒక్కో సిలిండర్‌పై అదనంగా రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. గతవారంలో హోటళ్లు, రెస్టారెంట్లు సహా వాణిజ్య అవసరాల కోసం వినియోగించే వాణిజ్య సిలిండర్ గ్యాస్ ధరను రూ.41 మేర తగ్గించిన విషయం తెలిసిందే. రాష్ట్రాల ఆధారంగా ఈ తగ్గింపులో మార్పు ఉంటుంది. కాగా, చమురు ధరలపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని రూ.2 పెంచుతూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదేసమయంలో పెట్రో ధరల పెంపుపై కేంద్రం స్పష్టత ఇచ్చింది. వినియోగదారులకు సంబంధించి ధరల్లో ఎలాంటి మార్పు ఉండబోదని తెలిపింది. ఎక్సైజ్ డ్యూటీ పెరుగుదల నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరల్లో పెరుగుదల ఉండదని చమురు మార్కెటింగ్ కంపెనీలు సమాచారం ఇచ్చినట్లు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వశాఖ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సృష్టించిన వాణిజ్యయుద్ధం కారణంగా అంతర్జాతీయ ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ తరుణంలో ఎక్సైజ్ సుంకం పెంపు అనివార్యమైంది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినందున ఈ అదనపు భారాన్ని చమురు సంస్థలు సర్దుబాటు చేసుకుంటాయని తెలుస్తోంది.

బనకచర్ల వివరాలివ్వండి

జీఆర్ఎంబీకి రాష్ట్ర ప్రభుత్వ అధికారుల విజ్ఞప్తి

- ఈ ప్రాజెక్టు వల్ల నష్టపోతామని వెల్లడి
- మిగులు జలాల సద్వినియోగానికేనన్న ఏపీ
- డీపీఆర్ కూడా తయారు చేయలేదని వాదన
- ప్రాజెక్టులు అప్పగింతపైనా కుదరని సయోధ్య

విశాలాంధ్ర- హైదరాబాద్: బనకచర్ల ప్రాజెక్టుకు ప్రతిపాదన దశలోనే ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే ఎగువన ఉన్న తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు స్పష్టం చేశారు. అయితే కేవలం సముద్రంలో కలిసే మిగులు జలాలను సద్వినియోగం చేసుకోవడానికే తప్ప, తెలంగాణను నష్టపర్చడానికి కాదని ఏపీ ప్రభుత్వం చెపుతోంది. గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) చైర్మన్ ఏకే ప్రధాన్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని జలసౌధలో సోమవారం జీఆర్ఎంబీ సమావేశం జరిగింది. ఏపీ ప్రభుత్వం తలపెట్టిన గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు గురించి ఈ సమావేశంలో తెలంగాణ ప్రస్తావించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి సమాచారం, వివరాలు దాచిపెడుతోందని తెలంగాణ అధికారులు ఆరోపించారు. ప్రాజెక్టు అంశంపై బోర్డుకు కేంద్రం నుంచి లేఖ వచ్చి 5 నెలలు గడిచాయని, కేంద్రం నుంచి లేఖలు వచ్చినా తమకు కనీస సమాచారం ఇవ్వలేదని తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టు పూర్తి వివరాలు, దానివల్ల తెలంగాణపై ప్రభావం తదితర వివరాలు ఏపీ ప్రభుత్వం అందించాలని తెలంగాణ అధికారులు బోర్డును కోరారు. అనుమతులు లేకుండా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడానికి సిద్ధమవుతున్నారని తెలంగాణ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఏపీ జలవనరుల శాఖాధికారులు బనకచర్ల ప్రాజెక్టుకు ఇంకా డీపీఆర్ కూడా తయారు చేయలేదని వివరణ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల తెలంగాణకు ఎటువంటి నష్టం ఉండదని, కేవలం వరద నీటిని, సముద్రంలో వృథాగా కలిసే మిగులు జలాలను సద్వినియోగం చేసుకోవడానికి మాత్రమే ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తున్నామని వివరించారు. మరోవైపు పెదవాగు ప్రాజెక్టు ఆధునీకరణ పనులపై సమావేశంలో చర్చించారు. రూ.15 కోట్లతో తక్షణ మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జీఆర్ఎంబీ కార్యదర్శి అజగేషన్ వ్యవహార శైలిని తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. రాష్ట్రాలను సంప్రదించకుండానే బోర్డు సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా జీఆర్ఎంబీలో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న ఏపీ, తెలంగాణకు చెందిన

- మిగతా 2 లో

ఎమ్మెల్సీగా నెల్లికంటి సత్యం ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర - హైదరాబాద్: శాసన మండలిలో సోమవారం పట్టభద్రులు, టీచర్, ఎమ్మెల్యే కోటాకింద నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు సోమవారం ప్రమాణ్య స్వీకారం చేశారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణస్వీకారం చేయించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లికంటి సత్యంతో పాటు విజయశాంతి, శ్రీపాల్ రెడ్డి, శంకర్ నాయక్, మల్కా కొమురయ్య , అంజి రెడ్డి తదితరులు ప్రమాణం చేశారు. బీఆర్ఎస్ నుంచి ఎన్నికైనా దాసోజు శ్రవణ్ మరో రోజు ప్రమాణ స్వీకారం చేస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా... ఎమ్మెల్యే కోటాలో కాంగ్రెస్ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం, బీఆర్ఎస్ నుంచి దాసోజు శ్రవణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కరీంనగర్ పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమరయ్య విజయం సాధించారు.

ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి గెలిచారు. శాసన మండలి వైస్ ఛైర్మన్ బండా ప్రకాశ్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ ఏవిన్ రెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

బీజేపీకి రూ.2243 కోట్ల విరాళాలు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరంలో జాతీయపార్టీలు పొందిన విరాళాల వివరాలను ఏడీఆర్ (అసోసియేటెడ్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్) వెల్లడించింది. దీని ప్రకారం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి అత్యధిక విరాళాలు అందాయి. ఆ పార్టీకి రూ.2243 కోట్లు సమకూరాయి. అన్ని పార్టీలకు వచ్చిన విరాళాల మొత్తం రూ.2,544.28 కోట్లుగా ఉంది. గత ఏడాది ఈ సంఖ్య రూ.12,547 కోట్లు. ఈ ఏడాది వచ్చిన మొత్తం విరాళాల్లో ఒక్క కాషాయ పార్టీయే 88 శాతం దక్కించుకుంది.

'సుప్రీం' ఆదేశంతో కంచ గచ్చిబౌలిలో పోలీసు పహారా తప్పనిసరి

- 400 ఎకరాలు మినహా క్యాంపస్ నుంచి బలగాలు ఉపసంహరిస్తాం
- అత్యున్నత న్యాయస్థానం ఆదేశిస్తేనే భూముల సర్వేకు అనుమతి
- భేటీలో 'హెచ్‌సీయూ' బృందానికి త్రిసభ్య కమిటీ స్పష్టం

విశాలాంధ్ర - హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల సమస్యపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల సబ్ కమిటీ సచివాలయంలో సోమవారం సమావేశమైంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన కమిటీ సభ్యులు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా కాంగ్రెస్ తెలంగాణ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, వంశీచందర్ రెడ్డి హాజరయ్యారు. సబ్ కమిటీతో హైదరాబాద్ విశ్వవిద్యాలయ ఉపాధ్యాయ సంఘం, పౌర సంఘాల ప్రతినిధులు భేటీ అయి వివిధ డిమాండ్లను మంత్రుల కమిటీ దృష్టికి తీసుకు వచ్చారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో పోలీసు బలగాలను ఉపసంహరణ నిషేధాజ్ఞలు వెనక్కి తీసుకోవాలని... ప్రభుత్వం

- మిగతా 2 లో

మూడు రోజులు వర్షాలు

- బంగాళాఖాతంలో అల్పపీడనం
- ఉద్యానవన రైతుల్లో ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం ఉదయం దక్షిణ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది మంగళవారం వరకు వాయవ్య దిశగా నైరుతి బంగాళాఖాతం వైపు కదిలే అవకాశం ఉన్నట్లు విశాఖపట్నం వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆ తర్వాత 48 గంటలపాటు ఉత్తరం వైపు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఆహాహా.. ఏం అభివృద్ధి చెందావయ్యా!

నైపుణ్య మానవ వనరులుగా యువతను తీర్చిదిద్దుతాం

శ్రీధర్ బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను అన్ని రంగాల్లో అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులుగా తీర్చి దిద్దుతామని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ ఆఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌ఐసీ)లో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులకు చిరునామాగా తెలంగాణను మార్చాలనే సంకల్పంతోనే యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. పరిశ్రమలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ కోర్సుల రూపకల్పనలో పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న కోర్సులపై దృష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులకు

- మిగతా 2 లో

గ్రీన్‌పవర్, ఆర్ఆర్ఆర్, మూసీ, విద్య ప్రాధాన్య రంగాలు: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: గ్రీన్ పవర్, రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ పునర్జీవం, విద్య ప్రభుత్వ ప్రాధాన్య రంగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అంబేద్కర్ సచివాలయంలో సోమవారం సింగపూర్ కాన్సుల్ జనరల్ ప్రతినిధి బృందంతో ఆయన సమావేశం అయ్యారు. గ్రీన్ పవర్ పాలసీలో భాగంగా సోలార్, హైడ్రో, పంప్‌డ్ స్టోరేజీ విభాగాలపై దృష్టి పెట్టినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్టు సింగపూర్ ప్రతినిధి బృందానికి వివరించారు. మొదటి దశలో రూ.600 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేశామని, ప్రతి పాఠశాలను 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నామన్నారు. ఇది ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్టు అని వివరించారు. సింగపూర్ కాన్సల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ మాట్లాడుతూ తెలంగాణతో ఆర్థిక సంబంధాలు బలోపేతం చేసుకునేందుకు సింగపూర్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయన్నారు. సింగపూర్ పొలిటికల్ కాన్సుల్ వైష్ణవి వాసుదేవన్, సింగపూర్ హై కమిషన్ ప్రథమ ఆర్థిక సెక్రటరీ, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ప్రధాన కార్యదర్శులు - 9
ఏబీ బర్ధన్

దేవగౌడ నాయకత్వంలో 1996 లో కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు అప్పటి దాకా సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఇంద్రజిత్ గుప్తా కేంద్ర ప్రభుత్వంలో హోంమంత్రి బాధ్యతలు చేపట్టవలసి వచ్చింది. ఆ స్థితిలో అర్ధేందు భూషణ్ బర్ధన్ (ఏబీ బర్ధన్‌గా ప్రసిద్ధుడు) సీపీఐ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. 16 ఏళ్ల పాటు బర్ధన్ ఆ బాధ్యతలు నిర్వర్తించారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

అమెరికా కంపెనీలను వేధించం: చైనా

బీజింగ్: ప్రపంచదేశాలపై సుంకాలతో విరుచుకుపడుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరలేపిన నేపథ్యంలో తమ దేశంలో అమెరికా సంస్థల పెట్టుబడులను కాపాడుతామని చైనా హామీ ఇచ్చింది. మార్కెట్లు కుప్ప కూలుతున్న నేపథ్యంలో తమ దేశంలో పెట్టుబడులు పెట్టిన విదేశీ కంపెనీల హక్కులు కాపాడతామని ఆ దేశ వైస్ కామర్స్ మినిస్టర్ లింగ్ జి పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన వాణిజ్య చర్చలకు డిప్యూటీ ప్రతినిధిగా కూడా వ్యవహరిస్తున్నారు. దాదాపు 20కి పైగా అమెరికన్ల నిధులతో నడిచే కంపెనీల ప్రతినిధులు దీనిలో పాల్గొన్నారు. వీటిల్లో టెస్లా, జీఈ హెల్త్‌కేర్‌సహా వివిధ సంస్థలున్నాయి. చైనా ఎప్పటికీ విదేశీ పెట్టుబడులకు ఆదర్శనీయమైన, సురక్షితమైన, నమ్మకమైన ప్రదేశంగా ఉంటుందని లింగ్ జి వెల్లడించారు. ట్రంప్ వాణిజ్య యుద్ధాన్ని ఎంత తీవ్రం చేసినా... తాము అమెరికా సంస్థలను శిక్షించే కార్యక్రమం చేపట్టబోమని... ఆ సంస్థల హక్కులు, ప్రయోజనాలను తమ దేశ చట్టాలకు అనుకూలంగా కాపాడతామన్నారు. విదేశీ సంస్థల సమస్యలు, డిమాండ్లను వీలైనంత వేగంగా పరిష్కరిస్తామని చెప్పారు. వాణిజ్య భాగస్వాములపై వేధించేలా పన్నులు విధించడం... బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను దెబ్బతీస్తుందన్నారు. కాగా చైనా విదేశాంగ శాఖ కూడా అమెరికా సుంకాలపై తీవ్రంగా స్పందించింది. అమెరికా ఏకపక్ష, రక్షణాత్మక వైఖరికి ఈ చర్యలు నిదర్శనమని పేర్కొంది. ఈ మేరకు విదేశాంగశాఖ ప్రతినిధి లిన్‌జియాన్ ఓ ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ నిబంధనలు కాలరాస్తూ... అమెరికాకు తొలి ప్రాధాన్యమివ్వడం ఓ రకంగా ఏకపక్ష వైఖరి, ఆర్థిక వేధింపులకు చిహ్నమన్నారు. కొత్తగా విధించిన పన్నులు ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలను తీవ్రంగా దెబ్బతీసి.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతాయని హెచ్చరించారు.

రోగం తగ్గాలంటే...చేదు గుళిక మింగాల్సిందే: ట్రంప్

వాషింగ్టన్: తమ దేశంలో వాణిజ్య లోటు పరిష్కారమయ్యేవరకు సుంకాలు తగ్గించే ప్రసక్తే లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తేల్చి చెప్పారు. ఒక్కోసారి రోగం తగ్గాలంటే చేదుగా ఉన్నా సరే మందు మింగాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఇటీవల ట్రంప్ ప్రపంచ దేశాలపై సుంకాల విధింపు ప్రకటన చేయడంతో అమెరికా సహా ప్రపంచ మార్కెట్లు కుదేలవడంతో ఆర్థిక మాంద్యం భయాలు నెలకొన్నాయి. మరో పక్క అమెరికాలోనే ట్రంప్ పోకడలపై పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. ఈ పరిస్థితులపై ట్రంప్ స్పందిస్తూ ... "ప్రపంచ మార్కెట్లు పతనమవ్వాలని నేను కోరుకోలేదు. భారీ అమ్మకాల గురించి కూడా ఆందోళన చెందడం లేదు. ఎందుకంటే కొన్నిసార్లు సమస్య పరిష్కారం కోసం మెడిసిన్ తీసుకోవాల్సి ఉంటుంది. నేను చాలామంది నేతలతో మాట్లాడా. ఐరోపా, ఆసియా దేశాధినేతలతో చర్చించా. ఇప్పుడు వాళ్లు మాతో ఒప్పందం కుదుర్చుకోవడం కోసం ఆరాటపడుతున్నారు. వారికి నేను ఒకటే చెప్పా... వాణిజ్య లోటును మేం కొనసాగించలేం. అది పరిష్కారమైతేనే సుంకాలపై చర్చలకు ముందుకొస్తాం" అని ట్రంప్ పేర్కొన్నారు. చైనా, ఈయూ దేశాలతో భారీ ఆర్థికలోటుకు సుంకాలే తగిన పరిష్కారమని చెబుతూ... తన చర్యల ఫలితంగా అమెరికాలోకి బిలియన్ డాలర్ల ప్రవాహం మొదలైందని చెప్పుకొచ్చారు. తన పాలనా కాలంలో బైడెన్ నిద్రపోవడం వల్ల వివిధ దేశాల మిగులు పెరిగిపోయిందని విమర్శించారు. తాము కనుక పన్నులు తగ్గిస్తే.. వీడియో షేరింగ్ యాప్ టిక్‌టాక్ డీల్‌ను చైనా 15 నిమిషాల్లో ఆమోదించేస్తుందని ట్రంప్ తెలిపారు. అమెరికా టారిఫ్‌లను విధించిన తర్వాతనే చైనా వైఖరిలో మార్పు వచ్చిందని అభిప్రాయపడ్డారు. ఆయన ఎయిర్ ఫోర్స్‌వన్‌లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "మా వద్ద టిక్‌టాక్‌కు సరిపోయే ఓ డీల్ ఉంది. కానీ, సుంకాల కారణంగా చైనా ఆ ఒప్పందాన్నిమార్చింది. ఒక వేళ నేను కొంచెం పన్నులు తగ్గించినా.. వారు ఆ డీల్‌ను 15 నిమిషాల్లో ఓకే చేస్తారు. పన్నుల శక్తి ఏమిటో ఇది తెలియజేస్తోంది" అని పేర్కొన్నారు. టిక్‌టాక్‌కు అమెరికాలో 17 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. దానిని మాతృసంస్థ నుంచి విడదీసేలా గతేడాది అమెరికా అమల్లోకి తెచ్చిన ఓ చట్టం కారణంగా... ప్రస్తుతం అది షట్‌డౌన్ ముప్పును ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో చైనాయేతర కొనుగోలుదారుని వెతుక్కొనేందుకు గతవారం ట్రంప్ సర్కారు ఆ సంస్థకు 75 రోజుల గడువును పొడిగించింది.

సౌదీలో అక్రమ వలసదారుల ఏరివేత

రియాద్: సౌదీ అరేబియా ప్రభుత్వం అక్రమ వలసదారుల ఏరివేత ప్రారంభించింది. ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. కేవలం వారం రోజుల్లోనే సుమారు 18వేలమంది అక్రమ వలసదారులను అరెస్టు చేసింది. వీరంతా నివాసిత, కార్మిక, సరిహద్దు భద్రతా నియమాలను ఉల్లంఘించినట్లు అక్కడి ప్రభుత్వం పేర్కొంది. మార్చి 27 నుంచి ఏప్రిల్ 2 వరకు వివిధ ప్రభుత్వ సంస్థలు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో వీరిని అదుపులోకి తీసుకొన్నారు. ముఖ్యంగా అక్రమంగా నివాసం ఉంటున్నవారు, సరిహద్దులు దాటి దేశంలోకి చొరబడిన వారు లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది. వీరిలో 12,995 మంది అక్కడి నివాస చట్టాలను, 3,512 మంది సరిహద్దు భద్రతా చట్టాలను, 1,900 మంది కార్మిక చట్టాలను ఉల్లంఘించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. అరెస్టు అయినవారిలో అత్యధికంగా 66శాతం మంది ఇథోపియా నుంచి వచ్చినట్లు గుర్తించారు. ఆ తర్వాత 28శాతం మంది యెమన్ వాసులు. ఇక నిబంధనలు ఉల్లంఘించిన మొత్తం 27,288 మందిపై ఆయా దౌత్య కార్యాలయాలకు సమాచారం అందించారు. వీరిలో 7,523 మందిని నేరుగా దేశ బహిష్కరణ చేశారు. ఇక అక్రమ వలసదారులకు సాయం చేసే వారిపైనా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి 21 మందిని అరెస్టు చేశారు. వీరు ఆశ్రయం ఇవ్వడం, రవాణాకు సహకరించడం వంటివి చేశారు. అక్రమ వలసదారులకు ఎవరు సాయం చేసినా 15 ఏళ్ల జైలు, మిలియన్ సౌదీ రియాల్స్ జరిమానా, ఆస్తులు, వాహనాల సీజ్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఆ వీసాల జారీపై నిషేధం

సౌదీ అరేబియా మొత్తం 14 దేశాలకు చెందిన పౌరులకు కొన్ని రకాల వీసాలను జారీ చేయడంపై నిషేధం విధించింది. ఈ జాబితాలో భారత్, పాక్, బంగ్లాదేశ్ ఉన్నాయి. జూన్ మధ్య వరకు ఉమ్రా, బిజినెస్, ఫ్యామిలీ విజిట్ వీసాలు ప్రభావితం కానున్నాయి. సరైన రిజిస్ట్రేషన్ లేకుండా హజ్ యాత్ర చేసేవారిని అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకొన్నారు.

తాగునీటి వెతలు తప్పవా?

శ్రీశైలం జలాశయం వెలవెల

- భారీగా పడిపోతున్న నీటి నిల్వలు
- వర్షాకాలంలో నీరు సముద్రంపాలు
- పూడిక పేరుకుపోవడంతో తగ్గుతున్న సామర్థ్యం
- ప్రాజెక్టుల నిర్మాణానికి చొరవ చూపని పాలకులు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు:

శ్రీశైలం జలాశయం నీరు లేక వెలవెలబోతోంది. నీరు నిల్వలు భారీగా పడిపోవడంతో వేసవిలో తాగునీటి వెతలు తప్పవా అన్న ప్రశ్న ఉత్పన్నమౌతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కృష్ణా పరీవాహక ప్రాంతంలో పెద్దఎత్తున వరదలు రావడంతో జలాశయానికి భారీగా నీరు వచ్చి చేరింది. కృష్ణా డెల్టాకు ఎగువ నుంచి వచ్చిన భారీ వర్షాలు విజయవాడను ముంచెత్తాయి. దీంతో నీటినంతా సముద్రంలోకి వదలివేశారు. ఎన్నడూ లేని విధంగా శ్రీశైలం జలాశయానికి 1,575 టీఎంసీల నీరు వచ్చి చేరింది. జలాశయం నీటి సామర్థ్యం 215.80 టీఎంసీలు మాత్రమే. దీంతో పెద్దఎత్తున నీరు వచ్చి చేరడంతో దిగవకు వదలి వేశారు. ప్రాజెక్టుల నిర్మాణానికి పాలకులు చొరవ చూపకపోవడంతో నీరంతా వృధాగా సముద్రంలో కలసిపోయింది. గుండ్రేవుల వద్ద 20 టీఎంసీల సామర్థ్యం గత ప్రాజెక్టు నిర్మాణం చేపడితే సుమారు రెండులక్షల ఎకరాలకు సాగునీరుతోపాటు కర్నూలు నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు తాగునీటికి ఇబ్బందులు ఉండవు. ప్రాజెక్టు నిర్మాణంలో నిర్లక్ష్యం చేయడంతో వందల టీఎంసీల నీరు సముద్రంలో కలసి పోతున్నా ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం జలాశయంలో 885 అడుగులకుగాను 820.60 అడుగులు నీరు ఉంది. నీటి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 41.27 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. అవుట్‌ఫ్లో ఏపీలో ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు పంటల కోసం 490 క్యూసెక్కులు, తెలంగాణాలో మహాత్మగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంకు 2400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నీటి నిల్వలు పెద్దఎత్తున పడిపోవడంతో ముందుముందు తాగునీటి ఇబ్బందులు ఏర్పడతాయన్న ఆందోళన నెలకొంది. ఇప్పటికే కర్నూలు జిల్లాలో తాగునీటి కోసం తుంగభద్ర నది నుంచి ఆదివారం ఐదు క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రాబోయే రోజుల్లో ఎండలు పెరిగితే నీటి ఇక్కట్లు మరింత పెరిగే అవకాశాలు ఉండ టం... జలాశయంలో నీటి నిల్వల శాతం పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

జలాశయంలో పూడిక పెరిగిపోవడంతో నీటి నిల్వలు కూడా తగ్గుముఖం పట్టాయి. 1960లో ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించి 1976లో పూర్తి చేశారు. ఆ సమయంలో జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 308 టీఎంసీలు ఉన్నట్లు అప్పటి రికార్డుల ద్వారా తెలుస్తుంది. అయితే ప్రస్తుత నీటి సామర్థ్యం 215.80 అని అధి కారులు తెలిపారు.

యువతను తీర్చిదిద్దుతాం

(మొదటిపేజీ తరువాయి)

సాఫ్ట్ స్కిల్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రముఖ విద్యా, పరిశోధన, టాస్క్, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ(డీఈఈటీ) తదితర సంస్థలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రా, స్కిల్ వర్సిటీ వీసీ సుబ్బారావు, ఓఎస్డీ చమన్ మెహతా పాల్గొన్నారు.

2 లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేస్తాం

తెలంగాణ నుంచి రెండు లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్ బాబు అన్నారు. కాన్సులేట్ జనరల్ ఆఫ్ సింగపూర్ 'ఎడ్గర్ పాంగ్' నేతృత్వంలో ఆ దేశ ప్రతినిధులు సోమవారం బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. 'ఎమర్జింగ్ టెక్నాలజీస్' కు హబ్ గా తెలంగాణను మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను మంత్రి వారికి వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పుతున్న ఫ్యూచర్ సిటీ, అక్కడే ఏర్పాటు చేయబోతున్న ఏఐ యూనివర్సిటీ గురించి తెలిపారు. ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యమయ్యేందుకు అనేక అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చాయన్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)కు హబ్ గా హైదరాబాద్ మారుతుందన్నారు. ఏడాది వ్యవధిలోనే ఐటీ, హాస్పిటాలిటీ, ఇతర రంగాలకు చెందిన 70 జీసీసీలు ప్రారంభమయ్యాయని చెప్పారు. పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. టెక్నాలజీ, స్కిల్ డెవలప్ మెంట్, ఇతర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాన్సుల్ వైష్ణవి వాసుదేవన్, ఫస్ట్ సెక్రటరీ(ఎకానమిక్) వివేక్ రఘు రామన్, ఎంటర్ ప్రైజ్ సింగపూర్ రీజినల్ డైరెక్టర్(ఇండియా-సౌత్) డేనిస్ టాం తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు సలహా మండలి

ఆర్టీజీఎస్‌పై సమీక్షలో చంద్రబాబు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

రాష్ట్రంలో మరింత సుపరిపాలన అందించేందుకు వీలుగా ప్రత్యేక సలహా మండలిని ఏర్పాటు చేయాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ సలహా మండలిలో గేట్స్ ఫౌండేషన్ నుంచి మద్రాసు ఐఐటీ, ఇతర ప్రతిష్ఠాత్మక సంస్థలకు చెందిన 10 మంది నిపుణులను సభ్యులుగా నియమించాల న్నారు. ప్రజలకు మరింత మేలు చేసేలా, సుపరిపాలన అందించేందుకు ఇంకా ఏమేమి చేయొచ్చనే దానిపై సలహా మండలి అధ్యయనం చేసి సూచనలు చేసేలా ఉండాలన్నారు. సోమవారం సచివాలయంలో ఆర్టీజీఎస్‌పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ప్రభుత్వ సేవలు కావాలన్నా ఆన్‌లైన్, డిజిటల్, వాట్సాప్ గవర్నెన్స్ తదితర సాంకేతిక మార్గాల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాల న్నారు. మొబైల్ ఫోను ద్వారా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ వినియోగించుకుని ప్రజలు సేవలు పొందేలా అవగాహన కల్పించడంతో పాటు వాట్సప్ గవర్నెన్స్‌ను మరింత విస్తృత పరిచేలా చూడాలన్నారు. జూన్ 12 కల్లా ప్రభుత్వం డిజిటల్ రూపంలో అందించగలిగే సేవలన్నింటినీ వాట్సాప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా ఆర్టీజీఎస్‌లో డేటా అనుసంధాన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మొత్తం 500 సేవల వరకు వాట్సప్ ద్వారా అందించేందుకు వీలుందని, అయితే ప్రస్తుతం 254 సేవలు వాట్సప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకువచ్చామని, 1000కి పైగా సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఐటీ, ఆర్టీజీఎస్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ముఖ్యమంత్రికి వివరించారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటుకు సంబంధించి కార్యాచరణ రూపొందించే పనులు జరుగుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

పోలీసు పహారా తప్పనిసరి

(మొదటిపేజీ తరువాయి)

నియమించిన సబ్ కమిటీని విశ్వవిద్యాలయ ఉపాధ్యాయ సంఘం, పౌరసంఘాల ప్రతినిధులు కోరారు. ఆందోళనలో పాల్గొన్న విద్యార్థుల పై నమోదు చేసిన అన్ని కేసులను ఉపసంహరించుకునేలా తగు చర్యలు తీసుకోవడంతో పాటు పోలీస్ కస్టడీలో ఉన్న ఇద్దరు విద్యార్థులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర సాధికార కమిటీ క్యాంపస్‌ను సందర్శించే ముందు 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూమిలో నష్టం అంచనా, జీవవైవిధ్య సర్వే నిర్వహించడానికి నిపుణులైన అధ్యాపకులు, పరిశోధకులకు అనుమతి ఇవ్వాలని అన్నారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోవడంతో విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి హాజరు కాలేదని ప్రతినిధుల బృందం మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. డిమాండ్లు నెరవేర్చిన తర్వాతే మంత్రుల కమిటీ నిర్వహించే సమావేశానికి హాజరవుతారని వారు తెలిపారు. త్రిసభ్య మంత్రుల కమిటీ మాట్లాడుతూ... సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం 400 ఎకరాల భూమిని రక్షించడానికి పోలీసుల పహారా తప్పనిసరి అని సూచించారు. క్యాంపస్ నుంచి పోలీసు బలగాలను ఉపసంహరించుకోవాలనే అంశం గురించి ప్రభుత్వం హెచ్‌సీయూ వైస్ ఛాన్సలర్‌కు లేఖ రాస్తామని తెలిపారు. విద్యార్థులు, వసతి గృహాల భద్రత గురించి వీసీ హామీ ఇచ్చిన తర్వాత, 400 ఎకరాల్లో మినహా, మిగతా క్యాంపస్ నుంచి పోలీసులను ఉపసంహరించుకుంటామని వారు స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా కేసుల ఉపసంహరణకు పోలీసు, న్యాయ శాఖతో సంప్రదించి చర్యలు తీసుకుంటామని భోరోసా ఇచ్చారు. సుప్రీంకోర్టు తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు అధ్యాపకులు, విద్యార్థులు సహా ఎవరిని 400 ఎకరాల్లో సర్వేకు అనుమతించలేమని స్పష్టం చేశారు. కోర్టులో కేసు కొనసాగుతున్న దృష్ట్యా హెచ్‌సీయూకి మంత్రుల బృందం రాలేదన్నారు. విద్యార్థుల సూచనలు, సలహాలు వినడానికి మంత్రుల కమిటీ సిద్ధంగా ఉందని వివరించారు. హెచ్‌సీయూ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ప్రొఫెసర్ సౌమ్య దేచమ్మ, ప్రొఫెసర్ శ్రీపర్ణ దాస్, ప్రొఫెసర్ భంగ్య భూక్య, పౌర సంఘాల ప్రతినిధులు విస్సా కిరణ్‌కుమార్, సంధ్య, సజయ, ఇమ్రాన్ సిద్ధిఖీ పాల్గొన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థులపై కేసులు ఉపసంహరించండి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పోలీసు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం హెచ్ సీయూ టీచర్స్ అసోసియేషన్, సివిల్ సొసైటీ బృందంతో సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు దుదిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి చర్చల తదుపరి డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు. జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న ఇద్దరు విద్యార్థుల కేసుల ఉపసంహరణకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. కేసుల ఉపసంహరణ క్రమంలో ఎటువంటి న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ అధికారులకు తగు సూచనలు చేయవలసిందిగా న్యాయశాఖ అధికారులను ఆదేశించారు.ఇంటలిజెన్స్ శివదర్ రెడ్డి, సైబరాబాద్ పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతి, న్యాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మూడు రోజులు వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రయాణిస్తూ పశ్చిమ మధ్య బంగాళా ఖాతంలోకి విస్తరించే అవకాశమున్నట్లు పేర్కొంది. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడించింది. ఉత్తర కోస్తా, యానాంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రాబోయే 4 రోజుల్లో క్రమంగా 2 నుంచి 3 డిగ్రీలు పెరిగి... ఆ తర్వాత స్వల్పంగా తగ్గుతాయని పేర్కొంది. దక్షిణ కోస్తా, రాయలసీమలో గరిష్ఠంగా 2 నుంచి 4 డిగ్రీలు పెరిగి... ఆ తర్వాత స్వల్పంగా తగ్గే అవకాశముంది.

ఈదురుగాలులతో వర్షం

ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు నమోదుకాగా... ఉమ్మడి కృష్ణాజిల్లాలోని అనేక ప్రాంతాల్లో సోమవారం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. రెడ్డిగూడెం, మైలవరం, తిరువూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో ఈదురు గాలులు వీచాయి. వీటికి తోడు భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని మామిడి తోటల్లోని కాయలు నేలరాలి పంటకు అపార నష్టం వాటిల్లింది. ఈదురుగాలుల ధాటికి కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాంతాల్లో ఈదురు గాలుల ధాటికి థర్మల్ కేంద్రంలో బూడిద ఆయా ప్రాంతాల్లో ఎగిసిపడి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కల్గింది. ఆ పరిసర ప్రాంతాలన్నీ బూడిదతో నిండిపోయాయి. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షం పడే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. చెట్ల కింద నిలబడవద్దని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆయన సూచించారు. ఇటీవల అకాలవర్షాలతో అపారనష్టం వాటిల్లి... దానినుంచి తేరుకోకముందే బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో ఉద్యానవన పంటల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

'బనకచర్ల' వివరాలివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులను అజగేషన్ వేధిస్తున్నారని, మహిళా ఉద్యోగులను అసభ్యకర మాటలతో దూషిస్తున్నారని ఫిర్యాదు చేశారు. గోదావరి నదిపై ఇరు రాష్ట్రాల ప్రాజెక్టులన్నింటినీ జీఆర్ఎంబీకి అప్పగించాలని బోర్డు కార్యదర్శి ప్రతిపాదించగా, తెలంగాణ తాము అప్పగించబోమని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రభుత్వం అప్పగించకపోతే తాము కూడా అప్పగించేది లేదని ఏపీ తేల్చిచెప్పింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు, ఇతర ముఖ్య అధికారులతో పాటు, తెలంగాణ నీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆ పోలీసులపై ఎఫ్ఐఆర్

(మొదటిపేజీ తరువాయి)

నీల గోఖలేతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది. ఈ కేసులో ఇంతవరకూ రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. ఇలాంటి చర్యలతో రాష్ట్ర చట్టబద్ధతను, నేర న్యాయ వ్యవస్థపై సామాన్యుల విశ్వాసం దెబ్బతింటుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వం తరఫు న్యాయవాది అమిత్ దేశాయ్ వివరణ ఇస్తూ... ఈ కేసును సీఐడీ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందన్నారు. విస్తృత దర్యాప్తునకు అలహాబాద్ హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ నేతృత్వంలో ప్రభుత్వం ఒక కమిషన్ కూడా ఏర్పాటు చేసిందన్నారు. హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరారు. ఇందుకు ధర్మాసనం నిరాకరించింది. రెండ్రోజుల్లోగా సిట్‌కు అన్ని పేపర్లను సీఐడీ అందజేయాలని ఆదేశించింది.

మహా పతనం

(మొదటిపేజీ తరువాయి)

అత్యల్పంగా 71,425.01 పాయింట్ల కనిష్టానికి చేరుకుంది. చివరకు 2,226.79 పాయింట్ల నష్టంతో 73,137.90 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇదే బాటలో కొనసాగింది. ప్రారంభంలోనే వెయ్యి పాయింట్లకుపైగా పతనమైంది. చివరకు 742.85 పాయింట్ల నష్టంతో 22,161.60 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు పది నెలల తర్వాత కనిష్టానికి చేరుకున్నాయి. ముఖ్యంగా నిఫ్టీ 2020 మార్చి తర్వాత భారీగా పతనమైంది. మార్కెట్‌లో దాదాపు 559 షేర్లు పురోగమించగా... 3,372 షేర్లు కుప్పకూలాయి. నిఫ్టీ అత్యధికంగా ట్రెంట్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హిండాల్కో ఇండస్ట్రీస్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టీ నష్టపోయాయి. హిందుస్థాన్ యూనిలీవర్ లాభపడింది. ఇక మార్కెట్‌లో మెటల్ ఇండెక్స్ 6.7 శాతం, రియల్టీ ఇండెక్స్ 5.6 శాతం, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, ఆటో, ఎనర్జీ, ఐటీ 2.5 నుంచి 4 శాతం తగ్గడంతో అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 3.4 శాతం నుంచి 4 శాతం చొప్పున తగ్గాయి.

ప్రపంచ మార్కెట్ల పతనం

గతవారం వాల్‌స్ట్రీట్‌లో భారీ అమ్మకాలతో ప్రపంచ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. తన వైఖరిలో ఎలాంటి మార్పులేదని తాజాగా ట్రంప్ చెప్పడం మార్కెట్లను కుదిపేసింది. జర్మనీ డాక్స్ 6.5 శాతం పతనంకాగా... ఫ్రాన్స్ మార్కెట్ సీఏసీ-40 5.7 శాతం కుప్పకూలింది. బ్రిటన్‌కు చెందిన ఎఫ్‌టీఎస్ఈ-100...4.5 శాతం దిగజారింది. జపాన్ నిక్కీ ఇండెక్స్ ఆరంభంలోనే 8 శాతం కుప్పకూలింది. భారీ నష్టాలతో కాసేపు ఫ్యూచర్స్ ట్రేడింగ్‌ను నిలిపివేశారు. చివరకు7.8 శాతం నష్టంతో నిక్కీ ఇండెక్స్ ముగిసింది. మిజుహో ఫైనాన్సియల్ సంస్థ 10.6 శాతం, మిత్సుబిషి యూఎఫ్‌జే ఫైనాన్సియల్ గ్రూపు 10.2 శాతం నష్టపోయింది. ప్రపంచ మార్కెట్ల ప్రభావానికి పెద్దగా గురికాని చైనా మార్కెట్లకూ నష్టాల సెగ తప్పలేదు. హాంకాంగ్ సెంగ్ 13.5 శాతం క్షీణించగా... షాంఘై కాంపోజిట్ ఇండెక్స్ 7.3 శాతం నష్టాలు చవిచూసింది. తైవాన్‌కు చెందిన టీఎస్ఈ 9.7 శాతం పతనమైంది. గత వారాంతంలో అమెరికా మార్కెట్లు భారీగా కుదలేయ్యాయి. వాల్‌స్ట్రీట్‌లోనూ తీవ్ర నష్టాలు తప్పవని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్ టారిఫ్‌లతో ద్రవ్యోల్బణం పెరిగి... కార్పొరేట్ లాభాలు తగ్గొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది వినియోగదారుల సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపొచ్చు. ఫలితంగా ఆర్థిక వృద్ధి నెమ్మదించే అవకాశాలున్నాయి. దీంతో మాంద్యం భయాలు నెలకొన్నాయి. అమెరికాతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం నెలకొనే అవకాశాలను జేపీ మోర్గాన్ 40 శాతం నుంచి 60 శాతానికి పెంచింది. ఇప్పటికే 180కి పైగా దేశాల నుంచి ట్రంప్ సర్కారు బేస్ టారిఫ్ అయిన 10 శాతం సుంకాలు వసూలు చేస్తోంది. వాణిజ్య లోటు పరిష్కారమయ్యే వరకు సుంకాలపై వెనక్కి తగ్గేది లేదని అమెరికా అధ్యక్షుడు మరోసారి స్పష్టంచేశారు. దీంతో మదుపర్లలో ఆందోళన నెలకొంది.

ఆ నలుగురికి రూ.85వేల కోట్ల నష్టం

న్యూఢిల్లీ: ట్రంప్ టారిఫ్‌ల దెబ్బతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కుదేలవడంతో సెకన్ల వ్యవధిలో మార్కెట్లో రూ.లక్షల కోట్ల సంపద ఆవిరైంది. ఈ ప్రభావం దేశీయ కుబేరులపైనా తీవ్రంగానే పడింది. టాప్-4 కుబేరుల సంపద ఈ ఒక్కరోజే 10 బిలియన్ డాలర్లకు పైగా (దాదాపు రూ.85వేల కోట్లు) కరిగిపోయింది. ఈ మేరకు ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్ జాబితా గణాంకాలు వెల్లడించాయి. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీ షేర్లు సోమవారం ట్రేడింగ్‌లో భారీగా పతనమయ్యాయి. నిఫ్టీలో ఈ కంపెనీ షేరు విలువ దాదాపు 3.5 శాతం పడిపోగా... ఇంట్రాడేలో 7.4 శాతం నష్టంతో 52 వారాల కనిష్టాన్ని తాకింది. దీంతో అంబానీ వ్యక్తిగత నికర సంపద ఏకంగా 3.6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.30 వేల కోట్లు) తగ్గి 87.7 బిలియన్ డాలర్లకు చేరింది. అదానీ గ్రూప్‌కు చెందిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు కూడా 5 శాతం మేర నష్టపోయాయి. దీంతో ఈ సంస్థ అధినేత గౌతమ్ అదానీ నికర సంపదలో 3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.25 వేల కోట్లు) ఆవిరయ్యాయి. ప్రస్తుతం ఆయన మొత్తం ఆస్తుల విలువ 57.3 బిలియన్ డాలర్లకు తగ్గినట్లు ఫోర్బ్స్ పేర్కొంది. ఓపీ జిందాల్ గ్రూప్ అధినేత్రి సావిత్రి జిందాల్ నికర సంపద సోమవారం 2.2 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.18 వేల కోట్లు) మేర కుంగి 33.9 బిలియన్ డాలర్లకు చేరింది. నేటి ట్రేడింగ్‌లో జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ షేర్లు దాదాపు 7 శాతం పతనమయ్యాయి. ట్రంప్ టారిఫ్‌ల దెబ్బతో ఐటీ షేర్లు భారీగా కుదేలయ్యాయి. దిగ్గజ సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేరు విలువ 3.3 శాతానికి పైగా కుంగింది. దీంతో ఈ కంపెనీ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ వ్యక్తిగత నికర సంపద 1.5 బిలియన్ డాలర్లు (రూ.12 వేల కోట్లు) తగ్గి 30.9 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఫోర్బ్స్ వివరించింది.

వక్ఫ్‌పై అత్యవసర విచారణకు సుప్రీం ఓకే

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం ఈమేరకు కీలక నిర్ణయం తీసుకుంది. జమియత్ ఉలమాయె హింద్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, ఇతర ముస్లిం పక్షాల తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి, న్యాయవాది నిజాం పాషా దాఖలు చేసిన పిటిషన్లను పరిశీలించిన సుప్రీంకోర్టు ధర్మాసనం... వాటి అత్యవసర విచారణకు అంగీకారం తెలిపింది. "కేసులను అత్యవసర విచారణకు చేపట్టాలని మౌఖికంగా ధర్మాసనాన్ని కోరితే చెల్లదు. సమగ్ర వివరాలతో లేఖ లేదా మెయిల్స్‌ను న్యాయవాదులు పంపాల్సి ఉంటుంది" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా అభిప్రాయపడగా... దీనికి న్యాయవాది కపిల్ సిబల్ బదులిస్తూ 'మేం ఆ ప్రక్రియను పూర్తి చేశాం' అని చెప్పారు. 'అయితే నేను ఆ లేఖలను మధ్యాహ్నం పరిశీలించి... తగిన నిర్ణయం తీసుకుంటాను. వాటిని లిస్ట్ చేయిస్తాం' అని ప్రధాన న్యాయమూర్తి వెల్లడించారు. ఆ ప్రకారం నిర్ణయం తీసుకున్నారు.

పిటిషనర్లు వీరే...

వక్ఫ్ సవరణ చట్టం -2025 రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన వారిలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ జావెద్, ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్ తదితరులు ఉన్నారు. ఒవైసీ తరఫున అడ్వకేట్ లాజఫీర్ అహ్మద్ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఇక వక్ఫ్ సవరణ చట్టం -2025ను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తేకుండా ఆపాలంటూ జమియత్ ఉలమాయె హింద్ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదనీ మధ్యంతర పిటిషన్ కూడా వేశారు. సున్నీ మతపెద్దల సంస్థ సమస్త కేరళ జమియతుల్ ఉలెమా కూడా పిటిషన్ వేసింది. ఈ సంస్థ తరఫున పిటిషన్‌ను అడ్వకేట్ జుల్ఫికార్ అలీ పీఎస్ సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. అసోసియేషన్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ అనే స్వచ్ఛంద సంస్థ కూడా పిటిషన్ వేసింది. కాగా ముస్లిం పర్సనల్ లా బోర్డు కూడా వక్ఫ్ సవరణ చట్టం,2025 రాజ్యాంగ బద్ధతను సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 21, 25, 26, 29, 30, 300 లకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం -2025 ఉందని పిటిషన్లలో పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు-2025కి పార్లమెంట్ ఆమోదం తెలిపింది. దీనికి రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది. ఈ బిల్లుపై లోక్‌సభ, రాజ్యసభలో గంటల తరబడి పోటాపోటీ వాదనలు జరిగిన సంగతి విదితమే. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం తెలపడంతో ఇది చట్టంగా మారింది. అయితే వక్ఫ్ బిల్లు చట్టరూపం దాల్చకముందే వక్ఫ్ బిల్లును సవాలు చేస్తూ.. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలయ్యాయి.

ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం లేకుండా చూడాలి: కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమ్మిళిత సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమైన కార్యక్రమాల నిర్వహణలో మండల ప్రత్యేక అధికారులను భాగస్వామ్యం చేయాలన్నారు. తాగునీటికి ఎక్కడ సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రత్యేకించి ఆర్డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులకు నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమానికి ఇదివరకే నిర్దేశించినట్లుగా సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. దేవరకొండ డివిజన్లో పౌష్టికాహార ప్రాముఖ్యత పై మరోసారి సదస్సు నిర్వహించడం జరుగుతుందని, స్థానిక శాసనసభ్యులను ఇందులో భాగస్వామ్యం చేయడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి ప్రణాళిక రూపొందించాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఈనెల 8 నుండి 10 రోజులపాటు పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని, ఈ కార్యక్రమంలో భాగంగానే మహిళలు, గర్భిణీలు, పిల్లలు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం ఆరోగ్య జాగ్రత్తలపై గిరిజన ప్రాంతాల్లోని మహిళలకు తెలియజేసే విధంగా మరోసారి అవగాహన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అధనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఇంచార్జి డిఆర్ఓ వై.అశోక్ రెడ్డి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, జిల్లా అధికారులు, తదితరులు హాజరయ్యారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - ములుగుజిల్లా బ్యూరో : పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి అర్జీలను, వచ్చే వారంలోగా పరిష్కరించాలని, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 35 మంది తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అట్టి అర్జీలను సత్వరమే పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులను అయన ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 35 దరఖాస్తులు రాగా, అత్యధికంగా భూ సమస్యలు 12, గృహ నిర్మాణ శాఖకు 02, పెన్షన్ 03, ఉపాధి కల్పనకు 01, ఇతర శాఖలకు సంబంధించినవి 17 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్, సంపత్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తుడుం దెబ్బ మహాసభలను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - ములుగుజిల్లా బ్యూరో : కొమురం బీమ్, ఆసిఫాబాద్ జిల్లా, కేరమేరి మండలం, కొమురం బీమ్ యుద్ధ భూమి జోడే ఘాట్‌లో ఈనెల 12,13,14 తేదిల్లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుం దెబ్బ రాష్ట్ర మహాసభలను విజయవంతంచేయాలని, తుడుం దెబ్బ రాష్ట్ర కన్వీనర్ సిద్దబోయిన లక్ష్మి నారాయణ పేర్కొన్నారు. సోమవారం ఏటూరునాగారం ఐటీడీఏ, ప్రాంగణంలోని కొమురం భీమ్ విగ్రహం వద్ద, చలో జోడెన్ ఘాట్‌కు తరలి పోదాం, కరపత్రాలను విడుదల చేస్తు, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బరాష్ట్ర కమిటీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ రాష్ట్ర మహా సభలకు, తెలంగాణ రాష్ట్రంలోని, అన్నీ జిల్లాల, కమిటీలు, మండల కమిటీ, డివిజన్ కమిటీ, రాష్ట్ర కమిటీ బాద్యులు, అనుబంధ సంఘాలు తుడుందెబ్బ నాయకత్వం హాజరై, సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్ ఆగబోయిన రవి, పోడెం బాబు, కుంజ నారాయణ, జిల్లా అధ్యక్షులు పాయం కోటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి పోదేం నాగేశ్వరరావు, చేర్ప రవీందర్‌లు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - వనపర్తి : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనప కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రజల నుంచి అదనపు కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 30 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

గర్భిణీలు పోషక ఆహారం తీసుకుంటే శిశువుకు ఆరోగ్యం

విశాలాంధ్ర- తొర్రూరు: గర్భిణీ స్త్రీలు పోషక ఆహారం తీసుకున్న ప్పుడే శిశువు ఆరోగ్యంగా ఉంటుందని ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ సుగుణాకర్ రాజు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొర్రూరులో గర్భిణులు, సాధారణ మహిళలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నవజాత శిశువుల ఆరోగ్యం ప్రాముఖ్యతను హైలైట్ చేయడానికి, ప్రపంచ ఆరోగ్య సంస్థ 2025 సంవత్సరానికి గాను ఆరోగ్యకరమైన ప్రారంభం, ఆశాజనక భవిష్యత్తు అనే అంశాన్ని తీసుకొనీ అమలు చేస్తుందన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్వలిత మాట్లాడుతూ ఈ కార్యక్రమం 1948లో మొదటి ఆరోగ్య సభ ప్రారంభమైనప్పటి నుండి 1950లో అమల్లోకి వచ్చినప్పటి నుండి, ఈ వేడుక ప్రపంచ ఆరోగ్య సంస్థకు సంబంధించిన ప్రాధాన్యత గల ప్రాంతాన్ని హైలైట్ చేయడానికి ఒక నిర్దిష్ట ఆరోగ్య అంశంపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకుందని తెలియచేశారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు మంచి పోషక పదార్థాలు గల ఆహారం పాలు, గుడ్లు, ఆకు కూరలు, మాంసాహారం తీసుకోవాలని, అలా తీసు కుంటే పుట్ట బోయే బిడ్డ ఆరోగ్యంగా జన్మించు తాడని తెలిపారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకర్, డాక్టర్ మీరాజు, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ నందన, పి హెచ్ యస్ సుందరి, జయమని, సూపర్ వైజర్, యం ఎల్ హెచ్ పి లు మహేష్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీరాముని పట్టాభిషేకం

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : పట్టాభిషేక క్రతువులో కళ్యాణ రాముడు రారాజుగా మారిన శుభవేళ... భక్త జన శ్రీ రామనామా స్మరణంతో పుణ్యక్షేత్రం భద్రాచలం రామాలయ ప్రాంతం మారుమోగింది. 'తక్కువేమీ మనకు రాముడు ఒక్కడుండు వరకు' అంటూ భక్తుల శ్రీరామ నామ స్మరణలు మిన్నంటాయి. అర్చకుల వేద మంత్రోచ్చారణతో మిధిలా ప్రాంగణం పులకించింది. దక్షిణ అయోధ్యపురి భద్రగిరి భక్తులతో అలరారింది. శ్రీరామ పట్టాభిషేకం వేడుక నేత్రపర్వంగా సాగింది. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ వర్మ ఈ మహోత్సవ వేడుకలకు హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన వేడుకలైన శ్రీ సీతారాముల కళ్యాణం, పట్టాభిషేకం మహోత్సవాలకు హాజరైన భక్తజనం తీపి జ్ఞాపకంతో వెనుదిరిగింది.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం...

శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలోని మిధిలా ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన శ్రీరామ పట్టాభిషేకం వేడుక భక్తులను అలరించింది. తొలుత రామాలయం భద్రుని మండపంలో అర్చక స్వాములు స్వామివారి పాదుకలకు అభిషేకం జరిపారు. రాజ లాంఛనాలతో పవిత్ర పావన గౌతమీ నదీ తీరం నుంచి తీర్థములు తీసుకొచ్చారు. భాజా భజంత్రీల సందడి, సన్నాయి మేళాలు, భక్తుల కోలాటంతో శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని ఊరేగింపుగా మిథిలా ప్రాంగణానికి తీసుకొచ్చారు. శిల్పకళా శోభిత కళ్యాణ మండపంపై స్వామి వారు ఆశీనులయ్యారు. అర్చక స్వాములు తొలుత విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం నిర్వహిం చారు. స్వామివారికి పాదుకలు, రాజదండం, రాజ ముద్రిక, స్వర్ణ కిరీటం, ఖడ్గం, రత్నాభరణం ధరింప చేశారు. శ్రీరామ పట్టాభిషేక పారాయణం గావించారు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, ఆదరణ వేదం, విష్ణు పురాణం, భగవత్ శాస్త్రం తదితర పారాయణంలను గావించారు. పుష్కర నది జలాలతో మహాకుంభ తీర్థప్రోక్షణ చేశారు. 11 శ్లోకాలను పఠించి స్వామివారికి హారతి ఇచ్చారు. అర్చక స్వాములు భక్తులచే పలు స్తోత్రాలను పఠింపజేశారు. శ్రీరామ నామ స్మరణలతో మిథిలా ప్రాంగణం ప్రతిధ్వనించింది. పట్టాభిషేకం అనంతరం భక్తులపై అర్చక స్వాములు పుణ్య నదీ జలాలను చల్లారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శ్రీరామ పట్టాభిషేకం వేడుకకు హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. మహోత్సవాన్ని ఆద్యాంతం ఆయన తోపాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తిలకించారు. తొలుత రామాలయంలో గవర్నర్ స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో కూడా రాష్ట్ర మంత్రి తుమ్మల, ఎంపీ బాలరామ్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్

బాలికలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : బాలికలు సకాలంలో పోషక ఆహారం తీసుకుంటూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల ఉన్నత పాఠశాలలో మహిళ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పింకీస్ ఫౌండేషన్ సహకారంతో నవి సమ్మన్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసిన బాలికలకు సానిటరీ నాప్కిన్స్ పంపిణీ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, పింకీస్ ఫౌండేషన్ మేనేజర్ భార్గవి బట్నగర్, కార్యదర్శి పండిట్ శాలిని గుప్తా, అధ్యక్షులు అరుణ్ గుప్తాలతో కలిసి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో, క్రీడారంగంలో, ఎంచుకున్న రంగాలలో రాణించవచ్చని తెలిపారు. పింకీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని 35 పాఠశాలలను సానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేయడం అభినందనీయమని. విద్యార్థినులు ఆరోగ్యం, పరిశుభ్రత, పారిశుద్ధ్య సూత్రాలను పాటించాలని, తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువులో రాణించాలని తెలిపారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు అంబేద్కర్

విశాలాంధ్ర-మరిపెడ: దేశానికి స్వాతంత్రం సిద్దించాకా.. దేశంలో ప్రజాస్వామ్య పాలన, అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యత, మహిళా లోక జాగృతి, షెడ్యూల్డ్ కులాల ఉన్నతికి, భావి భారతానికి ఉజ్వల భవిష్యత్ ఉండేలా రాజ్యాంగాన్ని లిఖించిన మహోన్నత వ్యక్తి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు బాబా సాహెబ్ అంబేద్కర్ అని మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డి కొనియాడారు. సోమవారం మరిపెడ మండలంలోని తానంచర్ల గ్రామంలో సర్గీయ రామసహాయం రంగారెడ్డి ఆర్థిక చేయూతతో గ్రామంలో నెలకొల్పిన బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగ సీత వెంకన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి ఎనలేదనిదన్నారు. పీఏసీఎస్ చైర్మెన్ చాపల యాదగిరి రెడ్డి, మరిపెడ ఎంఈవో అనితా దేవి, గ్రామ పెద్దలు రామసహాయం సత్యనారాయణ రెడ్డి, రామసహాయం ఆనంద్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, పాశం నరేష్ రెడ్డి, రామసహాయం అంజి బాబు, రామసహాయం రఘు నందన్ రెడ్డి, ఈర్ల రవి, సీత వీరభద్రం, నియోజకవర్గ నాయకులు నూకల అభివన్ రెడ్డి, వల్లూరి కృష్ణా రెడ్డి, కుడి మహేందర్ రెడ్డి, పానుగోతు రాంలాల్, మెంచు అశోక్, వీసారపు శ్రీపాల్ రెడ్డి, నల్లు శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేష్, మండల నాయకులు రాచకొండ అంజి, తేజావత్ నెహ్రు, తేజావత్ భరత్, గ్రామ నాయకులు సీత అంజి, కొమ్ము అశోక్, పొలెపాక ఎల్లయ్య, గణేష్, ప్రవీణ్, వెంకన్న, ఎర్ర భిక్షం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు శాగంటి. రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు రవి, మండల అధ్యక్షుడు ఐనాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన జడ్జి

విశాలాంధ్ర - ఇల్లందు : స్థానిక ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కక్షిదారుల దాహార్తి తీర్చడం కోసం ఇల్లందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ దేవరపల్లి కీర్తి చంద్రికరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దూర ప్రాంతం నుంచి కోర్టు వచ్చే వారికి ఎండ తీవ్రత పరిగిన నేపథ్యంలో ఈ చలివేంద్రం ఉపయుక్తమన్నారు. ముఖ్యంగా వయోవృద్ధులు, పిల్లలు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. మున్ముందు ఎండ తీవ్రత ఎక్కువ పెరిగే అవకాశాలు ఉన్నందున కక్షిదారులు మంచినీటి కోసం ఇబ్బంది పడకుండా ఈ చలివేంద్రాన్ని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు బార్ అసోసియేషన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంపల్లి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తిక్, సంయుక్త కార్యదర్శి సిహెచ్ నవీన్, న్యాయవాదులు, వెంకట నరసయ్య, దంతాల ఆనంద్, కొండ నారాయణ, సుధాకర్, మహేశ్వరరావు, జయ ప్రకాష్, రవికుమార్, ధనంజయరావు, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దరఖాస్తులను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్, రైతు రుణమాఫీ వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులంతా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అందజేయాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ఎంపీడీవో కార్యాలయాలలో ఆఫ్ లైన్ విధానంలోనూ దరఖాస్తులను స్వీకరించాలని, దరఖాస్తుదారులకు రసీదును ఇవ్వాలన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ గ్రామాలు, తండాలు నుండి రెవెన్యూ విభాగానికి చెందిన దరఖాస్తులు (37), డిఆర్‌డిఏ (5), వ్యవసాయం, (3) బీసీ వెల్ఫేర్ (2), పంచాయతీరాజ్ (4), ఇలా వివిధ విభాగాలకు చెందిన మొత్తం (75) దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిశీలించి వెంటనే ఆవిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలం నేపథ్యంలో క్షేత్రస్థాయిలో త్రాగునీరు సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాల తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు కృష్ణవేణి, గణేష్, జడ్పీ సీఈవో పురుషోత్తం, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, బీసీ వెల్ఫేర్ అధికారి ఎం.నరసింహస్వామి, డిసిఓ వెంకటేశ్వర్లు, డివిహెచ్ఓ డాక్టర్ బి.కిరణ్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ భీమ్లా నాయక్, డిహెచ్ఓ జి.మరియన్న డిపిఓ హరిప్రసాద్, డిడబ్ల్యూఓ దేశీ రామ్, మెప్మా పీడీ విజయ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 65 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వెదికే ప్రజావాణి అని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ మాధురి, డిఆర్ఓ పద్మజ రాణి, జడ్పీ సీఈవో జానకి రెడ్డి జిల్లా వైద్య అధికారిని గాయత్రి వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఆకస్మిక పరిశీలన

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సోమవారం రామగుండం సామాజిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మాత్తుగా సందర్శించి, పాఠశాలలో ఉన్న వసతులను స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల జీవన నిబద్ధత, ఆహార వసతి, తరగతుల నిర్వహణ, హాస్టల్ పరిపాలన తదితర అంశాలపై నేరుగా విద్యార్థులతో మాట్లాడి సమాచారం సేకరించారు. వారితో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మంచి వాతావరణంలో చదువుకోవడం అనేది అత్యంత అవసరం అని, వసతుల లోపం వల్ల విద్యార్థుల భవిష్యత్ దెబ్బతినకూడదని అన్నారు. ఎమ్మెల్యేతో పాటు స్థానిక అధికారులు, పాఠశాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

రేషన్ కార్డుల జారీలో ప్రభుత్వ వైఖరి సరికాదు

విశాలాంధ్ర - ఖమ్మం:రేషన్‌కార్డుల జారీలో ప్రభుత్వ వైఖరి సరి కాదని అనేక మంది అర్హులకు రేషన్ కార్డులు రాకుండా చేసే ప్రయత్నం జరుగుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. రకరకాల కారణాలతో రేషన్ కార్డులను అడ్డుకు నే ప్రయత్నం జరుగుతుందన్నారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ నగర సమితి సభ్యుల సమావేశం సోమవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సిపిఐ నగర కార్యదర్శి ఎస్కె జానిమియా అధ్యక్షతన జరిగిన సభలో సురేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం దశాబ్దకాలం పాటు రేషన్కార్డుల ను ఇవ్వలేదని ఆయన తెలిపారు. ఇప్పుడు రేషన్కార్డుల ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడం అభినందనీయమే అయిన కార్లు, ఇతర వాహనాలు ఉన్నాయని రేషన్ కార్డులను అధికారులు నిలుపుదల చేయాలని చూస్తున్నారని మారిన పరిస్థితుల్లో కార్లు బతుకు దెరువుగా మారాయన్న వాస్తవాన్ని గుర్తించాలని సురేష్ సూచించారు. ఈ నెల 10వ తేదీన దివంగత సిపిఐ నేత, మాజీ శాసన సభ్యులు మహ్మద్ రజబ్లీ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు సురేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, కొండపర్తి గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, మిడికంటి వెంకటరెడ్డి, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాస్, పగడాల మల్లేష్, ప్రజా సంఘాల బాధ్యులు గాదె లక్ష్మి నారాయణ, తాటి నిర్మల, యడ్లపల్లి - శంకరయ్య, యానాలి సాంబశివరెడ్డి, జ్వాల నర్సింహారావు పాల్గొన్నారు.

ట్రైబల్ మ్యూజియంను ప్రారంభించిన గవర్నర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : భారతదేశంలో ఆదివాసి గిరిజనుల సంస్కృతి చాలా గొప్పది, పురాతనమైనదని దీన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ వర్మ అన్నారు. భద్రాచలంలో ఆదివాసి గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కళాఖండాలతో అద్భుతంగా ట్రైబల్ మ్యూజియంను ఐటీడీఏ పీవో రాహుల్ ఏర్పాటు చేశారని గవర్నర్ కొనియాడారు. భద్రాచలం ఐటిడిఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ మ్యూజియంను గవర్నర్ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ వేడుకకు హాజరైన రాష్ట్ర గవర్నర్‌కు ఐటీడీఏ వద్ద గిరిజన సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. మ్యూజియంలో ఏర్పాటు చేసిన వివిధ వస్తువులను చూసి పీవో రాహుల్‌ను గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఈ మ్యూజియంను ఆధునికరించాలని గవర్నర్ కోరారు. గిరిజన ఆచార వ్యవహారాల కళాఖండాలను సందర్శకులకు విక్రయించి ఆదివాసీలకు ఉపాధి అవకాశాలు కల్పించుకునేలా చొరవ చూపాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం ఆదివాసి మహిళలు తయారుచేసిన గిరిజన వంటకాలను రుచిచూసారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, పీవో బి.రాహుల్, ఏపీవో డేవిడ్ రాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యాలయాలు ఆధునిక దేవాలయాలు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : విద్యను బోధించే ప్రతి విద్యాలయాలు సమాజానికి దేవాలయాల లాంటివని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరామ్ అన్నారు. అందుకే విద్యావంతులైన ప్రతి ఒక్కరూ పాఠశాలలు, కళాశాలల స్థాపించేందుకు, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని ఆయన కోరారు. సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ జి. శ్రీనివాస్ సోమవారం సిఎండి బలరామ్‌ను కలిసి సింగరేణి పాలిటెక్నిక్ 17 వార్షిక దినోత్సవ జ్ఞాపికను మర్యాద పూర్వకంగా అందజేశారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడుతూ పవిత్ర దేవాలయాల్లాంటి విద్యాలయాల్లో నాణ్యమైన విద్యకోసం, వాటి పోరోగతి కోసం ప్రత్యేక దృష్టి పెట్టి కృషి చేస్తున్నట్లు చెప్పారు. "ఎడ్యుకేషన్ విత్ డేడికేషన్' నినాదంతో బోధన, బోధనేతర సిబ్బంది తమ విధులను నిర్వర్తించాలని బాలరామ్ కోరారు. తమ విధి నిర్వహణలో ఉపాధ్యాయులు కేవలం ఉద్యోగం కోసం కాకుండా సామజిక బాధ్యతగా భావించి ప్రతి విద్యార్థిని తమ పిల్లలుగా భావించి వారిపై ఎదుగుదలకు పాటుపడాలని కోరారు. క్రీడలను కూడా ప్రోత్సహించాలన్నారు. మన సింగరేణి పాఠశాలలు, కళాశాలలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కేంద్రాలుగా ఉండాలని బాలరామ్ సూచించారు.

హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం తక్షణమే చేపట్టాలి

విశాలాంధ్ర - గార్ల : రాంపురం పాకాల ఏటి పై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం తక్షణమే చేపట్టాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గార్ల మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు పోతుల నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాంలో బడ్జెట్ మొత్తం హైదరాబాద్ చుట్టే తిరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన పేద ప్రజలందరికీ అందించాలని డిమాండ్ చేశారు. పాకాల యేటి పై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం 10 ఏళ్ళ నుంచి అనేక ఉద్యమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప ప్రజల సమస్య పరిష్కారం కావడంలేదన్నారు. పాకాల యేటి పై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేసే వరకు సిపిఐ పార్టీ ఉద్యమాన్ని ఆపదని ఆయన స్పష్టం చేసారు. రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పై సిపిఐ చేసే ఉద్యమాల్లో కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలొ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, కృష్ణమూర్తి, ధూపాటి జనార్ధన్, మాగం లోకేష్, బట్టు వీరన్న,దారావత్ వీరన్న,లావుడ్య భీముడు నాయక్, సింగు రమేష్, దార్ల నాగేష్, బీష్మ, రమేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జెఐహెచ్ జాతీయ సభ్యులుగా చంద్రుగొండ వాసులు ఎంపిక

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జమాతే ఇస్లామి హింద్ సంస్థ జాతీయ సభ్యులుగా కొత్తగూడెం జిల్లాలోని చంద్రుగొండ మండల కేంద్రానికి చెందిన ఏడుగురు ఎంపికైయ్యారు. జాతీయస్థాయిలో ఈ సంస్థ ధార్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక, ప్రజాసేవ ముఖ్య లక్ష్యంతో దేశవ్యాప్తంగా దశాబ్దాలుగా పనిచేస్తుంది. కాగా ఆ సంస్థ మండల అధ్యక్షులు ఎండి. షబ్బీర్ హుస్సేన్ ఈ మేరకు సోమవారం సభ్యుల ఎంపికను ఒక ప్రకటనలో వెల్లడించారు. జాతీయ సభ్యులుగా సీనియర్ కార్యకర్తలు అష్రఫ్ హుస్సన్, మూర్తుజా, ఎండి. హుషంలతోపాటు మహిళా విభాగం నుంచి షబానా, సాజియా, షమీమ్, ఫాతిమున్నిసా బేగంలు ఎంపికైనట్లు ఆయన వెల్లడించారు. ఎంపికైన సభ్యులకు షబ్బీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారిని శాలువ కప్పి ఆత్మీయంగా సన్మానించారు. తమపై నమ్మకంతో ఎంపిక చేసిన జెఐహెచ్ రాష్ట్ర, జిల్లా, మండల ముఖ్య బాధ్యులకు కొత్త సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆ సంస్థ సీనియర్ నాయకులు ఎండి. ఇమామ్ సాహెబ్, ఎండి. మస్తాన్ సాహెబ్, మౌలాలి, ఎస్‌కె. అన్వర్, యాకుబ్, సయీద్ హుస్సేన్, కమల్ షా, అసిఫ్, అబిద్, నాగుల మీరా, షాహిద్, సమీ, పటేల్, రఫీ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు జడ్జి బియ్యం పంపిణీ

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి జి.భానుమతి చేతుల మీదుగా ట్రాన్స్ జెండర్ల కు ఉచిత బియ్యాన్ని పంపిణీ చేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్స్, సెక్స్ వర్కర్లకు ఎదురయ్యే సమస్యలను న్యాయమూర్తి అడిగి తెలుసుకున్నారు. తమ పరిధిలో సాధ్యమైనంత మేరకు పరిష్కారం చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు కొత్తగూడెంలొ ఉన్న ట్రాంజెండర్స్, సెక్స్ వర్కర్లకు ఉచిత బియ్యం అందించటం జరిగిందన్నారు. ప్రతినెల వీరికి ఉచిత బియ్యాన్ని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. పంపిణీ సజావుగా జరిగేలా చూడాలని సెక్యూర్ ఎన్జీవో ప్రాజెక్ట్ మేనేజర్ రాజేంద్రప్రసాద్ ను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నిరంజన్ రావు, సెక్యూరి ఎన్జీవో రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

పెల్లుబుకిన ప్రజా ఉద్యమం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన యంత్రాంగంలో భాగమైన ప్రపంచ సంపన్నుడు, వివాదాస్పద డోజ్‌కు నేతృత్వం వహిస్తున్న టెస్లా అధినేత ఎలన్ మస్క్ విధానాలకు వ్యతిరేకంగా వారాంతంలో అమెరికన్లు గర్జించారు. 'హ్యాండ్సాఫ్' పేరుతో పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగారు. దేశంలోని 50 రాష్ట్రాల్లో దాదాపు 1400 చోట్ల భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రజల ప్రజా ఉద్యమాన్ని ఎలా పునర్నిర్మించవచ్చో ఈ నిరసనలు చాటి చెపుతున్నాయి. అమెరికా ప్రజలు చేపట్టిన ఆందోళనలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా దాదాపు మూడు నెలల కిందట రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్ అధికారం చేపట్టిన వెనువెంటనే వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపారు. ప్రభుత్వ ఉద్యోగులకు కోత పెట్టారు. ప్రపంచ దేశాలతో వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. వ్యయ నియంత్రణ చర్యలు, సమూల సంస్కరణల పేరుచెప్పి హఠాత్తుగా వేల సంఖ్యలో ఫెడరల్ ఉద్యోగులను విధుల నుంచి తప్పించడం, జీడీపీ తగ్గిపోయేలా ఆర్థికవ్యవస్థను అస్తవ్యస్థం చేయడం, వలసలపై ఉక్కుపాదం మోపడం, మానవ హక్కులను కాలరాయడం వంటి చర్యలతో ట్రంప్, ఎలాన్ మస్క్‌పై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు 'హ్యాండ్సాఫ్' పేరుతో గడిచిన వారాంతంలో నిర్వహించిన ఆందోళనలో బయటపడ్డాయి. అమెరికాలో ఇటీవల కాలంలో ఇంత భారీ ఎత్తున ప్రజాగ్రహం వెల్లడికాలేదు. 2017 లో జరిగిన మహిళల నిరసన, 2020 లో బ్లాక్ లైవ్స్ మ్యాటర్స్ ఆందోళనల తర్వాత ఇంత పెద్దయెత్తున నిరసనలు జరగడం ఇదే ప్రప్రథమం. ట్రంప్ దుందుడుకు నిర్ణయాలకు వ్యతిరేకంగా లాస్ ఏంజిల్స్ నుంచి వాషింగ్టన్ డీసీ వరకు, మ్యాన్‌హాట్టన్ మిడ్‌టౌన్ మొదలు అలాస్కాలోని యాంకరేజ్ దాకా ప్రతి ప్రధాన నగరం, పట్టణంలో జనం వీధుల్లోకి వచ్చి హ్యాండ్సాఫ్ అని రాసి ఉన్న బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని ఆందోళనల్లో పాల్గొన్నారు. రంగు, మత, రాజకీయ అనుబంధాలతో నిమిత్తంలేకుండా మధ్యేవాదులు, వామపక్ష శ్రేణులు, ఉద్యోగులు, మహిళలు, హక్కుల కార్యకర్తలు, యువకులు, వృద్ధులు ఇలా అన్ని వర్గాల ప్రజలు పదుల లక్షల సంఖ్యలో ప్రజలు తాజా నిరసనలో పాల్గొన్నారు. 'హ్యాండ్సాఫ్' పేరుతో దేశవ్యాప్తంగా స్టేట్ క్యాపిటల్స్, ఫెడరల్ బిల్డింగ్స్, సామాజిక భద్రతా ప్రధాన కేంద్రాలు, పార్కులు తదితర చోట్ల ప్రజలు ఆందోళన చేపట్టారు. బిలియనీర్ల పెత్తనానికి చెక్ పెట్టాలని, ప్రభుత్వంలో అవినీతికి ముగింపు పలకాలని, మెడిక్‌ఎయిడ్, సామాజిక భద్రత పథకాలకు నిధుల కోతను ఎత్తివేయాలని, వలసదారులు, ట్రాన్స్‌జెండర్లు, ఇతర కమ్యూనిటీలపై దాడులను ఆపాలని నిరసనకారులు నినాదాలతో హోరెత్తించారు. ట్రంప్ యంత్రాంగానికి వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శించడం ద్వారా తమ ఆగ్రహావేశాలను వెళ్లగక్కారు. అత్యంత సంపన్నుల చేతుల్లోకి వెళ్లిన పాలనాపగ్గాలను విడిపిస్తామని నినదించారు. ప్రభుత్వంపై సంపన్నుల అజమాయిషీ నశించాలి. ప్రభుత్వంలో అవినీతి అంతం కావాలి. మెడికేర్, సోషల్ సెక్యూరిటీ నిధుల్లో కోత పెట్టొద్దు. వలసదారులు, లింగమార్పిడి వర్గాలు, ఇతరులపై నిర్బంధాల చట్రాలను తొలగించాలి అనే ప్రధాన డిమాండ్లతో ప్రజలు ఆందోళన బాటపట్టారు. ట్రంప్ టారిఫ్‌ల యుద్ధాన్ని తప్పుపట్టారు. మిత్ర, శత్రు దేశాలతో నిమిత్తం లేకుండా ప్రపంచ దేశాలన్నింటిపైనా వరుసగా సుంకాలు పెంచుతూ టారిఫోన్మాదంతో రెచ్చిపోతున్న ట్రంప్ తీరును ఎండగట్టారు. మనుషులు నివసించని, పెంగ్విన్లు జీవించే ఆస్ట్రేలియా దీవిపై ఇటీవల పన్ను వేయటాన్ని తప్పుపడుతూ పెంగ్విన్లపై కాదు, సంపన్నులపై పన్నులు వేయండి అని ట్రంప్ చర్యలను ఎద్దేవా చేశారు. విదేశాలపై టారిఫ్‌ల బాంబు విసిరితే అది ప్రతీకార టారిఫ్‌ల రూపంలో తిరిగొచ్చి అధిక ధరలు, ద్రవ్యోల్బణానికి బాటలు వేస్తోందన్న ప్రజల ఆగ్రహంలో వాస్తవం లేకపోలేదు. ఈ నిరసన కార్యక్రమాన్ని మూవ్ ఆన్, ఇన్ డివిజబుల్, ది ఉమెన్స్ మార్చ్, కార్మిక సంఘాలు, ఎల్‌జీబీటీక్యూప్లస్, న్యాయవాదులు, అనుభవజ్ఞుల సంస్థలు వంటి 150 కి పైగా గ్రూపుల సంకీర్ణం నిర్వహించింది. మేక్ అమెరికా గ్రేట్ ఎగేన్ నినాదంతో అధ్యక్ష పీఠంపై ఆసీనులైన డొనాల్డ్ ట్రంప్ వెనువెంటనే తీసుకున్న అనూహ్య, విపరీత నిర్ణయాలతో అమెరికన్లు విసిగిపోయారనడానికి ఈ ఆందోళన ఒక ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పవచ్చు. ట్రంప్ ప్రభుత్వ వ్యతిరేక ర్యాలీలు కేవలం అమెరికాలో మాత్రమే కాకుండా లండన్, పారిస్, జర్మనీలోని బెర్లిన్ నగరాల్లోనూ ఆందోళనలు జరిగాయి. "అమెరికాకు ఏమైంది? ప్రజలను టారిఫ్‌లను ఇబ్బందులు పెట్టడం ఇకనైనా ఆపండి. ట్రంప్ పెద్ద ఇడియట్" అని రాసి ఉన్న ప్లకార్డులను లండన్‌లో ప్రదర్శించడం విశేషం. ఇంత భారీ స్థాయిలో ప్రజాగ్రహం వ్యక్తమైనా శ్వేతసౌధం మాత్రం ప్రజాగ్రహం లేదని చెప్పడం అత్యంత హాస్యాస్పదం. ట్రంప్ యంత్రాంగాన్ని సమర్థించుకోవడం విచారకరం. అధ్యక్షుడు ట్రంప్ వైఖరి స్పష్టంగా ఉన్నదనీ, ఆయన అర్హులైన లబ్ధిదారుల సామాజిక భద్రత, మెడికేర్, మెడికేడ్‌ను నిరంతరం రక్షిస్తారని అసిస్టెంట్ ప్రెస్ సెక్రెటరీ లిజ్ హుస్టన్ ప్రకటన చేశారు.

ట్రంప్ టారిఫ్‌ల దెబ్బకు ఆసియా, యూరప్ దేశాల స్టాక్ మార్కెట్లు భారీగా పతనం అవుతున్నాయి. అయినా కూడా వాణిజ్య సుంకాల విషయంలో తన నిర్ణయమే సరైందని ట్రంప్ మొండి వాదన మానలేదు. ఎట్టి పరిస్థితుల్లో వాటిని సవరించేదే లేదని భీష్మించుకుని కూర్చోవడం అత్యంత దారుణం. ఆర్థిక మాంద్యం పొంచి ఉందన్న నిపుణుల హెచ్చరికలను కొట్టిపారేయడం ట్రంప్ మూర్ఖత్వాన్ని ప్రతిబింబిస్తోంది. చమురు ధరలు తగ్గాయి, వడ్డీ రేట్లు తగ్గాయి. ఆహార పదార్థాల ధరలూ తగ్గాయి. కనుక ద్రవ్యోల్బణం లేదు. చాలాకాలంగా అన్యాయానికి గురైన అమెరికా, ప్రతీకార సుంకాల ద్వారా సంబంధిత దేశాల నుంచి బిలియన్ల డాలర్లు తీసుకు వస్తోందని నిస్సిగ్గుగా సమర్థించుకుంటున్నారు. ప్రపంచ దేశాలపై అమెరికా సుంకాల విధింపుతో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్‌లో అనిశ్చితి , మాంద్యం భయాలు, అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ అపార నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ప్రపంచ ఆర్థిక వేత్తలు గొంతు చించుకుంటున్నా ట్రంప్ మాత్రం తన నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండబోదని భీష్మించుకు కూర్చున్నారు. సుంకాల విధింపుపై నెలకొన్న ఆందోళనల్ని తొలగించేందుకు అమెరికా పాలనా యంత్రాంగం పనిచేస్తోందనీ, సుంకాల విధింపు తర్వాత అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి 50కి పైగా దేశాలు ముందుకు వచ్చాయని ట్రంప్ బీరాలు పలుకుతున్నారు. అమెరికా రాజకీయ పరిణామాలు కేవలం ఆ దేశం మీదే కాక అంతర్జాతీయ రాజకీయాల మీద కూడా అమితమైన ప్రభావం చూపనున్నాయి.

ఫొటో సెషన్

చింతపట్ల సుదర్శన్

కడుపు నింపుకోడం, వీధులు తిరగడం, కొత్తగా కనిపించిన కుక్కల మీద అరవడం వంటి రోజువారీ పనులు ముగించుకుని వచ్చి అరుగు ఎక్కిన డాగీకి గోడకు ఆనుకుని నిద్రపోతున్న డాంకీ కనిపించింది. నిద్ర పోతున్న డాంకీని చూడగానే, డాగీకి ఆవలింతలు మొదలయ్యాయి. నిద్ర కూడా ఒక అంటు వ్యాధే కాబోలుననుకుంటూ, కాళ్లు బార చాపుకుని ముక్కు మీద వాలిన ఈగ వైపు కోపంగా చూస్తూ కళ్లు సగం మూసుకుంది డాగీ. కాస్సేపయితే నిద్రా దేవత ఒళ్లో కూచో బెట్టుకుని 'జో హాయీ' అని పాట అందుకునేదే కానీ మైదానంలో ఆడపిల్లల నవ్వులు వినిపించి కళ్లు వెడల్పు చేసి చూసింది డాగీ. పైలా పచ్చీసులో ఉన్న కుర్రాళ్లిద్దరు, రెండె పదుల వయసుకి దగ్గరగా ఉన్న అమ్మాయిలిద్దరు మైదానంలో చెట్టు కింద నిలబడి ఉన్నారు. అబ్బాయిలు సెల్‌ఫోన్‌లలో ఫోటోలు తీస్తున్నారు. ఒకసారి వాళ్లూ ఓసారి వీళ్లు మరోసారి వాళ్లూ వీళ్లూ సెల్ఫీలు దిగుతున్నారు. వాళ్లేం చేస్తున్నారో అర్థం అవలేదు డాగీకి. బద్ధకంగా ఉంది. ఇప్పుడు లేచి నిలబడి 'భౌ' రాగం అందుకోవాలో లేదో అర్థం అవ్వాలంటే, అన్నీ తెల్సిన డాంకీని, నిద్ర లేపక తప్పదు అనుకున్న డాగీ, డాంకీ దగ్గరికి వెళ్లి చెవిలో 'రెండు భౌలు' ఇచ్చుకుంది. ఉలిక్కిపడి లేచింది డాంకీ. ఏంటిది తంబీ, ప్రశాంతంగా పడుకోనివ్వవు. పక్కవాడు ఎక్కడ సుఖఃపడిపోతాడో అని గిచ్చి, గెలికే మనుషుల్లా 'బిహేవ్' చేస్తున్నావు అంది డాంకీ.

రంగస్థలం

సారీ బ్రో! తప్పనిసరైంది మరి! అటు చూడు గ్రవుండులో ఉన్న ఆ నలుగురు ఏం చేస్తున్నారో తెలీక, అరుపు లంకించుకోవాలో, కూడదో, తేల్చుకోలేక చేశానీ పని సారీ వెరీ సారీ అంది డాగీ. మైదానంలో జరుగుతున్న దేమిటో పరీక్షించింది డాంకీ. ఓస్ అదా! వాళ్లు సెల్‌ఫోనుల్లో ఫోటోలు తీసుకుంటున్నారు. సెల్ఫీలు దిగుతున్నారు అంది డాగీ.

ఫోటోలు అంటే చెవులూ, తోకా నిలబెట్టి అడిగింది డాగీ. వాళ్లెలా ఉన్నారో మళ్లీ మళ్లీ ఫోనుల్లో చూసుకుంటారు. ఫ్రెండ్సుకు పంపుకుంటారు. 'లైకులు' కొట్టించుకుంటారు అంది డాంకీ. అంటే మనని కూడా దాంట్లో దింపగలరా. అబ్బ. మనల్ని మనం మళ్లీ మళ్లీ చూసుకోవడం ఎంత భలేగా ఉంటుందో కదా అంది డాగీ. బానే ఉంటుంది. మనల్ని మనం కాలవ నీళ్లల్లోనో, మురికి గుంటల్లోనో చూసుకోవడమే తప్ప మనకు సెల్‌ఫోన్లు ఎక్కడివి అంది డాంకీ.

అసలు ఈ మనుషులకి తమను తాము చూసుకోవాలని, ఇతరులకు చూపాలనీ ఎందుకుంటుంది. ఇదో రకమైన జబ్బయితే కాదు గదా అని డాగీ అంటుండగానే అరుగు ఎక్కాడు అబ్బాయి. మనుషులకు ఉన్నన్ని మాయరోగాలు ఎవరికుంటాయిలే కాని మీరు ఏ జబ్బు గురించి మాట్లాడుతున్నారు అన్నాడు. డాంకీ హాయిగా నిద్ర పోతున్నది గదా కాస్సేపు కునుకేద్దామనుకున్నా. గ్రవుండులో ఆడవాళ్లు కిసుక్కుమంటే, వాళ్ల చేతుల్లో ఏవో మెరుస్తుంటే ఏమిటని డాంకీని లేపి అడిగా అంది డాగీ.

ఫోటోల పిచ్చి మరీ పెరిగిపోయింది మనుషులకి. ముఖ్యంగా మన రాజకీయ నాయకులకి. క్యాలెండర్లలో ఫోటోలు, డైరీల్లో ఫోటోలు, పోస్టర్లలో, బ్యానర్లలో ఫోటోలె అని అబ్బాయి అంటుండగానే అందుకున్న డాంకీ పథకాల మీదా, రేషన్ మీదా ఫోటోలు. సొమ్మొకడిది, సోకు ఒకడిది అన్నట్టు తమ సొంత జేబుల్లో డబ్బు ఖర్చు పెడ్తున్నట్టు ప్రజల సొమ్ము వాడేస్తూ, తాము ఫోటోల్లో ఫోజులు కొడ్తున్నారు పవర్‌లో ఉన్నోళ్లు. కొత్తవాళ్లు పవర్‌లోకి రాగానే పాత పథకాల పేర్లు మారుతయి, పాత ఫోటోలు చిరిగిపోతయి. వీళ్లంతా ప్రజల ప్రతినిధులే కాని రోజులూ, మహారాజులూ, చక్రవర్తులూ, సార్వభౌములూ కారుగద. వాళ్లు కూడా ఇన్ని ఫోటోలు దిగి ఉండరు అంది డాంకీ.

నీకేం నష్టం డాంకీ. దినపత్రికల్లో వాళ్ల ఫోటోలనీ, పోస్టర్లలో వాళ్ల చిత్రాలనీ, నములుతూనే ఉన్నావు గద అంది డాగీ. నేనూ నా జాతి వాళ్లూ నమిలినా వాళ్లు పట్టించుకోరు ప్రచారం ముఖ్యం కదా. పేడ కొట్టినా, తారు పూసినా దులుపుకు పోయే రకాలు వాళ్లు అంది డాగీ.

నాయకులందరికీ ఫోటోలూ, ప్రచారం అంటే ప్రాణం. వాటి కోసం ప్రోటోకాలనీ ఇంకేదో అనీ గింజుకుంటారు. గొడవపడ్తారు. ఎవరి పదవులూ, ఫోటోలే శాశ్వతం కావు అని తెల్సుకోరు అన్నాడు అబ్బాయి. ఎన్నికల్లో ఓట్ల కోసం, అందర్నీ మేమే ఉద్ధరించామని చెప్పుకోడానికి ఫోటోలు దిగుతారేమో వాళ్లు కాని, నన్ను నేను ఒక్కసారి చూసుకోడానికి ఫోటో దిగాలని ఉంది నాకు. అయినా డాగీలనీ, డాంకీలని ఎవరు దించుతారులే, అంది డాగీ.

అదేంటి డాగీ తెలీదా నీకు, నీ తాత, ముత్తాతో లేక మీ జాతికి మూల పురుషుడో అయిన 'నిప్పర్' అనే పేరుతో పిలవబడిన డాగీ, 'హెచ్‌ఎమ్‌వి' వారి గ్రామఫోన్ రికార్డు మీద హారన్ గొట్టంలోకి తొంగి చూస్తున్నట్టుండే పెయింటింగ్ ఎంత ప్రసిద్ధి చెందిందో తెలీదు నీకు. ఇక డాంకీ నువ్వేం తక్కువ కాదు. అగ్ర రాజ్యపు ప్రజాస్వామిక పార్టీ చిహ్నం నువ్వే డాంకీ అన్నాడు అబ్బాయి.

ఫోటోలు లేకపోతేనేం మనుషులు తమ కొడుకుల్ని, గాడిద కొడకా అని ముద్దుగా పిల్చుకుంటున్నారు కదా అంది డాంకీ.

వీధి కుక్కల ఫోటోలు ఎవరూ దింపరు కానీ పెద్ద వాళ్ల ఇళ్లల్లో జాతి కుక్కల ఫోటోలు ఉంటయిలే అంది డాగీ.

ఫాసిస్టు వ్యతిరేకతే అరసం కర్తవ్యం

భరద్వాజ

ఏప్రిల్ 9నాటికి (2025) నాటికి అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఏర్పడి 89 ఏళ్లు పూర్తవుతాయి. అంటే అభ్యుదయ రచయితల సంఘం 90వ పడిలో పడ్తోంది. ఈ సందర్భంగా 1936లో అభ్యుదయ రచయితల సంఘం అవతరించడానికి దారి తీసిన పరిణామాలను బేరీజు వేసుకోవాలి. అలాగే 90వ పడిలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా ప్రస్తుతం ప్రగతిశీల భావాలున్న రచయితలు అనుసరించవలసిన మార్గం ఏమిటో కూడా నిర్ధారించుకోవాలి. ఇరవయ్యో దశాబ్దం ఆరంభమే సంక్షుభితంగా మొదలైంది. 1914 జులై 28న మొదలై 1918 నవంబర్ 11 న ముగిసిన మొదటి ప్రపంచ యుద్ధం కేవలం యుద్ధ బీభత్సాన్ని మాత్రమే మిగల్చలేదు. భౌగోళిక రాజకీయ పరిధులను మాత్రమే మార్చలేదు. ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర రాజకీయార్థిక సంక్షోభాలు ఎదురైనాయి. సాంస్కృతిక రంగంలోనూ సంక్షోభం అనివార్యం అయింది. 1930 నాటి ఆర్థిక మాంద్యం మొత్తం ప్రపంచాన్నే అతలాకుతలం చేసింది. ఈ ప్రభావం సాంస్కృతిక రంగం మీద కూడా పడింది.

ఈ సంక్షోభం సాంస్కృతిక రంగంలో రెండు రకాలుగా వ్యక్తమైంది. ఒక పాయ క్షీణ సాహిత్యానికి, నిష్ప్రయోజనకరమైన కళాభివ్యక్తికి, నిరర్థక ప్రయోగవాదానికి దారి తీసింది. రెండో ధోరణి మానవాళి భవిష్యత్తును ప్రభావితం చేసే శక్తి ప్రజలకే ఉందని, ఆ ప్రజల ఆకాంక్షలను వ్యక్తం చేయడమే సాహిత్య, కళా రంగాల బాధ్యత అని గుర్తించింది. ఈ నేపథ్యంలోనే అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 1936 ఏప్రిల్ 9న లక్నోలో ఆవిర్భవించింది. 1935 ప్రథమార్థంలో పారిస్‌లో ప్రపంచ రచయితల సదస్సు జరిగింది. అప్పుడు లండన్‌లో విద్యార్థిగా ఉన్న సజ్జాద్ జహీర్ (బన్నే భాయ్) ఈ సదస్సుకు హాజరయ్యారు. ఇంగ్లాండ్‌లో చదువుకుంటున్న సజ్జాద్ జహీర్, ముల్క్‌రాజ్ ఆనంద్, అహమద్ అలీ, మహమ్మద్-ఉజ్-జఫర్ వంటి వారు 1930 నాటి ఆర్థిక మాంద్యంవల్ల అంతర్జాతీయంగా వస్తున్న మార్పులను గమనించారు. సమాజ గతి, సాంస్కృతిక రంగంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకున్నారు. ఫ్రాన్స్, రష్యా సాంస్కృతిక రంగాల పురోగమన పోకడలను ఆకళింపు చేసుకున్నారు. ఈ ప్రభావంతోనే లండన్‌లో ఉన్న భారత విద్యార్థులు భారత అభ్యుదయ రచయితల సంఘం నెలకొల్పారు. ఓ నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రణాళిక లండన్ నుంచి వెలువడే "లెఫ్ట్ రివ్యూ"లో ప్రచురితమైంది. 1935లో ఈ ప్రణాళికను ఆమోదించారు. మన దేశంలో వివిధ భాషలు మాట్లాడే ప్రాంతాలలో కూడా అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటు చేయాలని సజ్జాద్ జహీర్ మిత్ర బృందం నిర్ణయించింది.

1936లో లక్నోలో అరసం ఆవిర్భావ సభ దృశ్యం

లండన్‌లో రూపొందించిన అభ్యుదయ రచయితల ప్రణాళికను చూసి ప్రభావితుడైన మున్షీ ప్రేం చంద్ 1935 అక్టోబర్‌లో తాను నిర్వహిస్తున్న "హన్స్" పత్రికలో ప్రచురించారు. ఈ నేపథ్యంలోనే 1936 ఏప్రిల్ 9-10 తేదీల్లో లక్నోలో అఖిల భారత అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభ జరిగింది. దీనిని ప్రేమ్‌చంద్ ప్రారంభించారు. 1936 జాతీయోద్యమంలో పెద్ద మార్పు వచ్చింది. లక్నోలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో నెహ్రూ అధ్యక్షోపన్యాసం ఈ మార్పును ప్రతిబింబించింది. సోషలిజం తప్ప నిష్కృతి లేదని నెహ్రూ తన అధ్యక్షోపన్యాసంలో వాదించారు. అభ్యుదయ రచయితల సంఘం లక్నోలో కాంగ్రెస్ మహాసభలు జరిగిన చోటే ఆవిర్భవించడానికి నెహ్రూ స్ఫూర్తి కూడా కారణం అయింది. ఈ ప్రారంభ సభలో ప్రసిద్ధ ఉర్దూ రచయితలు ఫిరాఖ్ గోరఖ్ పురి, ఫైజ్ అహమద్ ఫైజ్, మియా ఇఫ్తికారుద్దీన్, సాగర్ నిజామి వంటి వారు పాల్గొన్నారు. జైనేంద్ర కుమార్ లాంటి హిందీ రచయితలూ భాగస్వాములయ్యారు. హస్రత్ మోహానీ లాంటివారూ హాజరయ్యారు. రవీంద్రనాథ్ ఠాగూర్, మహమ్మద్ ఇక్బాల్, ఆచార్య నరేంద్ర దేవ్, సరోజినీ నాయుడు లాంటి వారు అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటును అభినందిస్తూ సందేశాలు పంపారు.

1936లో అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడే నాటికి ప్రపంచంలో ఫాసిజం బుసలు కొడ్తోంది. ముఖ్యంగా జర్మనీ, ఇటలీ లాంటి దేశాలలో ఫాసిజం పురి విప్పి నాట్యం చేస్తోంది. రెండో ప్రపంచ యుద్ధంలో ఈ ఫాసిజం శక్తులను ఓడిస్తే తప్ప ఫాసిస్టు బెడద సద్దుమణగలేదు. అప్పుడు ఫాసిజం మన దేశంలో అనుభవంలోకి రాలేదు. ఇప్పుడు ఫాసిజం అంటే ఏమిటి, నరేంద్ర మోదీ నాయకత్వంలో కొనసాగుతున్నది ఫాసిజం అవునా కాదా, దీన్ని నయా ఫాసిస్టు ధోరణి అనాలా లేదా లాంటి చర్చలు రాజకీయ రంగంలో సాగుతున్నాయి. అవి అలా ఉంచితే ఫాసిజం అంటే ఏమిటి అన్న నిర్వచనం ఖరారు చేసే దాకా ఆ ప్రభావం మన దేశంలో మాత్రం విళయ నర్తనం చేస్తోంది. ఫాసిజం ప్రధానంగా తన దాడిని సాంస్కృతిక రంగం మీద కొనసాగిస్తుంది. ఇప్పుడు మనం అదే అనుభవిస్తున్నాం. సకల విధ స్వాతంత్ర్యాలనూ మోదీ ఏలుబడిలో బాహాటంగా హరిస్తున్నారు. అనేక మంది రచయితలు, పత్రికా రచయితలు, మానవ హక్కుల కోసం పోరాడే వారు, భావ ప్రకటనా స్వేచ్ఛకోసం పోరాడే వారు మోదీ హయాంలో జైళ్లల్లో మగ్గుతున్నారు. వీరంతా మోదీ ప్రభుత్వాన్ని ఎదిరించినందువల్ల జైలుకెళ్లిన వారేమీ కాదు. తమ తమ రంగాలలో పని చేస్తూ భావప్రకటనా స్వేచ్ఛకోసం పాటు పడడమే వారు చేసిన పని. ఇలాంటి వారిని ఏదో ఒక సాకుతో జైళ్లలో కుక్కుతున్నారు. కొందరికి బెయిలు మంజూరు అవుతోంది. భీమా కోరేగావ్ కేసులో అయిదేళ్ల పై నుంచి నిర్బంధంలో ఉన్న కొంత మందికి బెయిలు కూడా మంజూరు కాలేదు. ఉమర్ ఖాలిద్‌కు బెయిలు ఊసే లేదు. ఇలా మోదీ దాష్టీకానికి బలైన కొద్ది మందికి బెయిలు వచ్చి ఉండొచ్చు. అది మోదీ ఔదర్యమో, న్యాయస్థానాల విచక్షణో కారణం కాదు. బెయిలు హక్కు తప్పని సరైతేనే జైలు అని పదే పదే చెప్పే సుప్రీంకోర్టు ఈ సూత్రాన్ని ఆచరణలో పెట్టడంలో విఫలమవుతోంది. ప్రభుత్వం ఎవరిమీదైనా కక్షగట్టినట్టు ప్రవర్తిస్తే వారి ప్రాథమిక హక్కులను పరిరక్షించడానికి న్యాయస్థానాలు సైతం జంకుతున్నాయి.

ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు అది ఫాసిస్టు పాలన అన్న వారున్నారు. ఇప్పుడు ఎమర్జెన్సీ విధించకుండానే అంతకన్నా దారుణమైన ఘోరాలు కొనసాగిస్తున్నారు. ఈ పరిస్థితిలో కొంత మంది రచయితలు తమ గళం విప్పడానికి సాహసిస్తూనే ఉన్నారు. ఎదిరించాలన్న ఆలోచన ఉన్నా చాలా మంది రచయితలు ప్రభుత్వ దమనకాండను చూసి వెనక్కు తగ్గుతున్నారు. కేవలం దాడులే కాదు భావప్రకటనా స్వేచ్ఛను ఉపయోగించుకునే వారి మీద కేసులు మోపుతున్నారు. ఇది సహజంగానే భయభ్రాంతులను చేస్తుంది. అయినా ప్రగతిశీల రచయితలు తమ వాణి వినిపించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. తెలుగు మాట్లాడే ప్రాంతాలలోనే చూస్తే ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా గుంటూరులో నిటారుగా నిలబడే రచయితలు, వారికి దన్నుగా ఉండే అభ్యుదయ రచయితల సంఘం క్రియాశీలత స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణాలో ఈ ఎదురీత చాలా బలహీనంగా, చెదురుమొదురుగానే ఉంది.

అభ్యుదయ రచయితలు అంటే ఆ సంఘంలో సభ్యత్వం ఉన్న వారు మాత్రమే కానక్కర్లేదు. అభ్యుదయ సాహిత్యోద్యమంలో తటస్థంగా ఉండే అనేక మంది రచయితలను, రాజకీయాలకు తాము దూరం అని "గర్వంగా" చెప్పుకునే రచయితలను కూడా బాగా ప్రభావితం చేసింది. అభ్యుదయ రచయితలు పరమావధిగా భావించే సోషలిస్ట్ వాస్తవికతను ప్రతిబింబిస్తున్న రచయితలు అనేకమంది కనిపిస్తున్నారు. సోషలిస్టు వాస్తవికతను ఎన్ని పాళ్లలో ప్రతిబింబిస్తున్నారన్నది చర్చనీయాంశం కావొచ్చు. కానీ ప్రయత్నం మాత్రం సాగుతోంది. దీన్ని ఆహ్వానించవలసిందే. ప్రస్తుతం ఫాసిస్టు ధోరణి మన నట్టింట విలయ నర్తనం చేస్తోంది. దీన్ని గమనిస్తున్న వారు, ఎదిరించాలనుకునే వారు అభ్యుదయ రచయితల సంఘం సభ్యులు మాత్రమే కాదు. ఈ చట్రానికి ఆవల ఉన్నవారు ఈ ప్రయత్నం గట్టిగానే చేస్తున్నారు. దీనికి కారణం అభ్యుదయ రచయితల ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం కచ్చితంగా ఉంది. సమాజాభ్యుదయాన్ని కాంక్షించని రచయితలను ఇప్పుడు వెతికి పట్టుకోవాల్సిందే. సంప్రదాయ పద్ధతిలో రాస్తున్న వారందరూ తిరోగమన భావాలు ఉన్నవారు కాకపోవచ్చు. వారిని చేరదీసి, వారికి సైద్ధాంతిక అవగాహన కల్పించవలసిన బాధ్యత నిస్సందేహంగా అభ్యుదయ రచయితలదే. అభ్యుదయ భావాలున్న వారు చాలా మంది నిద్రాణంగా ఉండొచ్చు. వారిని కదిలించాల్సిందీ అభ్యుదయ రచయితల సంఘమే. 90వ పడిలోకి ప్రవేశించిన అభ్యుదయ రచయితల సంఘం ఈ బాధ్యత తీసుకోవాలి. ఫాసిస్టు ప్రమాదాన్ని తెలియజెప్పాల్సిందే. ఎమర్జెన్సీ సమయాన్ని ఫాసిజంగా అభివర్ణిస్తున్న సమయంలోనే ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం "అగ్ని గీత" కవితా సంకలనం వెలువరించింది. ఇలాంటివి ఇప్పుడు డజన్ల సంఖ్యలో రావాల్సి ఉంది.

సీపీఐ ప్రధాన కార్యదర్శులు - 9

ఏబీ బర్ధన్

ఆర్వీ రామారావ్

దేవగౌడ నాయకత్వంలో 1996 లో కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు అప్పటి దాకా సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఇంద్రజిత్ గుప్తా కేంద్ర ప్రభుత్వంలో హోంమంత్రి బాధ్యతలు చేపట్టవలసి వచ్చింది. ఆ స్థితిలో అర్ధేందు భూషణ్ బర్ధన్ (ఏబీ బర్ధన్‌గా ప్రసిద్ధుడు) సీపీఐ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు. 16 ఏళ్ల పాటు బర్ధన్ ఆ బాధ్యతలు నిర్వర్తించారు. చంద్ర రాజేశ్వరరావు తరవాత ఎక్కువ కాలం ప్రధాన కార్యదర్శిగా ఉన్నది ఆయనే. బర్ధన్ 1957 లో మహారాష్ట్ర శాసన సభకు స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికయ్యారు. కానీ ఆ తరవాత ఆయన మహారాష్ట్ర శాసనసభకు, రాజ్యసభకు పోటీ చేసినా విజయం సాధించలేక పోయారు. బర్ధన్ కార్మికోద్యమం నుంచి రాజకీయాలలో రాణించారు. మొదట ఆయన ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్యదర్శిగా ఆ తరవాత అధ్యక్షుడిగా ఉన్నారు. 1990లో దిల్లీ రాజకీయాలలో ప్రవేశించిన బర్ధన్ ఇంద్రజిత్‌గుప్తా సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా పని చేశారు.

బర్ధన్‌కు 12 ఏళ్ల వయసున్నప్పుడే ఆయన ఉపన్యాసం విని ముగ్ధుణ్ని అయ్యానని జనతాదళ్ (యు) నాయకుడు శరద్‌యాదవ్ వ్యాఖ్యానించారు.

సాధారణంగా కమ్యూనిస్టులు అంటే సన్యాసం స్వీకరించినట్టుగా, దిగులుగా కనిపిస్తారని, వారిలో హాస్య స్ఫోరకత ఉండదని అంటుంటారు. బర్ధన్ నిరాడంబరత చూస్తే ఆయన సన్యాసిలా కనిపించవచ్చు. దిగులుకు దేశ రాజకీయాల పరిస్థితి కారణం అయి ఉండొచ్చు. కానీ హాస్య స్ఫోరకత బర్ధన్‌లో అపారంగా ఉండేది.

వామపక్ష రాజకీయ పార్టీల వార్తలు సేకరించే వారికి బర్ధన్‌తో మాట్లాడడం అంటే పండగలా ఉండేది.



ఏబీ బర్ధన్

వామపక్ష వార్తలు సేకరించే వారు ఎక్కువగా దిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లోనే తిష్ఠ వేసేవారు. రాజకీయాల గురించి పిచ్చాపాటీ మాట్లాడుకునే వారు కూడా. అజయ్ భవన్‌కొచ్చి బర్ధన్‌తో ముచ్చటించే వారు. సంకీర్ణ రాజకీయాలకు ప్రాధాన్యం పెరిగిన సమయంలో బర్ధన్ సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. దాదాపు అదే సమయంలో అంటే 1992 నుంచి 2005 దాకా హరికిషన్ సింగ్ సూర్జీత్ సీపీఐఎం ప్రధాన కార్యదర్శిగా ఉండేవారు. స్వభావ రీత్యా ఇద్దరికీ చాలా సామ్యం ఉండేది. కాంగ్రెస్ నాయకత్వంలో కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బర్ధన్, సూర్జీత్ ఇందిరాగాంధీకి అనేక సందర్భాలలో సలహాలు ఇచ్చేవారు.

బర్ధన్ పదే పదే ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ఐక్యం కావాలనే వారు. అది ఇప్పటిదాకా నెరవేరని మాట నిజమే కాని జనాభిప్రాయం అదే. బెంగాల్ ప్రెసిడెన్సీ లోని బరిసాల్‌లో జన్మించిన బర్ధన్ 15 ఏళ్ల వయసులోనే కమ్యూనిస్టు భావాల వేపు ఆకర్షితుడయ్యారు. ఆయన జన్మస్థలం ప్రస్తుతం బంగ్లా దేశ్‌లో భాగం. ఆ తరవాత బర్ధన్ కార్యక్షేత్రం నాగపూర్‌కు మారింది. 1940లో ఏఐఎస్ఎఫ్‌లో చేరారు. అదే సంవత్సరం కమ్యూనిస్టు పార్టీలో చేరారు. నాగపూర్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడిగా పని చేశారు. బర్ధన్ ఆర్థిక శాస్త్రంలో ఎమ్మే పూర్తి చేశారు. ఆ తరవాత న్యాయశాస్త్రంలోనూ పట్టా పుచ్చుకున్నారు.

కార్మికోద్యమంలో భాగంగా ఆయన వస్త్ర పరిశ్రమ, విద్యుత్ రంగం, రైల్వేలు, రక్షణ రంగాలలో పని చేశారు. మహారాష్ట్ర, గుజరాత్ ఉమ్మడిగా ఉన్నప్పుడు 1960లో మహారాష్ట్ర ప్రత్యేక రాష్ట్రంగా అవతరించడం కోసం జరిగిన ఉద్యమంలోనూ బర్ధన్ కీలక పాత్రధారి. లాల్‌కృష్ణ అద్వాణీ రథ యాత్రకు వ్యతిరేకంగా కూడా ఆయన చాలా క్రియాశీలంగా పని చేశారు. ఆయన నిఖార్సైన సెక్యులర్ వాది. మరాఠీ, బెంగాలీ, హిందీ, ఉర్దూ, భాషలు ఆయనకు క్షుణ్ణంగా తెలుసు.

'వీవీప్యాట్' లెక్కింపు పిటిషన్ల విచారణకు

'సుప్రీం' నిరాకరణ

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ కౌంటింగ్‌లో నమోదైన ఓట్లతో ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీప్యాట్)ని వందశాతం లెక్కించేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇదే అంశంపై ఢిల్లీ హైకోర్టు 2024 ఆగస్టు 12న ఇచ్చిన ఆదేశాలను హన్స్‌రాజ్ జైన్ దాఖలు చేసిన పిటిషన్ విచారించేందుకు చీఫ్ జస్టిస్ సంజీవ్ కన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. హన్స్‌రాజ్ జైన్ అప్పీల్‌ను తోసిపుచ్చిన సీజే... ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు సరైన కారణం లేదని పేర్కొంది. స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కొట్టివేసింది. సుప్రీంకోర్టు గతంలో ఇలాంటి అంశాలపై తీర్పు ఇచ్చిందని... మళ్లీ మళ్లీ దాన్ని లేవనెత్తలేమని సీజేఐ పేర్కొన్నారు. వీవీప్యాట్ రికార్డులతో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ డేటాను 100 శాతం క్రాస్ వెరిఫికేషన్ చేయాలంటూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన సుప్రీంకోర్టు.. ఈవీఎంలు సురక్షితమైనవని... సులభమైనవి, యూజర్ ఫ్రెండ్లీ అని తెలిపింది. గతేడాది ఆగస్టు 12న ఢిల్లీ హైకోర్టును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరించింది.

లైంగిక వేధింపులపై మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు: ఒక వ్యక్తి మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వీడియోపై కర్నాటక హోం మంత్రి జి.పరమేశ్వర వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు వంటి నగరాల్లో ఇలాంటివి జరుగుతుంటాయని అన్నారు. పెట్రోలింగ్ మెరుగుపరచాలని నగర పోలీసులపై ఒత్తిడి చేస్తున్నానని ఆయన తెలిపారు. 'పోలీస్ కమిషనర్‌కి రోజూ చెబుతూనే ఉంటా. అన్ని ప్రాంతాలను జాగ్రత్తగా పెట్రోలింగ్ ద్వారా పర్యవేక్షించాలని. పోలీసులు 24 గంటలూ పనిచేస్తున్నారు. ఈ ఉదయం కూడా కమిషనర్‌తో మాట్లాడాను. చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం' అని మీడియాతో అన్నారు. కాగా, ఈ నెల నాలుగో తేదీ తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో బెంగళూరులోని బీటీఎం లేఅవుట్ పరిసరాల్లో ఇరుకైన వీధిలో నడుస్తూ వెళ్తున్న ఇద్దరు మహిళలను ఒక వ్యక్తి వెంబడించాడు. వెనుక నుంచి ఒక మహిళను పట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించగా ఆమె ప్రతిఘటించింది. ఆమెను కాపాడేందుకు మరో మహిళ ప్రయత్నించడంతో అతడు పారిపోయాడు. సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో బెంగళూరులో మహిళల భద్రతపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. తాజాగా హోం మంత్రి దీనిపై స్పందించిన తీరు మరింత ఆగ్రహాన్ని రేకెత్తించింది. బాధిత మహిళలు ఫిర్యాదు చేయనప్పటికీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

కునాల్ కామ్రా ముందస్తు బెయిలు పొడిగింపు

చెన్నై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై వివాదాస్పద వ్యాఖ్యల ఆరోపణలు ఎదుర్కొంటున్న స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రాకు ఇటీవల మంజూరు చేసిన తాత్కాలిక ముందస్తు బెయిలు గడువును మద్రాసు హైకోర్టు ఈ నెల 17వ తేదీ వరకూ పొడిగించింది. కునాల్ వివాదస్పద వ్యాఖ్యలపై ముంబై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో ఆయన ఇటీవల మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆయనకు తాత్కాలిక ముందస్తు బెయిలు మంజూరు చేసింది. ఆ గడువు సోమవారంతో ముగియనుండటంతో ఆయన తరపు న్యాయవాది కోర్టుకు తన వాదన వినిపించారు. కునాల్‌పై మహారాష్ట్రలో మరో మూడు కేసులు నమోదైనట్టు తెలియజేశారు. ముంబై పోలీసులు కునాల్ పట్ల శతృత్వంతో వ్యవహరిస్తున్నారని, ఆయన తల్లిదండ్రులను కూడా వేధిస్తున్నారని కోర్టుకు తెలిపారు. కాగా, మహారాష్ట్ర పోలీసులు తనకు వ్యతిరేకంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాల్సిందిగా ముంబై హైకోర్టును కూడా కునాల్ ఆశ్రయించారు. జస్టిస్ సారంగ్ కొత్వాల్ సారథ్యంలోని ధర్మాసనం మంగళవారం ఈ కేసు విచారణ చేపట్టనుంది.

బాంబే హైకోర్టుకు కునాల్

ముంబై: తనపై నమోదైన కేసులు కొట్టివేయాలని స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా సోమవారం బాంబే హైకోర్టును ఆశ్రయించారు. రాజ్యాంగం ప్రసాదించిన భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, జీవించే హక్కును ఉల్లంఘించే విధంగా ఈ కేసులు ఉన్నాయని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై ఏప్రిల్ 21న విచారణ జరగనుంది. ఇటీవల ముంబయిలోని యూనికాంటినెంటల్ హోటల్‌లో గల హాబిటాట్ కామెడీ స్టూడియోలో కునాల్ కామ్రా హాస్య వినోద కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను 'గద్దార్' (ద్రోహి)గా అభివర్ణిస్తూ 'దిల్‌తో పాగల్ హై' హిందీ చిత్రంలోని ఒక సినీ గీతానికి పేరడీని కామ్రా ఆలపించడం ఈ వివాదానికి కారణమైంది. ఉప ముఖ్యమంత్రిపై అవమానకర వ్యాఖ్యలు చేశారన్న కారణం చూపుతూ ఆయనపై అనేక కేసులు నమోదయ్యాయి.

లాలూ సన్నిహితుడికి ఊరట

న్యూఢిల్లీ: రైల్వే కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆర్జేడీ అధ్యక్షుడు లాలూయాదవ్ సన్నిహితుడు, వ్యాపారవేత్త అమిత్‌కత్యాల్ బెయిల్‌ను సవాలు చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలలో జోక్యం చేసుకోలేమని జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో ప్రధాన నిందితులను ఇంకా అరెస్ట్ చేయలేదని, కానీ చిన్న ఈగ కోసం ఎందుకు వెతుకుతున్నారని ఈడీని ప్రశ్నించింది. ఆ పెద్దచేపలను చూసి భయపడుతున్నారా అని నిలదీసింది. మరో 11 మంది నిందితులను ఎందుకు అరెస్ట్ చేయలేదని అడిగింది.

పార్టీ భవిష్యత్‌పై కసరత్తు

- నేటి నుంచి అహ్మదాబాద్‌లో ఏఐసీసీ సమావేశాలు
- జాతీయ రాజకీయ సవాళ్లు... కీలక అంశాలపై మేధోమథనం

అహ్మదాబాద్: జాతీయ రాజకీయాల సవాళ్లు, కీలక అంశాలపై మేధోమథనం చేయడానికి, పార్టీ ఎన్నికల భవిష్యత్, సంస్థాగతంగా బలోపేతం కోసం కార్యాచరణ నిర్ణయించడానికి కాంగ్రెస్ నాయకులు ఏప్రిల్ 8-9 తేదీలలో అహ్మదాబాద్‌లో సమావేశం కానున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు మరిన్ని అధికారాలు ఇవ్వడం, జవాబుదారీతనం కల్పించడం వంటి సంస్థాగత పునరుజ్జీవనానికి సంబంధించి పార్టీ అనేక సూచనలు చేసే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఈ సంవత్సరం, వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ తన వ్యూహాన్ని ఖరారు చేస్తుంది. అహ్మదాబాద్ సమావేశాలు 'న్యాయపథ్ : సంకల్ప్, సమర్పణ్, సంఘర్ష్' అనే అంశాలపై చర్చిస్తాయని, ఏప్రిల్ 9న జరిగే కీలక సమావేశంలో 1,700 మందికిపైగా ఎన్నికయిన, కో-ఆప్టెడ్ ఏఐసీసీ సభ్యులు హాజరవుతారని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఏప్రిల్ 8న సర్దార్ వల్లభాయ్ పటేల్ స్మారక చిహ్నం వద్ద కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం కానుంది. 9న సబర్మతి ఆశ్రమం, కోచ్రబ్ ఆశ్రమం మధ్య సబర్మతి నది ఒడ్డున ఏఐసీసీ సమావేశం జరుగుతుంది. 1,725 మంది ఎన్నికయిన ఏఐసీసీ సభ్యులు, కో-ఆప్టెడ్ సభ్యులు, ఎంపీలు, మంత్రులు, ఇతర సీనియర్ నాయకులు హాజరవుతారు. ఈ సమావేశంలో అనేక ముఖ్యమైన తీర్మానాలు ఆమోదించే అవకాశం ఉంది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, పార్టీ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఇతర అగ్ర నాయకులు పాల్గొంటారని పార్టీ గుజరాత్ ఇంఛార్జ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్ తెలిపారు. దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యలు, రాజకీయ సవాళ్లను సమావేశంలో చర్చించి...కార్యాచరణ రూపొందిస్తామని ఆయన అన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లకు మరిన్ని అధికారాలు ఇవ్వనున్నారు. దీనిద్వారా వారిలో బాధ్యత, జవాబుదారీతనం పెరుగుతుందని పార్టీ భావిస్తోంది. ఎన్నికలకు అభ్యర్థులను ఎంపిక చేయడంలో జిల్లా శాఖలకు మరింత అధికారం ఇవ్వనుంది. ఈ ఏడాది చివర్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా ఐక్య సంఘటన భాగస్వాములతో కలిసి బీహార్‌లో ఎన్డీఏను ఎదుర్కోవడానికి పార్టీ సిద్ధమవుతున్న సమయంలో ఈ సమావేశం కీలకం కానుంది. వచ్చే ఏడాది కేరళ, అసోం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలను పార్టీ ఎదుర్కోవాల్సి ఉంది.

మోదీ హయాంలో ఐసీయూకు ఆరోగ్యం

ఖడ్గే తీవ్ర విమర్శలు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ హయాంలో ఆరోగ్య వ్యవస్థ క్షీణించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే తీవ్రంగా ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య వ్యవస్థను ఐసీయూకు పంపిందని, దీంతో పౌరులపై వైద్య ఖర్చుల భారం విపరీతంగా పెరిగిపోతుందని ఆయన విమర్శించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వీడియోను పోస్టు చేశారు. 'గత ఐదేళ్లలో వైద్య ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయింది. ప్రతి సంవత్సరం 14 శాతం దేశ వైద్య ద్రవ్యోల్బణం పెరిగి భయంకరమైన స్థాయికి చేరింది. 900 నిత్యావసర మందుల ధరల పెరిగాయి. ఖరీదైన వైద్యం వల్ల ప్రతి సంవత్సరం 10 కోట్ల మంది భారతీయులు పేదరికంలో కూరుకుపోతున్నారని నీతి ఆయోగ్ నివేదిక చెబుతోంది. మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్‌పై 12 శాతం జీఎస్టీ, బ్యాండేజీలు, సర్జికల్ వస్తువులపై 12 శాతం జీఎస్టీ, హాస్పిటల్ వీల్‌ఛైర్స్‌పై 18 శాతం జీఎస్టీ, ఆసుపత్రుల్లో శానిటరీ నాప్‌కిన్‌లపై 18 శాతం జీఎస్టీ, గుండె చికిత్సలకు 18 శాతం కేంద్రం జీఎస్టీ విధిస్తోంది. దీంతో ఆసుపత్రి ఖర్చులు ఈ ఏడాదిలో 11.3 శాతం పెరిగాయి. యాంజియోప్లాస్టి ఖర్చు రెట్టింపైంది. కిడ్నీ మార్పిడి ఖర్చు మూడు రెట్లు పెరిగింది. మోదీ ప్రభుత్వం ఆరోగ్య వస్తువులపై పన్నులు విధించడంతో వైద్య ఖర్చులు విపరీతంగా పెరిగి సాధారణ ప్రజలపై తీవ్రభారం పడింది' అని ఖడ్గే వీడియో పోస్టులో మోదీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జాతీయ ఆరోగ్య విధానం 2017 ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం జీడీపీలో 2.5 శాతం మేర ఆరోగ్యంపై ఖర్చు చేసింది. ఇప్పుడు మోదీ ప్రభుత్వం 1.84 శాతం మాత్రమే ఖర్చు చేసిందని ఖడ్గే విమర్శించారు. కేంద్ర బడ్జెట్ మొత్తం వ్యయంతో పోలిస్తే గత ఐదేళ్లలో ఆరోగ్యం కోసం కేటాయించిన బడ్జెట్ 42 శాతం మేర తగ్గిందని ఖడ్గే ఆరోపించారు. మోదీ హయాంలో ఆరోగ్య వ్యవస్థ ఐసీయూకి చేరిందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో వక్ఫ్ మంటలు

బిల్లు కాపీలు చింపేసిన ఎన్‌సీ ఎమ్మెల్యేలు

జమ్ము: వక్ఫ్ సవరణ బిల్లుపై జమ్మూ కశ్మీర్ అసెంబ్లీలో సోమవారం గందరగోళం నెలకొంది. ఈ బిల్లు అమలును వ్యతిరేకిస్తూ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ)తో పాటు ప్రతిపక్షాల సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ బిల్లుపై తమ వాయిదా తీర్మానాన్ని స్పీకర్ అబ్దుల్ రహీం రాథర్ తిరస్కరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ప్రారంభం కాగానే వక్ఫ్ చట్టంలో ఇటీవల చేసిన సవరణలు, వాటి పర్యవసానాలపై చర్చ చేపట్టాలని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఎన్‌సీ ఎమ్మెల్యే తన్వీర్ సాధిక్ వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. అయితే ఈ వ్యవహారం సుప్రీంకోర్టులోనూ, సంబంధిత కాపీ తన వద్ద కూడా ఉన్నందున ఈ అంశాన్ని వాయిదా తీర్మానం కింద చర్చించలేమని స్పీకర్ తిరస్కరించారు. దీంతో వెల్‌లోకి దూసుకువెళ్లేందుకు యత్నించిన సభ్యులను మార్షల్స్ అడ్డుకున్నారు. వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొందరు ఎన్‌సీ ఎమ్మెల్యేలు వక్ఫ్ సవరణ బిల్లు కాపీలు చించివేశారు. ఇది రాజ్యాంగ, ప్రజాస్వామ్య, చట్ట నిబంధనల ఉల్లంఘన అని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇర్ఫాన్ హఫీజ్ లోన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ విశ్వాసాలను పరిగణనలోకి తీసుకోలేదని, తమ అభిప్రాయాలను గౌరవించాల్సి ఉందని అన్నారు. స్పీకర్ చట్టపాలన, సమాఖ్యవాదం, లౌకికవాదాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రతిపక్ష పీడీపీ సభ్యులు సైతం నిరసనలో పాల్గొన్నారు. ఆర్టికల్ 370, సీఏఏ కోర్టు పరిధిలో ఉన్నప్పుడు కూడా తీర్మానం ప్రవేశపెట్టామని పీడీపీ నేత వహీద్ పారా చెప్పారు. పలు రాష్ట్రాలు తీర్మానాలు ప్రవేశపెట్టాయని, వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా తమ నిరసనలు తెలియజేయాలనుకుంటున్నామని, అయితే స్పీకర్ తిరస్కరించారని మండిపడ్డారు. ఎన్‌సీ ఫిక్స్‌డ్ మ్యాచ్ ఆడుతోందని దుయ్యబట్టారు. ఈ బిల్లును వ్యతిరేకించకపోవడం ద్వారా జమ్మూకశ్మీర్ ప్రభుత్వం కశ్మీర్, ముస్లింల సమస్యలపై రాజీపడుతున్నట్లు స్పష్టమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

యువతకు ఉద్యోగాలేవి?

బీహార్ ప్రభుత్వాన్ని నిలదీసిన రాహుల్

పాట్నా: ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బీహార్ లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక అడుగు వేశారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య నానాటికీ పెరిగిపోతూ వారు ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్న నేపథ్యంలో వారి కోసం తెల్ల టీషర్టులతో ఓ యాత్ర ప్రారంభించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత అంతా తెల్ల టీషర్టులు ధరించడం ద్వారా ప్రభుత్వంపై ఉద్యోగాల కల్పన కోసం ఒత్తిడి పెంచాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. బెగుసరాయ్‌లో కాంగ్రెస్ అనుబంధ సంస్థ నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) నేషనల్ ఇంఛార్జ్ కన్హయ్య కుమార్ అధ్వర్యంలో 'వలసలను ఆపండి, ఉద్యోగాలు కల్పించండి' పేరుతో కాంగ్రెస్ పార్టీ భారీ ర్యాలీ నిర్వహించింది. దీన్ని రాహుల్ గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున తరలివచ్చిన నిరుద్యోగులతో కలిసి రాహుల్ గాంధీ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరినీ పలకరిస్తూ బీహార్ వీధుల్లో రాహుల్ గాంధీ ఈ యాత్ర నిర్వహించారు. ఈ ఏడాది చివర్లో బీహార్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నితీశ్ కుమార్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు రాహుల్ గాంధీ ఈ యాత్ర చేపట్టారు. బీహార్ యువతలో ఏదో సాధించాలనే ఉత్సాహం ఉందని వారికి అవకాశాలు మరియు మద్దతు ఇవ్వనందుకు ప్రభుత్వంపై కోపం ఉందని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. బెగుసరాయ్ వీధుల్లో వేలాది మంది యువత మనోభావాలు, బాధలు మరియు దృఢ సంకల్పం ఈరోజు స్పష్టంగా కనిపించాయన్నారు. నిరుద్యోగం, వలసలకు వ్యతిరేకంగా ఈ స్వరం ఇప్పుడు మార్పు కోసం నినాదంగా మారిందని రాహుల్ గాంధీ తెలిపారు. బీహార్ ఇప్పుడు మౌనంగా కూర్చోదని, యువత ఇకపై అన్యాయాన్ని సహించదన్నారు. వారు తమ హక్కులు, ఉపాధి, న్యాయం కోసం పోరాడుతారన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి బీహార్ లో రాహుల్ పర్యటించడం ఇది మూడోసారి. బీహార్ యువత భావోద్వేగాలను ప్రపంచం చూడగలిగేలా బీహార్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి తెల్లటి టీ-షర్టు ధరించి తమతో చేరాలని రాహుల్ పిలుపునిచ్చారు. బీహార్ యువత శక్తిని సమీకరించి కొత్త బీహార్‌ను నిర్మిస్తామని ఆయన తెలిపారు. బీహార్ ప్రభుత్వ పెద్దలు, అధికారులు, పారిపోవద్దని... యువతకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాలు విని మోసపోయే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. తమ భవితవ్యాన్ని తాము రాసుకోవడానికి బీహార్ యువత సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

మోదీ సర్కార్ వల్లే 'స్టాక్' పతనం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లు భారీగా పతనం కావడానికి మోదీ ప్రభుత్వమే కారణమని కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. మార్కెట్లు నష్టపోవడం చూసి తనకు ఎలాంటి ఆశ్చర్యం కలగలేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్రమోదీ చర్యల కారణంగానే మార్కెట్లు తీవ్రంగా నష్టాలు చవిచూస్తున్నాయని ఆరోపించారు. టారిఫ్‌లకు తగ్గట్లుగానే మార్కెట్లు స్పందిస్తున్నాయన్నారు. 'మోదీ, ట్రంప్ తమను తాము మంచి స్నేహితులుగా అభివర్ణించుకోవడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే ఇద్దరూ తమ ఆర్థికవ్యవస్థలు పతనం అవ్వడానికి స్వయంగా సమస్యలు సృష్టించుకోవడంలో నిపుణులు. 2016 నవంబర్ 8న చేసిన నోట్ల రద్దు, 2025 ఏప్రిల్ 5 నుంచి అమల్లోకి వచ్చిన పరస్పర సుంకాలు వీటికి ఉదాహరణలు' అని జైరాం రమేశ్ అన్నారు. ట్రంప్ గతవారం ప్రకటించిన టారిఫ్‌లతో అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధ భయాందోళనలు పెరిగి, మార్కెట్ సెంటిమెంటు ప్రతికూలంగా ఉంది. ఈ వారం కూడా ఆ ప్రభావం మార్కెట్లపై తీవ్రంగానే పడింది. దాంతో స్టాక్ మార్కెట్ ప్రీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 4 వేల పాయింట్ల వరకు పడిపోయింది. ఆసియా మార్కెట్లు సోమవారం భారీ నష్టాలు చవిచూశాయి.

జైలుకైనా వెళ్తా... మీ గౌరవాన్ని కాపాడతా

ఉద్యోగాలు కోల్పోయిన టీచర్లకు మమత అభయ హస్తం

కోల్‌కతా: అర్హులైన అభ్యర్థులు టీచర్ ఉద్యోగాలను కోల్పోవడాన్ని తాను అనుమతించబోనని... సుప్రీంకోర్టు తీర్పుతో టీచర్ ఉద్యోగాలు కోల్పోయిన వారి గౌరవాన్ని కాపాడేందుకు తాను శాయశక్తుల కృషి చేస్తానని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగాలు కోల్పోయిన వారికి తాను మద్దతుగా నిలుస్తానని పేర్కొన్నారు. అయితే వీరికి మద్దతుగా నిలిచినందుకు ఎవరైనా తనను శిక్షించాలనుకొంటే.. జైలుకు వెళ్లడానికి సైతం తాను సిద్ధంగా ఉన్నానని ఆమె స్పష్టం చేశారు. తన ప్రమేయం లేని అంశంలోకి తన పేరు లాగుతున్నారంటూ సీఎం మమతా బెనర్జీ మండిపడ్డారు. ఈ ఉద్యోగాలు కోల్పోయిన అభ్యర్థులు నిరుద్యోగు లుగా మారకుండ ఉండేందుకు తమ ప్రభుత్వం వద్ద ప్రణాళికలున్నాయని ఆమె వివరించారు. సోమవారం కోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో సీఎం మమతా బెనర్జీతో ఉద్యోగాలు కోల్పోయిన వేలాది మంది టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారికి సీఎం మమతా బెనర్జీ పైవిధంగా హామీ ఇచ్చారు. మరోవైపు సుప్రీంకోర్టు తీర్పునకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. అయితే పరిస్థితిని అత్యంత జాగ్రత్తగా, న్యాయ బద్ధంగా నిర్వహించేందుకు తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆమె వివరించారు. 2016లో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర స్కూల్ సర్వీస్ కమిషన్ టీచర్ ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షల ద్వారా 25వేల మంది బోధన, బోధనేతర సిబ్బంది ఉద్యోగాలు పొందారు. అయితే ఈ ఉద్యోగ నియామకాల్లో భారీగా అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ ఆరోపణలు వెల్లువెత్తడంతో కొందరు అభ్యర్థులు కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు... ఈ నియామకాలు చెల్లవంటూ స్పష్టం చేసింది. అంతేకాదు.. నియామకం పొందిన నాటి నుంచి ఈ తీర్పు వెలువరించే వరకు అందుకొన్న జీతాలు సైతం వెనక్కి ఇవ్వాలని వారికి హైకోర్టు ఆదేశించింది. దీంతో ఉద్యోగాలు పొందిన వారు కోల్‌కతా హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు సైతం ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ స్కామ్‌లో భాగంగా నియమితులైన 25 వేల మంది టీచర్ల నియామకాలు చెల్లవంటూ గతంలో కోల్‌కతా హైకోర్టు వెల్లడించిన తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉన్నట్లు తమకు అనిపించడం లేదని స్పష్టం చేసింది. వారి నియామకాలే పెద్ద మోసం అని అర్థం అవుతుందని పేర్కొంది. కాకపోతే.. ఇలా నియామకాలు పొందిన అభ్యర్థులు.. ఇన్నాళ్లుగా వారు పొందిన జీతాలను తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. మరో వైపు బీజేపీ నాయకుడు, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి.. టీఎంసీ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపిస్తూ... సీఎం మమతా బెనర్జీ వెంటనే తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంలో సీఎం మమతా బెనర్జీ మేనల్లుడు, ఎంపీ అభిషేక్ బెనర్జీకి రూ. 700 కోట్ల ముడుపులు అందుకున్నారని ఆరోపించారు. అందుకు నిరసనగా సోమవారం సువేందు అధికారి, తన పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి కోల్‌కతాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.

ఆ మూడు రాష్ట్రాలపై బీజేపీ గురి

రంగంలోకి అమిత్ షా... వరుస పర్యటనలు



న్యూఢిల్లీ: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడుపై బీజేపీ దృష్టి కేంద్రీకరించింది. ఈ రాష్ట్రాల్లో ఎన్నికల సన్నాహాలను పటిష్టం చేయడానికి, కార్యకర్తలను సమాయత్తం చేయడానికి, స్థానిక నాయకులతో సమన్వయం కుదుర్చుకునేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందుకోసం కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రతి నెలా రెండు రోజుల పాటు ఈ మూడు రాష్ట్రాల్లో పర్యటనలు చేపట్టనున్నారు. ఈ పర్యటనలు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమై... ఎన్నికలు ముగిసే వరకు కొనసాగనున్నాయి. ఎలాగైనా ఈ మూడు రాష్ట్రాల్లో అధికారం చేజిక్కించుకోవాలని బీజేపీ తాపత్రయ పడుతోంది.

బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లో జరగనున్నాయి. ఇక్కడ బీజేపీ ఎన్‌డీఏ కూటమిలో ఉంది. ఇందులో నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతా దళ్ (యునైటెడ్), చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), ఇతర చిన్న పార్టీలు ఉన్నాయి. అమిత్ షా ఏప్రిల్ 30, మే ఒకటి తేదీల్లో బీహార్‌లో పర్యటించనున్నారు. పాట్నా, గయ, భాగల్పూర్ తదితర నగరాల్లో బూత్‌స్థాయి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నారు. బీహార్‌లో అధికారం నిలబెట్టుకోవడంతో పాటు రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షం రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ), కాంగ్రెస్ కూటమిని ఎదుర్కొనేందుకు బీజేపీ ఈ పర్యటనలు చేపడుతోంది. గత ఎన్నికల్లో బీజేపీ 74 సీట్లు గెలుచుకున్నది. ఈసారి సీట్ల సంఖ్యను 100కి పెంచుకోవాలని కోరుకుంటుంది.

పశ్చిమ బెంగాల్‌లో 2026 మార్చి-ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ రాష్ట్రంలో బీజేపీ అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు ప్రధాన ప్రత్యర్థిగా ఉంది. 2021 ఎన్నికల్లో టీఎంసీ 215 సీట్లతో ఘన విజయం సాధించగా, బీజేపీ 77 సీట్లతో రెండో స్థానంలో నిలిచింది. అమిత్ షా ఏప్రిల్ 14-15 తేదీలలో కోల్‌కతా, హౌరా, ముర్షిదాబాద్ జిల్లాల్లో పర్యటించనున్నారు. అమిత్‌షా స్థానిక నేతలతో ఎన్నికల ప్రచార వ్యూహాలు రూపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించనున్నారు. తమిళనాడులో 2026 మార్చి-ఏప్రిల్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించింది. ఈ రాష్ట్రంలో బీజేపీ గతంలో ఎన్నడూ విజయం సాధించలేదు. ఇప్పుడు అధికార డీఎంకే-ఇండియా ఐక్యసంఘటనను ఎదుర్కొనేందుకు ఏఐఏడీఎంకేతో మళ్లీ పొత్తు కుదుర్చుకునే ప్రయత్నాలు చేస్తోంది. అమిత్ షా ఏప్రిల్ 10-11 తేదీల్లో చెన్నై, కోయంబత్తూర్, మదురైలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయన ఏఐఏడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామితో సమావేశమై, కూటమి ఒప్పందంపై చర్చలు జరపనున్నట్లు తెలుస్తోంది.

గుజరాత్‌కు రెడ్ అలర్ట్: ఐఎండీ

న్యూఢిల్లీ: గుజరాత్‌లో ఎండలు మండిపోతున్నాయి. దీంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సోమవారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల్లో ఆదివారం 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆ రాష్ట్రానికి ఐఎండీ రెడ్ అలర్ట్ ప్రకటించింది. దేశ రాజధాని ఢిల్లీలో రాబోయే రెండు రోజుల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. దీంతో ఢిల్లీకి ఎల్లో అలర్ట్ ప్రకటించింది. కాగా, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, చండీగఢ్, పంజాబ్, ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, గోవా రాష్ట్రాల్లో రాబోయే రెండు రోజులు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా రాష్ట్రాల్లోని 21 నగరాల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ రాష్ట్రాల్లోనే కాకుండా బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో వడగాడ్పులు కొనసాగుతున్నాయి. రాజస్థాన్‌లోనూ ఎండలు మండుతున్నాయి. దీంతో ఏప్రిల్ 9-10 తేదీల్లో ఎల్లో అలర్ట్ జారీ అయింది.

జైలులో లొంగిపోండి... ఆమ్‌టెక్ మాజీ చైర్మన్‌కు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: సుమారు రూ.2700 కోట్ల బ్యాంక్‌ను మోసగించిన కేసులో సోమవారం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. ఆమ్‌టెక్ గ్రూపు మాజీ చైర్మన్ అరవింద్ ధామ్... మంగళవారం ఉదయం 10 గంటలకు జైలులో లొంగిపోవాలని చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఆంజియోగ్రఫీ పరీక్ష కోసం అదనపు సమయం ఇవ్వాలని, లేదంటే బెయిల్ మంజూరు చేయాలని ధామ్ అభ్యర్థన పెట్టుకున్నారు.

దీనిపై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్ని సార్లు ఆంజియోగ్రఫీ పరీక్ష చేసుకుంటారని, ఇది సరైంది కాదు అని, ముందు మీరు సరెండర్ కావాలని, కస్టడీలో ఉండి కూడా టెస్టు చేసుకోవచ్చు అని సీజేఐ తెలిపారు. ఒకవేళ ఆంజియోగ్రఫీ పరీక్ష తర్వాత సర్జరీ చేసుకోవాలని డాక్టర్లు సూచిస్తే అప్పుడు బెయిల్ కోసం కోర్టుకు వెళ్ల వచ్చు అని ధర్మాసనం తెలిపింది. అరవింద్ ధామ్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రజావాణి వినతులు సత్వరం పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను డిఆర్ఓ హరిప్రియతో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (82) ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజాభవన్ నుండి ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను త్రిప్పి పంపే సందర్భంలో ఎందుకు త్రిప్పి పంపుతున్నారో వివరంగా సమాచారమిస్తూ దరఖాస్తుదారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిష్ణవేణి పాఠశాల వార్షికోత్సవం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : క్రిష్ణవేణీ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో వార్షికోత్సవం సంబురాలు సోమవారం జరిగాయి. నర్సరి నుండి 9వ తరగతి వరకు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, స్త్రీ విద్యపై ప్రదర్శించిన నాటకం పలువురిని ఆకట్టుకుంది. గత ఏడాది 10వ తరగతిలో 9.2, 9.8 గ్రేడ్ విద్యార్థులకు బహుమతులను అందజేసి వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ సంగని రాజు, ఇంచార్జ్ బుచ్చిరెడ్డి, డైరెక్టర్ డా. మంచాల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు హారిక, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కడియం శ్రీహరిపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపాటు

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జనగామ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు పక్కన ఉన్న వాళ్లేమీ చేయలేదు. ఉన్న పనులన్నీ ఆపేశారు," అంటూ ఘాటుగా విమర్శలు గుప్పించారు. ఘన్‌పూర్‌కు మున్సిపాలిటీ వస్తే ఆపేసారు, డిగ్రీ కాలేజీ ఆపేసారు, లిఫ్ట్ ఇరిగేషన్ ఆపేసారు, 100 పడకల ఆస్పత్రిని ఆపేశారు. నవాబ్‌పేటకు లైనింగ్ వస్తే దాన్ని కూడా ఆపేశారు. ఆపేసే చరిత్ర వాళ్లది.. పనులు చేయడమనే చరిత్ర మనది," అంటూ మండిపడ్డారు. ఇటీవల తనను "బొచ్చు కుక్క" అనేలా మాట్లాడిన కడియంను పల్లా గట్టిగానే తిప్పికొట్టారు. "అవును నేను కుక్కనే.. నా ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే, వారిని కాపాడేందుకు కాపలా కుక్కగా ఉంటాను. నీలాగా గుంట నక్కను మాత్రం కాదు," అని పల్లా స్పష్టంగా చెప్పారు. అటవీ భూములపై జరుగుతున్న ఆక్రమణల గురించి కూడా స్పందించారు.ముసలితనానికి అటవీ భూముల మీద కన్నేస్తున్నారు. ఒకరిపై 25 ఎకరాలు, మరొకరిపై మరో 25 ఎకరాలు ఆ భూములను కాపాడటానికి నేను రేసు కుక్కలా ఉంటానానని హెచ్చరించారు. కేసీఆర్ కు, బీఆర్ఎస్ పార్టీకి విశ్వాసం ఉన్న కుక్కను, ప్రజలను కాపాడటంలో ఎప్పుడూ ముందుండే లక్షణాలు నాకు ఉన్నాయన్నారు. నిన్ను ఎదుర్కొనే గుణాలు కూడా నా వద్ద ఉన్నాయంటూ చివర్లో కడియంకు గట్టి హెచ్చరిక చేశారు. ఎవరు ఏమి చేస్తున్నారో ప్రజలకు బాగా తెలుసు. ప్రజల పక్షాన అడుగడుగునా నేనున్నా," అని పల్లా స్పష్టం చేశారు.

పెరుగుతున్న బీపీ, షుగర్ బాధితులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : హెల్త్ ఆఫ్ ది నేషన్ 2025 పేరిట అపోలో హాస్పిటల్స్ ఐదవ ఎడిషన్‌ని విడుదల చేసింది. ఇందులో దేశ ప్రజల ఆరోగ్యానికి సంబంధించి కొన్ని కీలకమైన అంశాలు వెల్లడయ్యాయి. ముఖ్యంగా లక్షణాల కోసం ఎదురుచూడకండి - నివారణ ఆరోగ్యాన్ని మీ ప్రాధాన్యతగా చేసుకోండి" అనే మెసేజ్‌తో ఈ నివేదికను విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 25 లక్షల మంది ఆరోగ్యాన్ని పరీక్షించి దీన్ని రూపొందించారు. ఈ నివేదిక ఒక నిశ్శబ్ద మహమ్మారి గురించి తెలియజేసింది. లక్షణాలు కనిపించకపోయినప్పటికీ లక్షల మంది గుర్తించని దీర్ఘకాలిక వ్యాధులతో జీవిస్తున్నారని, గమనించదగ్గ విషయం ఏమిటంటే, 26 శాతం మంది రక్తపోటు సమస్యతో, 23 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నట్లు తేలింది. అయినప్పటికీ వారికి ఎలాంటి లక్షణాలు కనిపించకపోవడం గమనార్హం అని పేర్కొంది. 2019లో 10 లక్షల మంది ఆరోగ్య పరీక్షలు చేసుకోగా 2024లో 25 లక్షల మంది హెల్త్ టెస్టులు జరుపుకున్నారని, అంటే వీరి సంఖ్య ఐదేళ్లలో దాదాపు 150 శాతం వృద్ధి చెందిందన్నారు. ఇది ప్రజల్లో నివారణ ఆరోగ్యం పట్ల అవగాహన, ఆసక్తి పెంచుతోందని తెలియజేస్తోందని వివరించారు. ఈ నివేదిక మూడు అత్యవసర ఆరోగ్య సవాళ్లపై దృష్టి సారించిందని, కొవ్వు కాలేయ వ్యాధి, ఋతుస్రావం ఆగిన తర్వాత ఆరోగ్య క్షీణత, చిన్నారుల స్థూలకాయం రిపోర్ట్ అనే అంశాలు ఇందులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా అపోలో ఛైర్మన్ ప్రతాప రెడ్డి మాట్లాడుతూ "ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన కుటుంబాలను సృష్టించేందుకు భారత్ ముందుకు రావాలన్నారు. ప్రతి ఇల్లు ఆరోగ్య కేంద్రంగా మారాలని, నివారణ ఆరోగ్య సంరక్షణ ఇకపై భవిష్యత్ ఆకాంక్ష కాదని సూచించారు. ఎండీ సునీతా రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య పరీక్షలు జరిపిన వారిలో 66శాతం మందికి కొవ్వు కాలేయం సమస్యలు ఉండగా వారిలో 85శాతం మంది మద్యానికి దూరంగా ఉన్నారు" అని తెలిపారు.

ప్రజావాణి సమస్యలు సత్వరం పరిష్కరించాలి

కమిషనర్ ఇలంబర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన విన్నపాల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి అధికారులకు సూచించారు. సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ నగరం నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి విన్నపాలు స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి అక్కడిక్కడే పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇల్లంబర్తి మాట్లాడుతూ... నగర ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, సమస్య పరిష్కారం కానట్లయితే అందుకు గల కారణాలను స్పష్టంగా వారికి తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 41 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 19, ట్యాక్స్ సెక్షన్ 5, ఇంజనీరింగ్ విభాగం, అడ్మినిస్ట్రేషన్, ఎస్టేట్స్, విజిలెన్స్, వెటర్నరీ, ఫైనాన్స్, హౌసింగ్ విభాగాలకు ఒకటి చొప్పున, ల్యాండ్ అక్విజిషన్,స్పోర్ట్స్ విభాగాలకు మూడు చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 4 ఫిర్యాదులు అందాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 79 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్‌లో 38, సికింద్రాబాద్ జోన్‌లో 13, శేరిలింగంపల్లి జోన్‌లో 13, ఎల్బీనగర్ జోన్ లో 10, ఖైరతాబాద్ జోన్‌లో ఒకటి,చార్మినార్ జోన్ లో 4, అర్జీలు అందాయి. ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, వేణుగోపాల్, రఘు ప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గీతా రాధిక, అడిషనల్ సి సీ పీ , ప్రదీప్, వాటర్ వర్క్స్ జీఎం సాయి రమణ, డిప్యూటీ సిఈలు పనస రెడ్డి, సునంద, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, వాల్యుయేషన్ అధికారి మహేష్ కులకర్ణి, యుబిడీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

లాంగ్ స్టాండింగ్-డిప్యుటేషన్ అధికారులను బదిలి చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన సంవత్సరం 2025 క్యాలెండరను సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు ఉదరి గోపాల్, ప్రధాన కార్యదర్శి డి.నర్సింగ్‌రావు, అమరేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు ఉదరి గోపాల్ మాట్లాడుతూ డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులకు కనీసం సైకిల్ ఉండదని, ఇక్కడి వచ్చిన తరువాత కార్లు, ఏసిలు, కోట్లు గడిస్తున్నారని ఆయన తెలిపారు. నేడు కమిషనర్ జిహెచ్ఎంకి 2వేల కోట్లు రాబట్టడం అంటే మాటలు కాదన్నారు. జిహెచ్ఎంసి అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి గొప్పదన్నారు. కష్టాలలో ఉన్న జిహెచ్ఎంసికి కమిషనర్ ఎంతో శ్రమిస్తున్నారని ఆయన తెలిపారు. జిహెచ్ఎంసిలో అనేక మంది లాంగ్ స్టాండిరగ్‌పై ఏళ్ళ తరబడి ఇక్కడే ఉంటూ జిహెచ్ఎంసి ఫండ్ వృధా చేస్తున్న పరిస్థితి నెలకొందని వారిని తొలగించాలన్నారు. డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులు ఇక్కడే తిష్టవేస్తూ జిహెచ్ఎంసిని వీడని పరిస్థితి నెలకొందని ఎంటమాలజీలో ఇద్దరు ఎస్.ఈలు ఉన్నారని, వీరి అవినీతి బాగోతం చాలా ఉందన్నారు. వెటర్నరీ విభాగం, ట్రాన్స్‌పోర్టు విభాగంలో ఏఈలు, డీఈలు జిహెచ్ఎంసి నుండి వేతనాలు తీసుకుంటూ రాంకీకి పని చేస్తున్నారని ఆయన తెలిపారు. ఇలాంటి అధికారులను తక్షణమే తొలగించాలని ఆయన కమిషనర్‌ను కోరారు. రాంకీకి 900 కోట్లు ఇవ్వడం వృదా అని 200 కోట్లుతో పనులు చక్కబెట్టుకోవచ్చని ఆయన తెలిపారు. గతంలో జిహెచ్ఎంసి జలమండలిని, ఆర్టీసిని, సామాన్యునికి సైతం ఆదుకునే స్థితిలో ఉండేదన్నారు. రాంకీ వచ్చిన నాటి నుండి హైదరాబాద్ కాస్తా చెత్తబాద్‌గా తయ్యారైందని ఆయన తెలిపారు. కమిషనర్ చేస్తున్న మంచి పనులకు తమ యూనియన్ సహరిస్తుందన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం సమాన పనికి సమాన వేతనం కోసం పోరాటం చేస్తామన్నారు. కార్మికులకు ప్రతి నెల 1న వేతనాలు చెల్లించే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బి.కన్నా, వైస్ ప్రెసిడెంట్ కె.శేఖర్, వైస్ ప్రెసిడెంట్ జి.నర్సింగ్ రావు, ఎం.కృష్ణ, సూర్యప్రకాశ్, కిరణ్, వెటర్నరీ కృష్ణ, ట్రాన్స్‌పోర్టు రవీందర్, సంజీవ, హనుమంతు, అర్జున్, శ్రీనివాస్, యూనియన్ సభ్యులు పర్మినెంట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా రెవెన్యూ అధికారి సంగీత స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (56) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రెవెన్యూశాఖ - 21, ఇతర శాఖలకు - 35, మొత్తం 56 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పూలే విగ్రహ ఏర్పాటుకు నేడు ఎమ్మెల్సీ కవిత దీక్ష

విశాలాంధ్ర - హైదరాబాద్ : అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం దీక్ష చేపట్టనున్నారు. తెలంగాణ జాగృతి, యూనైటెడ్ పూలే ఫ్రంట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిం చనున్న ఈ దీక్ష ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. దీనికి సంబంధించి సోమవారం నాడు తెలంగాణ జాగృతి నాయకులు నవీన్ ఆచారి, యూపీఎఫ్ కో కన్వీనర్ బొల్ల శివ శంకర్ నేతృత్వంలో నాయకులు ఇందిరా పార్కు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. బీసీల ఆత్మ బంధువు పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ చాలా కాలం నుంచి ఎమ్మెల్సీ కవిత పోరాటం చేస్తున్న విషయం విధితమే. పలు సార్లు ధర్నాలు, దీక్షలు నిర్వహించడమే కాకుండా విగ్రహ ఏర్పాటు ఆవశ్యకతపై పలు జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను రెండు సార్లు కలిసి వినతిపత్రాలు కూడా అందించారు. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో పోరాటాన్ని ఉధృతం చేశారు. ఈనెల 11న పూలే జయంతిలోగా ప్రభుత్వం విగ్రహం ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, ఇందిరా పార్కు వద్ద బొల్ల శివ శంకర్ విలేకరులతో మాట్లాడుతూ బీసీల విషయంలో ప్రభుత్వం చిన్న చూపు తగదని సూచించారు. బీసీల ఆరాధ్య దైవమైన పూలేను చట్టసభల ఆవరణలో ఏర్పాటు చేసి గౌరవించాలని డిమాండ్ చేశారు. బీసీల అంశాలు, సమస్యలపై అనేక జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించామని, వివిధ రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని వివరించారు. బీసీలను మోసం చేస్తూ సహించేదే లేదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ కవిత దీక్షకు వేలాది మంది ప్రజలు, బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు నవీన్ ఆచారి, శ్రీధర్‌రావు, పెంటా రాజేష్, యునైటెడ్ ఫుల్ ఫ్రంట్ నాయకులు అలకుంటల హరి, గోపు సదనందు, మారయ్య, నిమ్మల వీరన్న, విజేందర్ సాగర్, డి నరేష్ కుమార్, అశోక్ యాదవ్, లింగం శాలివాహన, పుష్ప చారి, తదితరులు పాల్గొన్నారు.

ట్రైకార్ రుణాలను తక్షణం విడుదల చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గిరిజన సంక్షేమ కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి ఆదివారం అర్ధరాత్రి నుండి అన్ని జిల్లాలతో పాటు హైదరాబాదులోని గిరిజన సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారని నాయకులు ఆరోపించారు. పోలీసుల నిర్బంధాన్ని ఛేదించి వందలాదిమంది గిరిజన నాయకులు, కార్యకర్తలు సోమవారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని గిరిజన సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. కార్యాలయం వద్దకు వెళ్లకుండా చుట్టూ బారికేడ్లు పెట్టి వందలాది మంది పోలీసులతో పహారా కాశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పోలీసులు, భారీ కేడ్లను సైతం ఛేదించుకొని కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణగిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ నాయక్, మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 219 కోట్ల ట్రైకార్ రుణాలను తక్షణం విడుదల చేసి శాంక్షన్ అయి, చెక్కులు సిద్ధంగా ఉన్న లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా ప్రారంభించడంతో ట్రైకార్‌లో 2019-21 సంవత్సరాల్లో శాంక్షన్ అయి చెక్కులు సిద్ధంచేసి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు పడని లబ్దిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్దిదారులకు ఇవ్వాల్సిన 219 కోట్ల బకాయిలను రద్దు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కుట్రలు చేస్తున్నట్టు ఆరోపించారు. రాజీవ్ యువ వికాస్ పథకం ప్రారంభంతో దశాబ్దాలుగా గిరిజన యువతకు రుణ సౌకర్యం కల్పిస్తున్న ట్రై కార్ సంస్థను పూర్తిగా నిర్వీర్యమవుతుందనే అనుమా నాలు కలుగుతున్నాయన్నారు. ఒక్కో లబ్ధిదారునికి 50 వెళ్లనుంది 10 లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు ట్రైకార్ సంస్థ లిస్టును ఫైనల్ చేసి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడానికి 219 కోట్ల రూపాయల చెక్కులను రెడీ చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపించిందన్నారు. దశాబ్దాలుగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ట్రైకార్ సంస్థ ద్వారా గిరిజన యువతి యువకులకు రుణాలు మంజూరు చేస్తున్నటువంటి ట్రైకార్ సంస్థను నిర్వీర్యం చేయడానికే రాజీవ్ యువ వికాసం పథకంలో విలీనం చేయడం గిరిజన యువతి యువకులకు తీవ్ర నష్టం జరుగుతుందని విమర్శించారు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ట్రై కార్ సంస్థలో పెండింగ్‌లో ఉన్న 219 కోట్ల రుణాలను తక్షణం విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలి. లేకపోతే లబ్ధిదారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని గిరిజన సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీ రామ్ నాయక్. రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మనాయక్. ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం రాంబాల్ నాయక్, వ్యవస్థాపక అధ్యక్షులు దాస్ రామ్ నాయక్ గిరిజన సమాఖ్య నాయకులు వర్త్య సరూప నాయక్. మాలోత్ శంకర్ నాయక్. బోడ వీరన్న. జరపలా శివా నాయక్. రవి నాయక్. భూక్య స్వరూప. భూక్య మమత లకావత్ లక్ష్మి మాలోత్ కమల. బోడ రమేష్ శీను తదితరులు పాల్గొన్నారు. కొద్దిసేపు పోలీసులకు కార్యకర్తలకు ఘర్షణ వాతావరణం నెలకొంది అనంతరం గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ గారికి వినతి పత్రం సమర్పించి ప్రభుత్వం దీనిపై వెంటనే స్పందించాలని కోరారు.

తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణలకు ప్రత్యేక రాయితీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణలు విభాగం వారు ప్రచురించిన గ్రంథాలను ప్రత్యేక రాయితీతో విక్రయించడానికి పుస్తక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు పరిస్థితి ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు. ఈనెల 8 నుండి 17 వరకు నాంపల్లి ప్రాంగణంలో పుస్తక విక్రయ కేంద్రంలో ప్రత్యేక పుస్తక ప్రదర్శన రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తెరిచి ఉంటుందని ప్రతి పుస్తకంపై 60 శాతం వరకు రాయితీని ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. తెలుగు వర్సిటీ పుస్తక ప్రదర్శనలో ప్రాచీన గ్రంథాలు, సాహిత్యం, నిఘంటువులు, సంగీత, నృత్య గ్రంథాలు, భారత, భాగవతాలు, ప్రబంధాలు, పురాణాలు, పంచ వాక్యాలు, ఇతిహాసాలు, చరిత్ర గ్రంథాలు, పోటీ పరీక్షలకు ఉపయుక్తమయ్యే పుస్తకాలు తగ్గింపు ధరలతో విక్రయానికి సిద్ధంగా ఉంటాయని సాహితీవేతలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రిజిస్ట్రార్ హనుమంతరావు తెలిపారు.

సీఐటీయు నాయకుడు గోపాల్‌రావు మృతికి సంతాపం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జి.టి.గోపాల్ రావు తన జీవితాంతం పీడిత, తాడిత కార్మికుల కోసం అహర్నిషలు పనిచేస్తూ డి.ఎల్.ఆర్.ఎల్ డిఫెన్స్ సంస్థలో పనిచేస్తూ ఉద్యోగ కార్మికుల బాగుకోసం పనిచేస్తున్న జి.టి.గోపాల్‌రావు యాజమాన్యం తనపై కక్షపూరిత ధోరణితో ఆయనను ఉద్యోగంలో నుండి తొలగించినా అలుపెరుగని పోరాటం చేస్తూ డిఫెన్స్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలతో పాటు అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల బాగు కోసం పనిచేసిన గొప్ప నాయ కుడని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. తన ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా ఉద్యోగ కార్మి కుల మేలు తప్ప మరో ధ్యాసలేని జి.టి.గోపాల్ రావు భయంకరమైన క్యాన్సర్ బారినపడి చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. జి.టి.గోపాల్‌రావు తన జీవితంలో స్వార్థం లేకుండా నిస్వార్థంగా పనిచేసి ఉద్యోగుల ఆదరాభిమానాలను చురగొని యాజమాన్యాలతో అనేక ఇక్కట్లకు గురైన మొక్కవోని ధైర్యంతో తాను నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేశారు. ఈరోజు జి.టి.గోపాల్‌రావు అంతిమయాత్ర నాదర్‌గుల్‌లోని ఆయన సోదరుని నివాసం నుండి బయలుదేరి దారివెమ్మడి కార్మికులు, కార్మిక శ్రేయోభిలాషులు ఆయనకు దాడిపొడగున ఘనమైన వీడ్కోలు పలుకుతూ బడంగ్‌పేట్ లోని స్మశాన వాటికకు భౌతికకాయం చేరుకున్న సందర్భంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.యస్.బోస్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.చంద్రయ్య, ఎఐటియుసి నాయకులు జి.డి.రాములు తదితరులు పాల్గొని భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి ఘనమైన నివాళులర్పించారు.

ఉచిత దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: తారానగర్ వీకర్ సెక్షన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలనందు విద్యార్థులకు చందానగర్‌లో గల స్మిత దంత వైద్యశాల సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత దంతవైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్మిత దంత వైద్యశాల వైద్యుడు డాక్టర్ శ్రీధర్ రెడ్డి పిల్లలకు దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, టూత్ పేస్టులు, బ్రష్‌లు అందజేసిన అనంతరం మాట్లాడుతూ "పిల్లలు ఎక్కువగా దంతక్షయం, దంతాల కోత, చిగుళ్ళ ఇన్ ఫెక్షన్, సూక్ష్మ క్రిములు లేదా బాక్టీరియా వలన దంత వ్యాధుల బారిన పడుతుంటారు. దీనికి కారణాలు చక్కెర అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం వలన, అధిక వేడి లేదా చల్లని పానీయాలు తీసుకోవడం వలన, దంతాలను సరిగా శుభ్రపరచకపోవడం మొదలైనవి. ప్రతి ఒక్కరూ ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా రెండు పూటలా బ్రష్ చేసుకోవాలన్నారు. ఆహారం తిన్న వెంటనే నీటితో నోటిని పుక్కిలించి దంతాలను సంరక్షించుకోవాలి" అని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ "ప్రపంచ ఆరోగ్య సంస్థవారు 1949 ఏప్రిల్ 7వ తారీఖునుండి ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. దీని ప్రధాన ఉద్దేశ్యం ప్రపంచం ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై దృష్టి పెట్టడం, చేపట్టవలసిన నివారణా చర్యలపై ప్రజలలో అవగాహన పెంచడంతో పాటు ఒక ప్రత్యేక నినాదంతో ఈ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరపు నినాదం ఆరోగ్యకరమైన ప్రారంభం - ఆశాజనక భవిష్యత్తు. ఈ థీము ప్రధాన ఉద్దేశ్యం తల్లులు, నవజాత శిశువుల ఆరోగ్యం, మనుగడలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి వ్యాప్తంగా 50 మినీ చెరువుల ఏర్పాటు

సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ ఆదేశాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : పర్యావరణహిత మైనింగ్ ను పాటిస్తూ, కోట్లాది మొక్కలను నాటి దేశవ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకున్న సింగరేణి సంస్థ, తాజాగా సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాల అభివృద్ధికి "సింగరేణి నీటిబింధువు - జల సింధువు" అనే నినాదంతో ఒక విశిష్ట పర్యావరణహిత, ప్రజోపయోగ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించింది. సకల జీవరాసులకు, పంటలకు ప్రాణప్రదమైన నీటి విలువను గుర్తిస్తూ, మైనింగ్ ప్రాంతంలోనూ, ప్రాంతానికి వెలుపల రెండు కిలోమీటర్ల పరిధిలోను 50 మినీ చెరువులను ఏర్పాటు చేయాలని, ప్రస్తుత చెరువులలో పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం నిర్వహించిన వీడియో సమీక్ష సమావేశంలో సీఎండీ ఎన్.బలరామ్ ఏరియా జీఎంలతో, అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జలవనురుల వృద్ధికి కొన్ని మార్గదర్శకాలను ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ఎన్.బలరామ్ మాట్లాడుతూ సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాలను పెంచడం కోసం, సమీప గ్రామాల ప్రజలకు ఎండాకాలంలో సైతం స్వచ్ఛమైన తాగునీరు అందించడం కోసం, ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసే చర్యల్లో భాగంగా నీటి బిందువు జలసింధువు అని నినాదంతో జల వనరుల పెంపుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. సింగరేణి చేపట్టనున్న చర్యల వల్ల సింగరేణి ప్రాంతంలో భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని, తాగునీరు, సాగునీటి అవసరాలకు కూడా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో భూగర్భ జలాల పెంపుదలకు తీసుకోవలసిన చర్యలపై చర్చించి ప్రాథమికంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటికే బొగ్గు తవ్వగా ఏర్పడిన ఖాళీ సంపుల్లో నీటి శాతాన్ని పెంచాలని, తద్వారా సమీప ప్రాంతాల్లో వాటర్ టేబుల్ (నీటిఫలకం) ను వృద్ధి చేయాలని నిర్ణయించారు. ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ దంపుల మధ్య ఏర్పడే లోతట్టు ఖాళీ ప్రదేశాలను ఇకపై చిన్నపాటి నీటి తటాకాలుగా తీర్చిదిద్దాలని, వీటిని వర్షపు నీటితో, లేదా ఓపెన్ కాస్ట్ నుండి బయటకు పంపించే నీటితో నింపాలని భావిస్తున్నారు. పైవిధంగా ఏర్పాటు చేసిన జల వనరు కేంద్రాలలోనికి నీరు చేరడానికి, చేరిన నీరు బయటకు పంపించి సద్వినియోగం చేయడానికి కొన్ని సివిల్ నిర్మాణపు పనులు కూడా శాఖాపరంగాచేపట్టాలని నిర్ణయించారు. అలాగే సింగరేణి గని ప్రాంతాలకు వెలుపల 2 కిలోమీటర్ల పరిధిలో ఉన్న తరాల నాటి చెరువులు, కుంటలను కూడా అభివృద్ధి చేయాలని, వాటిలో ఎక్కువ నీరు నిలువ ఉంచేందుకు పూడిక తీయడం వంటి పనులు కూడా చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకు స్థానిక గ్రామపంచాయతీలు, స్థానిక సంస్థల అంగీకారాన్ని పొంది, ఈ పనుల్లో స్థానికులు పాల్గొనేలా చూడాలని కూడా నిర్ణయించారు. పై చర్యల వల్ల సింగరేణి ప్రాంతంలో భూమి లోపల నీటి ఫలకం పెరిగి జలవనరులు వృద్ధి చెందుతాయని, ఈ నీటిని తాగునీరు, సాగునీటికి కూడా వినియోగించేలా జాగ్రత్తలు తీసుకోవాలని యోచిస్తున్నారు. ఈ తటాకాలు కేవలం జల వనరుల పెంపుదలకు మాత్రమే కాక ఆ ప్రాంత జీవావరణ పరిరక్షణ కూడా ఉపయోగపడతాయని, వీటిలో చేపలు, కప్పలు వంటి జలచరాలను కూడా వృద్ధి చేయవచ్చు అని భావిస్తున్నారు. సింగరేణి ఏర్పాటు చేయనున్న ఈ జల వనరుల కేంద్రాలలోని నీటిని శాస్త్రీయంగా ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ నాణ్యత పెంపుదలకు చర్యలు తీసుకోవాలని కూడా నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ వారి సూచన మేరకు సింగరేణి సంస్థ ఈ భారీ పర్యావరణహిత పథకాన్ని అమలు చేయటానికి ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్వీ సూర్యనారాయణ (ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు (పా, పి అండ్ పి), హైదరాబాద్ కార్యాలయం నుండి ఈడీ (కోల్ మూమెంట్) ఎస్ డి ఎం.సుభానీ, ఫారెస్ట్ అడ్వైసర్ మోహన్ పరిగెన్ పాల్గొన్నారు.

జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ ప్రచారం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: ఏఐసిసి అత్యంత ప్రతిష్టాత్మకంగా దేశవ్యాప్తంగా తీసుకున్న జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం ఇంచార్జ్ కాంగ్రెస్ పార్టీ కోలన్ హన్మంత్ రెడ్డి ఆదేశాల మేరకు 131 డివిజన్ కుత్బుల్లాపూర్ అధ్యక్షులు ఎండి జాకీర్ అధ్వర్యంలో కుత్బుల్లాపూర్ డివిజన్ చింతల్ బస్సు స్టాప్ నుండి ద్వారకానగర్, మార్కెట్ యార్డ్, కాకతీయ నగర్, మాణిక్య నగర్, అంబేద్కర్ నగర్, శ్రీనివాస్ నగర్, సంజీవయ్య నగర్, రామ కృష్ణ నగర్, బాపునగర్, శ్రీ రామ్ నగర్, పద్మ నగర్ ఫేస్-2 వరకు నిర్వహించిన పాదయాత్ర కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొలను హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న భాజపా ప్రభుత్వం దేశ రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను ప్రజలందరికీ తెలియచేస్తూ, జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ రచయిత అంబేద్కర్ త్యాగాలను తెలియచేస్తు ప్రజలను చైతన్యవంతం చేయడం కోసమే ఈ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, 131 డివిజన్ మాజీ అధ్యక్షులు కృష్ణ యాదవ్, రాధ కృష్ణ, పెంటయ్య ముదిరాజ్ సిద్దయ్య, 131 డివిజన్ మహిళ అధ్యక్షురాలు సుజాత, మహిళా నాయకురాలు సుజాత, అశ్విని, హేమావతి, సంగీత, అంకిత, లత, శ్రీను, జ్యోతి, అగమ్య, వీరేష్, సాగర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాలుగా చెరువుల అభివృద్ధి

విశాలాంధ్ర - పటాన్ చెరువు : పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని తిమ్మక్క చెరువు, తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి గ్రామ పరిధిలోని ఎంక చెరువులను హెచ్ఎండిఏ ద్వారా 10 కోట్ల 78 కోట్ల లక్షల రూపాయలతో పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని పటాన్ చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి రెండు చెరువుల వద్ద సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్చెరు, ముత్తంగి పరిధిలో ప్రజలకు ఆహ్లాద కేంద్రాలుగా ఉండేందుకు చెరువులను సుందరీకరణ చేపడుతున్నామని తెలిపారు. ప్రతి చెరువు కట్ట పైన సెంట్రల్ లైటింగ్ సిస్టం, గ్రీనరీ, వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు పార్క్, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అతి త్వరలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. నిధులు సరిపోని పక్షంలో సిఎస్ఆర్ ద్వారా మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, హెచ్ఎండిఏ చెరువుల విభాగం డిఈ రామకృష్ణ, ముత్తంగి మాజీ సర్పంచ్ ఉపేందర్, తెల్లాపూర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కాంగ్రెస్ పార్టీ పటాన్చెరువు పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కుమార్ గౌడ్, సిల్వేరి శ్రీనివాస్, మేరాజ్ ఖాన్, కిట్టు, రామకృష్ణ, యాదయ్య, ప్రభాకర్ గుప్తా, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, అంజాద్ పాల్గొన్నారు.

వ్యక్తిగత వైద్యసేవలకు మరో ముందడుగు

విశాలాంధ్ర - శేరిలింగంపలి: వరల్డ్ హెల్త్ డే సందర్భంగా, కేర్ హాస్పిటల్స్ సరికొత్త 'సంగం' అనే ప్రత్యేక మెంబర్‌షిప్ కార్డును ప్రారంభించింది. ఈ కార్డు ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కేర్ హాస్పిటల్స్ తన కట్టుబాటును మరింత బలోపేతం చేసింది. హైదరాబాద్‌లోని అన్ని కేర్ హాస్పిటల్స్‌లో ఈ కార్యక్రమాన్ని ఒకేసారి ప్రారంభించారు. బంజారా హిల్స్ ఆసుపత్రిలో క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా ఈ కార్డును ప్రారంభించగా, ఇతర ఆసుపత్రుల లో గ్రూప్ సిఎఫ్ఓ విశాల్ మహేశ్వరి, గ్రూప్ సిఇఓ జస్దీప్ సింగ్, గ్రూప్ చీఫ్ సెల్స్, మార్కెటింగ్ ఆఫీసర్ శలభ్ డాంగ్, మెడికల్ సర్వీసెస్ చీఫ్ డాక్టర్ నిఖిల్ మాథుర్, సిహెచ్ఆర్ఓ డాక్టర్ అమిత్ సింగ్, తెలంగాణ మాజీ డీసీపీ డాక్టర్ ఆర్.ఎస్.వి. బద్రినాథ్ వంటి ప్రముఖులతో పాటు ఆసుపత్రుల అధిపతులు, వైద్య బృందాలు కూడా ఈ ముఖ్యమైన కార్యక్రమంలో పాల్గొన్నారు. 'సంగం' కార్డ్ ద్వారా రోగులకు ప్రాధాన్యత కలిగిన సేవలు, అత్యవసర సేవలు, వైద్య చికిత్సలపై ప్రత్యేక డిస్కౌంట్లు లభించనున్నాయి. ఈ కార్డ్ హైదరాబాద్ లోని హైటెక్ సిటీ, బంజారా హిల్స్, నాంపల్లి, ముషీరాబాద్, మలక్ పేట్ కేర్ హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉంటుంది. ఈ ప్రారంభ కార్యక్రమంలో క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా మాట్లాడుతూ, "అందరికీ సులభంగా అందే, అవసరానికి అనుగుణంగా ఉండే వ్యక్తిగత ఆరోగ్య సేవలు ప్రతి ఒక్కరి కి హక్కుగా ఉండాలి అని నేను బలంగా నమ్ముతున్నాను. 'సంగం' ప్రారంభం ద్వారా కేర్ హాస్పిటల్స్ మంచి వైద్యం అందరికీ అందించే దిశగా ముందడుగు వేసింది.

జీవో నెంబర్ 21ను ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా కొనసాగుతున్న సుమారు1200 మంది అధ్యాపకులను క్రమబద్ధీకరించిన తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని తెలంగాణ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకులు డాక్టర్ ఈ ఉపేందర్‌రావు, డాక్టర్ ఏ పరుశురాం, డా.ధర్మతేజ, డా.వి కుమార్, డాక్టర్ విజయేందర్ రెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 15 నుండి 30 సంవత్సరాలుగా విశ్వవిద్యాలయాలనే నమ్ముకొని బోధనా, పరిశోధనలపై ఉన్న మక్కువతో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తూ చాలీచాలని వేతనాలతో జీవితాలను వెళ్లదీసుకుంటూ వస్తున్న వారిని విస్మరించటం అత్యంత దారుణమని వాపోయారు. విశ్వవిద్యాలయ అధ్యాపక నియామకాలపై రూపొందించిన విధివిధానాలను జీవో నెంబర్ 21 రూపంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విషయం విధితమే అని, కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యను పరిష్కరించకుండా ఉద్యోగ నియామకాలను చేపట్టనీయమని వారు హెచ్చరించారు. విశ్వవిద్యాలయలో బోధన, పరిపాలన బాధ్యతలను నిర్విరామంగా, అత్యంత ప్రతిభావంతంగా నిర్వర్తిస్తున్న తమను విస్మరిస్తే సహించేది లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా విశ్వవిద్యాలయ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వారి గురించి పట్టించుకోకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. మంత్రులు శ్రీధర్ బాబు సీతక్క, బట్టి విక్రమార్క, ప్రతిపక్ష నాయకులుగా ఉన్నప్పుడు వారిని రెగ్యులరైజ్ చేయాలని కోరామని గుర్తు చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని అసెంబ్లీ సాక్షిగా డిమాండ్ చేసి ఇప్పుడు వారి సమస్యను పరిష్కరించకుండా ఉండటం ఓడ ఎక్కే ముందు ఓడ మల్లయ్య ఓడ దిగిన తర్వాత బోడ మల్లయ్య అన్న చందంగా ఉందని వారు దుయ్యబట్టారు. అధ్యాపక నియామక విధివిధానాల కమిటీ చైర్మన్గా ఉన్న ఘంటా చక్రపాణి ఉద్దేశ పూర్వకంగా కాంటాక్ట్ అధ్యాపకులను పక్కకు పెట్టి ఉద్యోగ నియామకాల ప్రక్రియ పట్ల అత్యుత్సాహం ప్రదర్శించడం వెనక ఉన్న ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జియో నెంబర్ 21 ఉపసహరించుకొని కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రతతో కూడిన యూజీసీ వేతనాలను వర్తింపచేసిన తర్వాతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కొద్దిమంది యూనివర్సిటీ వీసీ లు సీఎం కు తప్పుడు సమాచారం ఇచ్చి వారిని పక్కదారి పట్టించడం సరికాదన్నారు. వారి సమస్య పరిష్కారం కాకపోతే త్వరలో విశ్వవిద్యాలయాలన్నిటిని స్తంభింపజేసే విధంగా తరగతులను బహిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.చిర రాజు, డా.కనకయ్య, డా. ఆశ్లేష, డాక్టర్ సునీత, డా. మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14న గిరిజన శక్తి రాజ్యాంగ రక్షణ ర్యాలీ

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఏప్రిల్ 14న బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతినీ పురస్కరించుకొని బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్ రావ్ విగ్రహం నుండి ట్యాంక్ బండ్ లోనీ సచివాలయం పక్కన ఉన్న 125 అడుగుల బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంఘాలు అలాగే ప్రజా సంఘాలు విద్యార్థి సంఘాలు కళాకారులతో భారీ ఎత్తున గిరిజన శక్తి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ రక్షణకై భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకటేష్ చౌహన్ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పేద అణగారిన, గిరిజన దళిత బహుజన వర్గాలకు అన్యాయం చేస్తూ భవిష్యత్తులో వారికీ రిజర్వేషన్లను లేకుండా చేయాలని కుట్ర చేస్తుందని ఆరోపించారు. గిరిజనుల భాషలను గుర్తించకుండా అవమానిస్తుందని ఎన్నో ఏళ్ల నుంచి బంజారా భాష "గోర్ భోలి"ని ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తున్న పట్టించుకోవటం లేదని ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని రక్షించాల్సిన బాధ్యత ఈ దేశంలో ఉండే సబ్బండ వర్గాల ప్రజలకు ఉందన్నారు. ఈ రాజ్యాంగ రక్షణ ర్యాలీ కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్కరు సూటు కోటు వేసుకొని, రాజ్యాంగాన్ని చేత పట్టుకొని రావాలన్నారు. అనంతరం గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ రాజేష్ నాయక్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి సుమారు 12 ఏళ్ల అయినా పేదవారి అకౌంట్లో నల్లధనం తీసుకొచ్చి వేస్తానని చెప్పి బిజెపి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అలాగే ప్రైవేట్ సెక్టార్లో రిజర్వేషన్ ఇవ్వకుండా కుట్ర చేస్తుందని, నేడూ మోడీ అంబానీ, అదానీలకు వత్తాసు పలుకుతూ దేశాన్ని మొత్తం ప్రైవేట్ సెక్టార్ నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. దేశ ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని రాబోయే కాలంలో గిరిజన హక్కుల కోసం ఛలో ఢిల్లీ కార్యక్రమం కూడా నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలుపడం తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో గిరిజన శక్తి రాష్ట్ర నాయకులు కార్తీక్ నాయక్, భరత్, చిరంజీవి నాయక్, మున్నా నాయక్, శంకర్ నాయక్, శ్రీమన్ నాయక్, ప్రవీణ్ నాయక్, శివా చౌహన్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

కమ్మసంఘం భవనం ప్రారంభం

విశాలాంధ్ర - శేరిలింగంపలి: నిజామాబాద్ జిల్లా లోని బోధన్‌లో నూతనంగా నిర్మించిన కమ్మసంఘం భవనం ప్రారంభోత్సవం కార్యక్రమంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య, తెలంగాణ అధ్యక్షులు సివి రావు, రాష్ట్ర హస్తకళల మాజీ చైర్మన్ అమర్ నాథ్ బాబు, కమ్మ సంఘం ప్రతినిధులతో కలిసి పాల్గొని బోధన్ కమ్మ సంఘం భవనాన్ని కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ అధ్యక్షులు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ కమ్మసంఘం వారు నూతనంగా నిర్మించిన కమ్మసంఘం భవనంను ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, అన్ని హంగులతో సకల సౌకర్యాలతో నిర్మించుకోవడం జరిగినది అని ఇక్కడి ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని, చిన్న చిన్న సమావేశాలు, వివాహాది శుభకార్యాలు, బర్త్ డే వంటి ఫంక్షన్ లు నిర్వహించుకోవడానికి ఎంతగానో తోడ్పడుతుంది అని, మరియు విడిది కోసం రూములు ఏర్పాటు చేయడం జరిగినది అని ప్రతి ఒక్కరి కి అందుబాటులో ఉంటుంది అని చక్కగా సద్వినియోగం చేసుకోవాలని, భవనం నిర్మాణం కోసం సహకరించిన దాతలకు, ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృత్ఞతలు తెలియచేస్తున్నాను అని, పేద విద్యార్థులకు వసతి గృహం తో పాటు ఉచిత భోజనం, వసతి, దుస్తులు పంపిణీ చేయడం అనేక సామాజిక కార్యక్రమాలు నిరవహిస్తున్న బోధన్ కమ్మ సంఘం సభ్యులను ప్రత్యేకంగా అభినదిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, పునుకొల్లు నాగభూషణం, పాతూరు వెంకట్రావు, పొట్లూరు పాండురంగారావు, తాళ్లూరి జీవన్ కుమార్ ముప్పనేని అప్పారావు, పోలవరపు శ్రీనివాస ప్రసాద్, ప్రభాకర్,నాయకులు, బోధన్ కమ్మసంఘం ప్రతినిధులు, కమ్మ సంఘం సోదరులు, మహిళలు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర - పటాన్ చెరువు : పటాన్ చెరువు మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. డివిజన్ కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో సోమవారం ఉదయం నూతన అధ్యక్షుడిగా నాయికోటి భోజయ్య ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులందరూ తమ తమ ప్రమాణ స్వీకారాలను పూర్తి చేశారు. నూతన కార్యవర్గంలో మున్నూరు కాపు కుల సభ్యులందరికీ సముచిత న్యాయం జరిగేలా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నాయికోటి భోజయ్య మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా రెండు కొత్త హామీలకు శ్రీకారం చుట్టారు. మున్నూరు కాపు కుల సంఘ సభ్యులలో ఎవరైనా అకాల మృతి చెందితే, గతంలో 10 వేలకే పరిమితమైన దహన సంస్కారాల ఆర్థిక చేయూతను 21 వేలు అందించేలా నూతన కార్యవర్గం ఆమోదించింది. సంఘ సభ్యులలో ఎవరైనా నిరుపేద ఆడబిడ్డ కల్యాణానికి పూస్తే మెట్టెలు ఇస్తామని అధ్యక్షుడు తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీలన్నింటినీ విడతల వారీగా అమలు చేస్తామని ఆయన తెలిపారు. కొలువుదీరిన పాలకమండలి అధ్యక్షులుగా బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా ఉప్పరి రమేష్ కుమార్, ముఖ్య సలహాదారుడిగా నర్ర బిక్షపతి, గౌరవ సలహాదారులుగా కాసాల శంకర్, బాయికాడి పెంటయ్య, కోశాధికారిగా గాదె మహేందర్, సహాయ కోశాధికారిగా మేకల శివకుమార్ ఉపాధ్యక్షులుగా నాయికోటి జీతయ్య, కాసాల యాదయ్య, నర్ర రామారావు, మైలారం అశోక్, గాదే సుధాకర్, యంజాల మల్లేష్ కార్యదర్శులుగా కొడకంచి భార్గవ్, మేకల జగదీష్, సంయుక్త కార్యదర్శులుగా గాదె శ్రీనివాస్, సంజీవ్, నాయి కోటి సత్యం, నర్రా సత్యనారాయణ, ఉప్పరి అభిషేక్ కుమార్, ప్రచార కార్యదర్శులుగా యంజాల రాజేష్, మున్నూరు విక్రం, మల్లం పవన్, నాయికోటి శ్రీకాంత్‌లతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అభినందించిన ఎమ్మెల్యే పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మున్నూరు కాపు సంఘం కొత్త పాలక మండలిని అభినందించారు. సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు నూతన కార్యవర్గానికి తన సహకారం ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాయికాడి విజయ్, నివర్తిదేవ్ ఎట్టయ్య, టప్పా కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొల్కూరి నరసింహారెడ్డి, ఉప్పరి నర్సింలు పాల్గొన్నారు.

మహల్ ఎలికట్టలో కొత్తరేషన్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలంలోని మహల్ ఎలికట్ట గ్రామంలో నూతన రేషన్ షాపును ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై రేషన్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పేదలు పడుతున్న కష్టాలు తనకు తెలుసని ఎవరైనా తన దృష్టికి సమస్యలు తీసుకువస్తే చెప్పిన వాటిలో కొన్ని అయిన తీర్చే సత్తా ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల విషయంలో అందరూ సమైక్యంగా ఉంటేనే పనులు జరుగుతాయని సూచించారు. మహల్ ఎలుకట్టలో రేషన్ షాపు కోసం మహిళలు గతంలో తన దృష్టికి ఎన్నోసార్లు తీసుకువచ్చారని అయితే వారి అదృష్టం మేరకు ఇప్పుడు నూతన షాపును ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా ఈ ప్రాంత అభివృద్ధికి తన శక్తి వచనం లేకుండా కృషి చేస్తానని అన్నారు. అనంతరం గ్రామంలో నూతన రేషన్ షాపును ఏర్పాటు చేయడం పట్ల ఎమ్మెల్యే శంకర్‌కు మహిళలు పాదాభివందనం అంటూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో పార్థసారథి, పంచాయతీ కార్యదర్శి తేజస్విని, నాయకులు చల్ల శ్రీకాంత్ రెడ్డి, బాల్ రాజ్ గౌడ్, బద్దుల మల్లయ్య యాదవ్, గున్న శర్వలింగం యాదవ్, ఆర్ల యాదయ్య యాదవ్, చంద్రయ్య, వెంకట్ రామ్‌రెడ్డి, శ్రీశైలం, బుద్ధ నరసింహ, వెంకటేష్ గౌడ్, శివ, యూసుఫ్, ఆజం తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన నెమలి అనిల్ కుమార్

విశాలాంధ్ర - కాప్రా : మల్లాపూర్ డివిజన్ లోని నాగలక్ష్మి నగర్ కాలనీలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోయలకొండ రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ వేసవికాలంలో ఎండ తీవ్రత ఒక్కసారిగా పెరగడం వలన అనేక అవసరాలకు బయటికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందుల పడుతూ ఉంటారని, వారి ఇక్కట్లను గుర్తించి జన సంచార ప్రాంతాల్లో వారి దాహం తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాడం చాలా అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అడ్వైసర్ పీజీ సుదర్శన్, మల్లాపూర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బండి సంపత్ గౌడ్, మల్లాపూర్ డివిజన్ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు బాతరాజు రాహుల్, మల్లాపూర్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మైథిలీ రింకు, మల్లాపూర్ డివిజన్ ఎన్ ఎస్ యు ఐ ఉపాధ్యక్షుల సాయి తేజ, నవీన్, యాసీన్, నాయుడు, సాయి రామ్ గౌడ్, సాయి రెడ్డి, సూరజ్, సాయి, అజామ్, ఉపేందర్, సందీప్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి : సీపీఐ

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణపై చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం బోడుప్పల్ కార్పొరేషన్ కమిషనర్ కె.శైలజకి వినతిపత్రం అందజేశారు. బోడుప్పల్‌లో వివిధ డివిజన్‌లో జరుగుతున్న అక్రమ సెల్లార్లు, అనుమతులు లేని బహుళ అంతస్తులు నిర్మాణాలు వక్ఫ్ బోర్డులో అక్రమ నిర్మాణాలు, షెడ్ నిర్మాణాలు, షట్టర్ల, రోడ్డు కబ్జా చేసి నిర్మాణాలు జరుగుతున్న వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్, సిపిఐ నాయకులు సిహెచ్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆహార భద్రతకు పెద్దపీట

విశాలాంధ్ర - శేరిలింగంపలి: శేరిలింగంపల్లి డివిజన్‌లోగల నెహ్రూ నగర్‌లోని రేషన్ షాప్‌లో ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన సన్న బియ్యం పంపిణి కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల ఆహార భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని అన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభం అయ్యిందని దేశంలోనే సన్న బియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని ప్రజాప్రభుత్వం అని రాష్ట్రంలో ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా ఈరోజు ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తుంది అనడానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యాదా గౌడ్, మాజీ కౌన్సిలర్ రాజేశ్వరమ్మ, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, వార్డ్ మెంబర్ పర్వీన్ బేగం, కేఎన్ రాములు, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, శ్రీకాంత్, కుమార్, రంజిత్, నాని, ఎల్లదాస్, దస్తగిర్, జగదీశ్, రాకేష్ స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సేవ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ శిబిరంలో ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సేవ్ హాస్పిటల్ నందు కార్డియాలజీ, యూరాలజీ, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, పీడియాట్రిక్స్ మొదలైన సేవలు తక్కువ ధరలకే సామాన్యులకు అందుబాటులో ఉన్నాయని ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకోవాలని హాస్పిటల్ ఎం.డి సామ రాజి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ.. వైద్య శిబిరాల్లో ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం వల్ల సకాలంలో వ్యాధి నిర్ధారణ జరుగుతుందని.. తద్వారా సకాలంలో చికిత్స పొందవచ్చన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలు తరచూ ఏర్పాటు చేస్తూ ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న సేవ్ హాస్పిటల్ యాజమాన్యానికి, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో శంకర్ రెడ్డి, మాస రమేష్ పాల్గొన్నారు.

రబీ ధాన్యం కొనుగోలుకు చర్యలు

మంత్రి నాదెండ్లకు సీపీఐ నేత రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రబీలో పండించిన ధాన్యాన్ని మద్దతు ధరల ప్రకారం జాప్యం లేకుండా వెంటనే కొనుగోలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సోమవారం ఆయన ఒక లేఖ రాశారు. ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు గ్రామంలో ధాన్యం పండించిన రైతులు, కౌలురైతులు ధాన్యం విక్రయించడంలో అనేక ఇబ్బందులు పడుతున్నారని, ధాన్యాన్ని కొనుగోలు చేయాలని స్థానిక కొనుగోలు కేంద్రాల దగ్గరకు రైతులు వెళ్తే... తేమ శాతం ఆధికంగా ఉందని సంబంధిత అధికారులు తిరస్కరిస్తూ, రైస్ మిల్లర్లతో మాట్లాడుకో వాల్సిందిగా చెబుతున్నారని ఆ లేఖలో వివరించారు. ధర కూడా రైస్ మిల్లర్లతోనే మాట్లాడుకుని రావాలని, మిల్లర్లు ఎవరికి సంచులు ఇవ్వమంటే వాళ్లకే ఇస్తామంటూ కొనుగోలు కేంద్రాల్లో అధికారులు ఖరాఖండిగా చెబుతున్నారని, దీంతో ధాన్యం పండించిన రైతులు తమ పంటలెలా విక్రయించుకోవాలో తెలియక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. అకాల వర్షాలు పడటంతో ధాన్యం తడిసిపోయి దెబ్బతింటుందేమోని తీవ్ర ఆందోళన చెందుతున్నారని, కొంతమంది రైతులు మిల్లర్ల దగ్గరికి వెళ్తే 75 కేజీల బస్తా రూ.1300లకే ఇవ్వమని... అలాగైతేనే సంచులిస్తామని, కాటా వేస్తామని లేకపోతే ఒక్క గింజ కూడా కొనుగోలు చేసేది లేదని మిల్లర్లు రైతులను బెదిరిస్తున్నారని వివరించారు. కొనుగోలు కేంద్రాల అధికారులు ఉత్సావ విగ్రహాలుగా మారిపోయారని... మూలపాడు గ్రామంలో కొనుగోలు కేంద్రాల అధికారులు ఈలప్రోలులో ఉన్న మల్లయ్య రైస్ మిల్లు యజమానితోగాని, పి.నైనవరంలోగల రెడ్డి నాయుడు రైస్ మిల్లు యజమానితోగాని మాట్లాడుకోవాలని చెబుతున్నారు. మిల్లర్లు చెప్పిన వారి ధాన్యాన్ని మాత్రమే మేము ఆన్‌లైన్లో బుక్ చేస్తామని చెబుతున్నారు. ఈ రెండు గ్రామాలే కాకుండా గొల్లపూడి, గుంటుపల్లి, రాయనపాడు, పైదూరుపాడు, తదితర గ్రామాల్లో ధాన్యం అమ్ముకోవడంలో రైతులు, కౌలురైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మీరు జోక్యం చేసుకొని మద్దతు ధరల ప్రకారం పండిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని, రైతులకు అవసరమైన గోనె సంచులను కొనుగోలు కేంద్రం నుంచి నేరుగా రైతులకు అందించాలని, కొనుగోలు కేంద్రాల్లోనే తేమశాతాన్ని నిర్ధారించి ఫైనల్ చేయాలన్నారు. మళ్లీ మిల్లర్లు తేమ శాతాన్ని చూడకూడదని, కొనుగోలు కేంద్రాల నుంచే నేరుగా మిల్లుకు తోలాలని పేర్కొన్నారు. మధ్యలో మిల్లర్ల జోక్యాన్ని నివారించాలని, ధాన్యం కొనుగోలులో మిల్లర్ల అక్రమాలను, అన్యాయాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి కొనుగోలు కేంద్రం పరిధిలో జరుగుతున్న అవినీతిని అరికట్టడానికి, మిల్లర్ల అక్రమాలను నివారించడానికి మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు.

19 ఏళ్ల బాలికపై ఘోరం

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. 19 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేసిన దుండగులు ఆమెపై వారం రోజుల పాటు సామూహిక అత్యా చారానికి ఒడిగట్టారు. ఈ కిరాతక ఘటనలో మొత్తం 22 మంది నిందితులు కాగా... ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఉత్తర వారణాసికి చెందిన బాలిక మార్చి 29న ఫ్రెండ్ ఇంటికి వెళ్లేందుకు తన ఇంటి నుంచి బయల్దేరింది. గతంలో అనేక మార్లు ఇలాగే వెళ్లినా... సురక్షితంగా ఇంటికి చేరుకొనేది. కానీ, ఆరోజు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఏప్రిల్ 4న కిడ్నాపర్లు ఆమెను ఓ రోడ్డులోని కూడలిలో మత్తు మందు ఇచ్చి వదిలి పెట్టగా... సమీపంలోని తన ఫ్రెండ్ ఇంటికి ఎలాగో చేరుకుంది. దీంతో వారు ఆమెను ఇంటికి చేర్చారు. తనపై జరిగిన దారుణాన్ని బాలిక తన తండ్రికి చెప్పడంతో కుటుంబ సభ్యులు ఏప్రిల్ 4న పోలీసులను ఆశ్రయించారు. పలుచోట్లకు తీసుకెళ్లి తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని బాలిక చెప్పినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అదేరోజు రాత్రి హుకుల్‌గంజ్, లల్లాపుర ప్రాంతా లకు చెందిన కొంతమందిని అరెస్టు చేశారు.

గ్యాస్ ధరల పెంపుపై నిరసనలు

రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ నిరసనలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్‌పై కేంద్రం రూ.50 పెంచిందని, గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లతోపాటు ఉజ్వల పథకం లబ్ధిదారులకు కూడా ఈ పెంపుదల వర్తిస్తుందని ప్రకటించడం దుర్మార్గమని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్యాస్ ధర పెంచి ప్రజల నెత్తిన మరో భారం మోపిందన్నారు. ఈ గ్యాస్ ధరల పెంపును తీవ్రంగా ఖండించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ధరల పెంపుపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని సీపీఐ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

సీపీఐ శత వసంతాల పాటల వీడియో విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఐ శత వసంతాల వేడుకల సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి రూపొందించిన పాటల వీడియోను విజయవాడ సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాల కాలంలో భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో అనేక వీరోచిత పోరాటాలు, త్యాగాలు చేసిందన్నారు. ముఖ్యంగా అణగారిన ప్రజల హక్కుల సాధనలో కీలక పాత్ర పోషించిందని వివరించారు. ఈ వందేళ్ల గమనంలో అనేక ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ పోరాటపటిమతో ముందుకు సాగిందని గుర్తు చేశారు. సీపీఐ చరిత్రను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడానికి ఇలాంటి పాటలు, వీడియోలు ఎంతగానో దోహదపడతాయని కొనియాడారు. దేశంలో అనేక సంక్షోభాలు ఎదురవుతున్న నేపథ్యంలో సామాజిక రుగ్మతలపై, పాలకుల అనాలోచిత విధానాలపై వాస్తవాలను ప్రజలకు వివరించి, ప్రజలను చైతన్యపరచడానికి కవులు, కళాకారులు ముందుకు రావాలన్నారు. దృశ్యంగా మలచిన 'కమ్యూనిజమా వర్ధిల్లా... సీపీఐ నీకు వందేళ్లు' అనే పాటను యడ్ల కృష్ణకిషోర్ రచించగా, చంద్రనాయక్ ఆలపించారు. వీడియోను ప్రజానాట్య మండలి నాయకులు కుమార్ మహంతి లక్ష్మణరావు సహకారంతో రూపొందించారు. వారికి రామకృష్ణ అభినందనలు తెలిపారు. ఈ పాటల వీడియో విడుదల కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్ర నాయక్, పాట రచయిత యడ్ల కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

13న వంద పడకల ఆస్పత్రికి శంకుస్థాపన

మంగళగిరిని అభివృద్ధికి చిరునామాగా మారుస్తా: మంత్రి లోకేశ్

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరిలో ఈ నెల 13న వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని, దేశంలోనే మంగళగిరిని అభివృద్ధికి చిరునామాగా మారుస్తానని, నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రజలందరి సహకారం కావాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మన ఇల్లు-మన లోకేశ్ కార్యక్రమంలో భాగంగా యర్రబాలెం డాన్ బాస్కో స్కూలు ఆవరణలో సోమవారం కొలన కొండ గ్రామానికి చెందిన 231 మందికి, పద్మశాలి బజార్ 127 మందికి, పెనుమాక గ్రామానికి చెందిన 179 మందికి ఉండవల్లి గ్రామానికి చెందిన 77 మందికి, ఇప్పటం గ్రామానికి చెందిన 10 మంది ప్రజలకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ నివసిస్తున్న ప్రాంతంలోనే పట్టాలు ఇవ్వాలన్నది దశాబ్దాలుగా మీ అందరి కల. గతంలో ఒక్కొక్కరికి జిరాక్స్ పేపర్లకే 10 వేలకు పైగా ఖర్చయ్యాయి... చెప్పులరిగాయి... ఇవన్నీ చూసి మీకు పట్టాలిప్పిస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చాను. ఇక్కడ మూడురకాల భూములున్నాయి. తొలివిడతలో 3 వేల మందికి పట్టాలిస్తున్నాం. రెండో విడతలో ఎండోమెంట్, రైల్వే భూముల్లో నివసించేవారికి పట్టాలిస్తాం. అటవీ, ఇరిగేషన్ భూములకు పట్టాలు ఇవ్వడానికి సమయం పడుతుంది. వాటికి మూడవ విడతలో అందజేస్తామని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే గౌరవంగా మీకు ఇంటి పట్టాలు అందజేస్తున్నానని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 3 వేల మందికి బట్టలు పెట్టి మరీ పట్టాలను అయిదు రోజుల పాటు నిలబడి ఇస్తున్నా, అది మీపై నాకున్న చిత్తశుద్ధి, నిబద్ధత అని తెలిపారు. రెండవ కేబినెట్ సమావేశంలోనే వంద పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి అనుమతి వచ్చిందని, ఈ నెల 13న ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని అన్నారు. మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడతానని మంత్రి లోకేశ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్, వెల్ఫేర్ డెవలప్‌మెంట్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, గుంటూరు జిల్లా పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, కల్లం రాజశేఖర్ రెడ్డి, కొమ్మారెడ్డి కిరణ్, ఆవల రవికిరణ్, కొల్లి శేషు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధర ఉపసంహరించాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇందుకు వ్యతిరేకంగా పార్టీ శ్రేణులు నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లకు, ఉజ్వల పథకం లబ్ధిదారులకు సిలిండర్‌పై రూ.50లు పెంచడం దారుణమని, ఇప్పటికే దేశంలో ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్న దశలో నిత్యావసరాలైన గ్యాస్ ధర పెంచడం ప్రజల నెత్తిన బండ వేయడమేనని పేర్కొన్నారు. పెంచిన గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ పథకం పైన కూడా భారం పడుతుందని, కాబట్టి పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని కోరారు.

డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన

మే 4న కేంద్రంతో చర్చలకు రైతు నాయకులు: దలేవాల్ వెల్లడి

చండీగఢ్: పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కి చట్టపరమైన హామీతో సహా రైతుల డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించే వరకు రైతుల ఆందోళన కొనసాగుతుందని రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దలేవాల్ సోమవారం స్పష్టం చేశారు. రైతులు సమావేశానికి హాజరుకాలేదనే సాకును ప్రభుత్వం చెప్పడానికి వారు ఇష్టపడనందున, మే 4న కేంద్ర ప్రతినిధులతో జరిగే ప్రతిపాదిత చర్చలలో రైతు నాయకులు పాల్గొంటారని ఆయన అన్నారు. 'మేము సమావేశానికి హాజరవుతాం. మా డిమాండ్లను గట్టిగా లేవనెత్తుతాం' అని తెలిపారు. 130 రోజుల తర్వాత ఆదివారం తన నిరవధిక నిరాహార దీక్షను ముగించిన దలేవాల్... వారి తదుపరి కార్యాచరణను సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) సమావేశంలో నిర్ణయిస్తారని చెప్పారు. ఈ రెండు సంస్థల ఉమ్మడి వేదికకు ఆయన సీనియర్ నాయకుడు. పంజాబ్, హర్యానా మధ్య ఉన్న శంభు, ఖనౌరి సరిహద్దు పాయింట్ల వద్ద రైతులు తమ డిమాండ్ల కోసం ఒత్తిడి తీసుకురావడానికి దిల్లీకి ప్రదర్శనకు భద్రతా దళాలు అనుమతించకపోవడంతో ఎస్‌కేఎం, కేఎంఎ ఒక సంవత్సరం పాటు రైతుల ఆందోళనకు నాయకత్వం వహించాయి. మార్చి 19న నిరసన స్థలాలను పోలీసులు తొలగించారు. పంజాబ్‌లోని ఫతేఘర్ సాహిబ్ జిల్లాలోని 'కిసాన్ మహాపంచాయత్' కు దలేవాల్ తన ఆమరణ నిరాహార దీక్షను విరమించాలని 'సంఘత్' చేసిన అభ్యర్థనను అంగీకరించినట్లు తెలియజేశారు. ఖన్నాలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షల కోసం చేరిన ఒక రోజు తర్వాత సోమవారం ఆయన డిశ్చార్జ్ అయ్యారు. ఖన్నాలో రైతు నాయకుడు దలేవాల్ విలేకరులతో మాట్లాడుతూ 'ఎంఎస్‌పీకి చట్టపరమైన హామీతో సహా మా డిమాండ్లు ఆమోదించే వరకు ఇది కొనసాగుతుంది. ఈ ఆందోళనలో పంజాబ్‌లోని అనేక ప్రాంతాల్లో కిసాన్ మహాపంచాయత్‌లు జరుగుతున్నాయి' అని చెప్పారు. 'రాబోయే రోజుల్లో మేము రెండు వేదికల సమావేశాన్ని నిర్వహించి తదుపరి వ్యూహం గురించి నిర్ణయిస్తాం' అని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రైతులు, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల మధ్య మే 4న జరగనున్న సమావేశం గురించి అడిగినప్పుడు రైతు నాయకులు అందులో పాల్గొంటారని దలేవాల్ చెప్పారు. మరో రైతు నాయకుడు అభిమన్యు కోహర్ మాట్లాడుతూ తమ డిమాండ్లను ఆమోదించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. హర్యానా, రాజస్తాన్‌లో కూడా 'కిసాన్ మహాపంచాయత్' లు జరుగుతాయని చెప్పారు.

జూన్ 10 లోపు హంద్రి-నీవా పనులు పూర్తి

ఆర్థిక మంత్రి పయ్యావుల

విశాలాంధ్ర-ఉరవకొండ: హంద్రి-నీవా కాలువ పనులను జూన్ 10 నాటికి పూర్తి చేయాలని సీఎం ఆదేశమని... అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. అనంతపురం జిల్లా ఉరవకొండ-అనంతపురం మెయిన్ రోడ్డులో ఉరవకొండ పట్టణం వద్ద ఉన్న హంద్రి-నీవా కాలువ నుంచి రాగులపాడు రోడ్డు వరకు 35వ ప్యాకేజీ కింద జరుగుతున్న కాలువ వెడల్పు పనులను సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ హంద్రి-నీవా కాలువను విస్తరణ చేయాలన్న చంద్రబాబు నాయుడి సంకల్పం మేరకు 2014-19లో 40 శాతం పనులు పూర్తి చేశామన్నారు. రూ.3,800 కోట్లు కేటాయించడమే కాకుండా పనులు కూడా వెంటనే ప్రారంభించామన్నారు. జిల్లాలో 82 కిలోమీటర్ల కాలువలో 12 కి.మీ ఇప్పటికే పూర్తయిందని, జూన్ 10కి పనులన్నింటినీ పూర్తి చేస్తామని చెప్పారు. సీఎం చంద్రబాబు అమరావతి నుంచే ఇక్కడ పనులను సమీక్షిస్తున్నారని మంత్రి పయ్యావుల తెలిపారు. వచ్చే సీజన్‌కి కనీసం 8, 9 మోటార్లు వాడే విధంగా పనులు చేస్తాం.. సీఎం 12 మోటార్లు ఆడాలని లక్ష్యంగా చెప్పారని అన్నారు. మాల్యాల నుంచి జీడిపల్లి వరకు కాలువ వెడల్పు జరుగుతుందని, పనులు పూర్తయితే 3,800 క్యూసెక్కుల నీరు తెస్తామన్నారు. అనంతపురం జిల్లాలో జరగని లైనింగ్‌పై అనంతపురం నేతలు ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అన్ని చెరువులకు నీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హంద్రి-నీవా సీఈ నాగరాజు, ఎస్ఈ స్వరూప్ కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీఈటీలకు వెయిటేజ్ మార్కులు కలపాలి

ఈశ్వరయ్య, దేవేంద్ర గౌడ్ డిమాండ్

ఏపీవీవీపీఎస్, ఏఐవైఎఫ్ నాయకుల వినూత్న నిరసన

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలోని వ్యాయామ ఉపాధ్యాయులు (పీఈటీలు) కు ఈవెంట్స్ వెయిటేజ్ మార్కులు కలిపి ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయాలని ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి జి.ఈశ్వరయ్య, ఏపీవీవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేంద్ర గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ఆంధ్ర ప్రదేశ్ వ్యాయామ విద్య పోరాట సమితి (ఏపీవీవీపీఎస్), అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) అధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయ అభ్యర్థులు అనేక విన్యాసాలతో కూడిన వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య, దేవేంద్రగౌడ్ మాట్లాడుతూ క్రీడలు ఆడనివారు, వాటి పట్ల అవగాహన లేని వారు సాధారణ డిగ్రీలు పొంది... ప్రొఫెషనల్ కోర్సులు చేసుకునేవారు ఏ ఉద్యోగం రాక కొంచెం చదువుకుంటే వ్యాయామ ఉపాధ్యాయులుగా ఉద్యోగం వస్తుందని అన్నారు. కళాశాలలకు వెళ్లి వ్యాయామ విద్య అభ్యసించకుండా బీపీడీ సర్టిఫికెట్లను మన రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాల్లో పొందిన వారు ప్రైవేట్ కళాశాలల్లో పీఈటీలుగా పని చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారికి ఉద్యోగాలు ఇస్తే... ఆంధ్ర ప్రదేశ్ క్రీడాకారుల భవిష్యత్‌ను నాశనం చేస్తారని విమర్శించారు. వ్యాయామ విద్యలో క్రీడాకారులకు న్యాయం జరగాలంటే నిజమైన వ్యాయామ ఉపాధ్యాయులకు అర్హత కలిగించే ఈవెంట్స్ మార్కులు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 1998, 2000, 2001 సంవత్సరం తెలుగుదేశం ప్రభుత్వం పాలనలో డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయుల సర్టిఫికెట్లకు, ఈవెంట్లకు 20 శాతం వెయిటేజ్ మార్కులు కల్పించి... వ్యాయామ విద్యలో క్రీడాకారులకు ప్రాధాన్యత కల్పించారని గుర్తు చేశారు. 2018 సంవత్సరంలోనూ 30 శాతం వెయిటేజ్ మార్కులు ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్‌లో జీవో నంబరు 11లో వ్యాయామ ఉపాధ్యాయుల నియామకంలో సిలబస్ మార్పులు చేసి ఫిజికల్ ఈవెంట్‌లు, స్పోర్ట్స్ మెరిట్ సర్టిఫికెట్లకు వెయిటేజ్ మార్కులు తీసి వేశారని అన్నారు. దీనివలన క్రీడాకారులకు అన్యాయం జరుగుతోందని గత ప్రభుత్వానికి తెలియజేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులకు ఈవెంట్లకు 30 శాతం వెయిటేజ్ మార్కులు ఇచ్చి... క్రీడాకారులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించేలా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కె.శివారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు, నిరుద్యోగ పోరాట జేఏసీ కన్వీనర్ లంకా గోవిందరాజులు, నరసింహులు, వెంకటేశ్వర్లు, మధు, చెల్లయ్య, వెంకట్, సుధాకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మందగల్ల సాయి కుమార్, ఏఐవైఎఫ్ నాయకులు సింగంశెట్టి మోహన్ ప్రసాద్, శ్రీరం రవికుమార్, గాడి అజయ్, గంట మమత, నరేష్, స్వప్న, రమేష్, షైనీ వివిధ జిల్లాల నుంచి వచ్చిన నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దుర్మరణం

విశాలాంధ్ర-సంబేపల్లె: హంద్రీనీవా కెనాల్ (హెచ్ఎన్ఎస్) పీలేరు యూనిట్-2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ (50) రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. విధి నిర్వహణలో భాగంగా పీలేరు నుంచి రాయచోటి కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌కు హాజరయ్యేందుకు వెళ్తుండగా అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం యర్రగుంట్ల దగ్గర ఎదురెదురుగా రెండు కార్లు ఢీ కొనడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో రమ తీవ్రంగా గాయపడ్డ రమ ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందారు. ఈ ఘటనలో మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను రాయచోటి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో బాధితులను జిల్లా కలెక్టర్ శ్రీధర్ పరామర్శించారు. మృతి చెందిన డిప్యూటీ కలెక్టర్ రమ అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు కోఆర్డినేటర్‌గా పని చేస్తున్నారు. ఆమె స్వస్థలం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం. చంద్రబాబు సంతాపం: హంద్రీనీవా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుగాలి రమ మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. రమ మృతి దురదృష్టకరమని కుటుంబసభ్యులకు ముఖ్యమంత్రి సానుభూతి తెలిపి ధైర్యంగా ఉండాలన్నారు. ప్రమాదంలో గాయపడిన మరో నలుగురికి అత్యవసర వైద్య చికిత్సలు అందించాలని అధికారులను ఆదేశించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవి మృతి చెందడం బాధాకరమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి ఆత్మకి శాంతి కలగాలని ప్రార్థిస్తూ, కన్నీటి నివాళి అర్పిస్తున్నామన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి యంత్రాంగాన్ని ఆదేశించారు.

మే 27 నుంచి కడపలో టీడీపీ మహానాడు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీ మహానాడును కడపలో దిగ్విజయంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు తెలిపారు. జిల్లా మంత్రి సవిత, రెవెన్యూశాఖమంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు రవిచంద్ర, రాంగోపాల్రెడ్డి, ఎమ్మెల్యేలు చైతన్యరెడ్డి, సుధాకర్యాదవ్, వరదరాజులరెడ్డి తదితరులతో కలిసి ఆయన నగరంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం స్థల పరిశీలన చేశారు. పల్లా మాట్లాడుతూ పార్టీ స్థాపించి 44వ వసంతంలోనికి అడుగుపెడుతున నేపథ్యంలో కడపలో మహానాడు నిర్వహిస్తున్నామన్నారు. నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకుని మే 27వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్జీవో కాలనీ 500 ఎకరాలుందని, సీకేదిన్నె మండలం జయరాజ్ గార్డెన్స్, ప్రభుత్వ స్థలం, ఎయిర్పోర్టు సమీపంలోని శాటిలైట్ సిటీ పరిశీలించామన్నారు. ఇక్కడి పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. 1200 పార్టీల్లో క్రమం తప్పకుండా నిబంధనలకు అనుగుణంగా నడిచే ఏకైక పార్టీ టీడీపీ అని కొనియాడారు.అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, బీటెక్ రవి, లింగారెడ్డి, భూపేష్ రెడ్డి, అమీర్ బాబు, సురేష్ హరిప్రసాద్, గోవర్ధన్ రెడ్డి, దుర్గాప్రసాద్, మేడా విజయశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఆక్వా రంగాన్ని ఆదుకుంటాం

అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆక్వా రంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శాసన సభ ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు అన్నారు. ఆక్వా రంగంలో రైతులు, సీడ్, ఫీడ్ వ్యాపారులు, ఎగుమతిదారులు ఈ నాలుగు రంగాలు అతి కీలకమని, ఈ సంక్షోభ సమయంలో వీరంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు. అమెరికా దిగుమతి సుంకాలను పెంచిన నేపథ్యంలో రైతులు, ఆక్వా రంగ నిపుణులు, వ్యాపార వేత్తలు, మత్స్య శాఖ ఉన్నతాధికారులతో విజయవాడలోని ఒక ప్రైవేటు హోటల్‌లో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి అచ్చెన్నాయుడు, శాసన సభ ఉప సభాపతి రఘురామ కృష్ణరాజు పాల్గొన్నారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కేవలం విదేశీ ఎగుమతుల పైనే ఆధారపడకుండా స్వదేశీ వినియోగం పెంచేలా పౌల్ట్రీలో నెక్ తరహాలో ఆక్వా రంగంలోనూ రొయ్య ఉత్పత్తుదారులతో ఒక కమిటీ వేసేందుకు ఆలోచిస్తున్నామని తెలిపారు. ఆక్వా రైతులు-ఎగుమతిదారులు ప్రస్తుత పరిణామాలకు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఇతర మార్గాల ద్వారా ఆక్వా రంగం కోలుకునేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మత్స్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ రావు, వేగేశ్న నరేంద్ర వర్మరాజు, రాష్ట్ర ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, జీఎఫ్ఎస్టీ డైరెక్టర్ సి.కుటుంబరావు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, మత్స్య శాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, ఆక్వా ఎగుమతిదారులు, ఉత్పత్తిదారులు, రైతులు పాల్గొన్నారు.

కేరళ హైకోర్టుకు ఎంపీ హైకోర్టు జడ్జి బదిలీ

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారిని కేరళ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం ఏప్రిల్ 3న నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. 'సుప్రీంకోర్టు కొలీజియం 2025 మార్చి 20, మార్చి 24 , ఏప్రిల్ 3వ తేదీలలో జరిగిన సమావేశాలలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ సుశ్రుత్ అరవింద్ ధర్మాధికారిని కేరళ హైకోర్టుకు బదిలీ చేయాలని సిఫారసు చేసింది' అని సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో సోమవారం అప్‌లోడ్ చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

దిల్లీలో యువతిపై కత్తితో దాడి

న్యూఢిల్లీ: దేశరాజధాని దిల్లీలో మరో దారుణం చోటుచేసుకుంది. రద్దీగా ఉన్న నడిరోడ్డుపై 19 ఏళ్ల యువతిపై నిందితుడు కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. దిల్లీలోని కంటోన్మెంట్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన యువతిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికుల్లో భయాందోళనలు కలిగించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం దాడికి పాల్పడిన నిందితుడు గతంలో బాధితురాలికి పరిచయమున్న వ్యక్తి అయివుండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.